www.visalaandhra.com

శనివారం
18-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 27
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

నైరుతితో 8 శాతం మిగులు వర్షపాతం

న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాలతో ఈ ఏడాది 8 శాతం మిగులు వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం వెల్లడించింది. సెప్టెంబర్ 30తో ముగిసిన మొత్తం నాలుగు నెలల రుతుపవనాల కాలంలో భారతదేశంలో సాధారణ వర్షపాతం 868.6మి.మీ కన్నా అధికంగా 937.2మి.మీ వర్షపాతం నమోదైందని, ఇది 8 శాతం అదనపు వర్షపాతాన్ని ఇచ్చినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల తిరోగమనం గురువారంతో పూర్తయిందని పేర్కొంది. సాధారణంగా అక్టోబర్ 15 నాటికి నైరుతి రుతుపవనాలు

- మిగతా 2 లో

కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఐ మద్దతు

విశాలాంధ్ర- హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు వచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఈ.టి .నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, కలవేణ శంకర్, ఎం. బాలనరసింహ,

- మిగతా 2 లో

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు: డీజీపీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : వివిధ పార్టీలు శనివారం తలపెట్టిన బంద్ శాంతియుతంగా నిర్వహించాలని డీజీపీ బి.శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. బంద్ పేరుతో అవాంఛనీయ సంఘటనలకు... చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే చట్టం ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తాయని, బంద్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడకూడదన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కాగా , 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ

- మిగతా 2 లో

నేడు బీసీల బంద్

రిజర్వేషన్లు సాధించే వరకూ ఉద్యమం
కృష్ణయ్య పిలుపు

విశాలాంధ్ర- బషీర్‌బాగ్/హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల సాధనకు శనివారం తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని బీసీ జేఏసీ (తెలంగాణ) చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కుల సంఘాలు మద్దతు ఇచ్చాయని తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వి.జి.ఆర్.నారగోని, కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థలలో బీసీలకు

- మిగతా 2 లో

సింగరేణి కార్మికులకు రూ.400 కోట్ల బోనస్

- బీసీ బంద్‌లో ప్రజలంతా పాల్గొనాలి
- అఖిలపక్షం ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధం
- సుప్రీం తీర్పుపై చర్చించి 23న మంత్రివర్గంలో నిర్ణయం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం : సింగరేణి కార్మికులకు దీపావళి కానుకగా 400 కోట్ల రూపాయలను బోనస్ ప్రకటిస్తున్నామని, దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటన పట్ల రాష్ట్ర ప్రభుత్వం తరపున సంతోషంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాల్లో సుఖ సంతోషాలతో వెలుగులు నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి కట్టుబడి ఉన్నామని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ సర్వే నిర్వహించామని చెప్పారు. సర్వే వివరాలతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాసన సభలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్‌కు పంపామన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో స్థానిక ఎన్నికల సమయంలో స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చట్టం తీసుకువచ్చిందని, ఆ చట్టాన్ని తొలగిస్తూ ఆర్డినెన్స్ ఇచ్చినట్లు వివరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్యా ఉద్యోగాల్లో

- మిగతా 2 లో

రెవెన్యూ వ్యవస్థ బలోపేతం

- ప్రతి మండలానికి ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- భూ పంచాయితీలకు శాశ్వత పరిష్కారం
- అందుబాటులోకి అత్యాధునిక సర్వే పరికరాలు
- భూ రికార్డులు స్పష్టంగా ఉండాలన్నదే ధ్యేయం: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర రైతాంగానికి మెరుగైన సేవలందించడానికి, భూ పంచాయితీలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనిలో భాగంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే గ్రామ పాలనాధికారులు (జీపీవో)ను అందుబాటులోకి తీసుకురాగా, తాజాగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సులభంగా భూ సేవలు అందేలా ప్రతి మండలానికి కనీసం నాలుగు నుంచి ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ కీలక నిర్ణయం

- మిగతా 2 లో

రూ.1.35 లక్షలు దాటిన
పసిడి ధర

హైదరాబాద్: దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.35 లక్షలు దాటి పరుగులు పెడుతోంది. శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,35,250కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల ధర రూ.1,21,725కి చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,81,000కి చేరింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో

- మిగతా 2 లో

ఇసుక దందా!

- మంత్రి ఇలాఖాలో అడ్డగోలు దోపిడీ
- మామూళ్ల మత్తులో 'మహానుభావులు'
- నిబంధనలకు పాతర
- యదేచ్ఛగా అక్రమ రవాణా
- సొమ్ము చేసుకుంటున్న మాఫియా
- తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ, మైనింగ్

విశాలాంధ్ర బ్యూరో -ఖమ్మం క్రైం: స్వయానా మంత్రి ఇలాఖాలోనే ఇసుక దందాకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. చీకటిపడితే చాలు ఇసుక అక్రమ రవాణాకు ట్రక్కులు క్యూ కడుతున్నాయి. కళ్లముందే టన్నుల కొద్దీ ఇసుక దోచేస్తున్నా అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదు. ఇసుక అక్రమ రవాణాపై అధికారులకు సమాచారమిచ్చినా పట్టించుకోవడం లేదంటూ స్థానికుల నుంచి ఆరోపణలు వినవస్తున్నాయి. ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతున్నా మామూళ్ల మత్తులో అధికారులు జోగుతున్నారంటూ ధ్వజమెత్తుతున్నారు. నదురుబెదురు లేకుండా తెల్లవార్లూ ఇసుక రవాణా చేసేస్తున్నారు. నిబంధనలకు పాతరేసి రూ.లక్షల్లో ప్రభుత్వానికి చెందాల్సిన సొమ్మును అక్రమార్కులు మింగేస్తున్నారు. అధికారులకు తోడు చోటా నాయకుల అండచూసుకుని మట్టి మాఫియా చెలరేగిపోతోంది. జిల్లా కలెక్టర్ హెచ్చరికలను సైతం బేఖాతర్ చేస్తున్నారు. పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాలలో యథేచ్ఛగా ఇసుకను బొక్కేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడంటూ ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు అక్కడక్కడ నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి హడావుడి చేయటం మినహా, పూర్తిస్థాయిలో కఠిన చర్యలు తీసుకోకపోవడం వలన ఇసుక మాఫియా చెలరేగిపోతోందని అంటున్నారు. నేలకొండపల్లి, ముదిగొండ మండలాల సరిహద్దు మీదుగా ఆంధ్ర రాష్ట్రం నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకునే పరిస్థితి లేదు.

గత కొన్నేళ్లుగా ఎక్స్‌కవేటర్ల సాయంతో ట్రక్కుల్లో ఇసుక నింపి అక్రమ రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రియల్ ఎస్టేట్, భవన నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతుండడంతో ఇసుక డిమాండ్‌ను బట్టి ట్రాక్టర్ ఇసుక రూ.6,500 నుంచి రూ. 8 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇసుక వాహనాలకు సరియైన ధృవపత్రాలు కూడా లేవని, లైసెన్సు లేకి కొందరు వాహనాలను నడుపుతున్నారని స్థానికుల నుంచి

- మిగతా 2 లో

మావోయిస్టులకు ఎదురుదెబ్బ

ఆశన్న సహా 208 మంది లొంగుబాటు
పెద్దఎత్తున ఆయుధాల అప్పగింత

విశాలాంధ్ర-చింతూరు: చరిత్రలోనే మావోయిస్టు పార్టీకి అతిపెద్ద ఎదురుదెబ్బ తగిలింది. 2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్‌గా మార్చివేస్తామని, ఒక్క మావోయిస్టు లేకుండా పూర్తిగా తుడిచిపెట్టేస్తామని చెప్పిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా... అటుగా అడుగులు వేస్తున్నారు. అనుకున్న లక్ష్యం సాధించే దిశలో భాగంగానే వందలాది మంది మావోయిస్టులు కేంద్ర బలగాల తూటాలకు బలౌతున్నారు. మరి కొందరు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే మావోయిస్టు పార్టీ అగ్రనేత, పార్టీ కేంద్ర

- మిగతా 2 లో

కుటుంబ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

ప్రతి జిల్లాలో వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రం: సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : వివాహబంధం బాధ్యతలు, భావోద్వేగ గాఢత, పరస్పరం అర్థం చేసుకునేలా ప్రత్యేక కౌన్సెలింగ్ అవసరమని మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. దీనికి సమర్థమైన పరిష్కారం దిశగా వివాహ పూర్వ కౌన్సెలింగ్ సెంటర్లు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ సిద్ధం చేసిన ఫైల్ పై మంత్రి శుక్రవారం సంతకం చేశారు. ఈ కేంద్రాలు... యువజంటలకు పరస్పర గౌరవం, వివాద పరిష్కారం, భావోద్వేగ అనుకూలత వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడమే కాకుండా, చట్టపరమైన హక్కులు, లింగస్పందన, కుటుంబ బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయి. ప్రతి జిల్లాలో ఒక వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాలను సఖీ లేదా వన్ స్టాప్ సెంటర్లలో ఏర్పాటు చేస్తారు. శిక్షణ పొందిన సైకాలజిస్టులు, న్యాయ నిపుణులు, సోషల్ వర్కర్లు, మ్యారేజ్ కౌన్సెలర్లు వంటి నిపుణులను నియమిస్తారు. ఒక్కొక్కరికి నెలకు రూ.30 వేల వేతనం ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. సిబ్బంది జీతాలు, నిర్వహణ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అమ్మా... నాన్న చూడు!

బీహార్‌లో సంకుల సమరం

ఆర్వీ రామారావ్

బీహార్ శాసనసభ ఎన్నికలకు మొదటి విడత నామినేషన్లు శుక్రవారం ముగిశాయి. ఇప్పటి వరకు బీహార్‌లో ముక్కోణపు పోటీ ఉంటుందనుకున్నాం. కానీ హఠాత్తుగా జనసురాజ్ పార్టీ అధినేత తాను ఎన్నికలలో పోటీ చేయడం లేదని ప్రకటించారు. తన పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తానంటున్నారు. నిజానికి ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి మూడేళ్లైనా కాలేదు. అంతకుముందు ఆయన ఎన్నికల వ్యూహకర్త మాత్రమే. ఈ వ్యూహాల వల్ల లాభపడిన పార్టీలూ ఉండొచ్చు. కానీ కోచ్ స్వయంగా క్రీడా రంగంలోకి దిగితే విజయం తథ్యం అని చెప్పడానికి వీలు లేదు. ఒకప్పుడు ఆయన ముఖ్యమంత్రి అభ్యర్థి కావొచ్చుని అనుకున్నారు. పోటీ ఎన్‌డీఏకు, మహా ఘట్బంధన్ మధ్యే జరగనుంది.

అయితే ఈ రెండు కూటముల పరిస్థితీ అంత సజావుగా ఉన్నట్టు లేదు. నితీశ్ కుమార్‌కు ఉన్న పలుకుబడిని ఆసరాగా చేసుకుని ఎన్నికల్లో విజయం సాధిస్తే ఆయనను పక్కన పెట్టేసి తమ పార్టీ అభ్యర్థినే ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలన్నది బీజేపీ ఎత్తుగడ. ఈసారి జనతా దళ్(యు), బీజేపీ చెరి 101 స్థానాలలో పోటీ చేస్తున్నాయి. కిందటిసారి నితీశ్ పార్టీ 135 స్థానాలలో పోటీ చేసింది. నితీశ్ కుమార్ ప్రభావాన్ని తగ్గించడానికి బీజేపీ చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తోంది. చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని లోక్‌జనశక్తి (ఎల్‌జేపీ)కి ఏకంగా 29 స్థానాలు కేటాయించింది. అదీ జనతాదళ్ (యు), మహాఘట్బంధన్‌కు అంతగా పట్టులేని ప్రాంతాలలో చిరాగ్ పాశ్వాన్ పార్టీకి పోటీ చేసే అవకాశం కల్పించింది. చిరాగ్ తండ్రి రాం విలాస్ పాశ్వాన్ సజీవంగా ఉన్నప్పుడు కూడా ఎప్పుడూ 30 స్థానాలకు మించి సాధించిన దాఖలాలు లేవు. మరోవైపు నితీశ్ కుమార్ పరిస్థితి గందరగోళంగా తయారైనట్టు కనిపిస్తోంది. కానీ వాస్తవానికి ఆయన పరిస్థితే సురక్షితంగా ఉంది. నితీశ్ కుమార్ ఓటు బ్యాంకు ఇప్పటిదాకా పదిలంగానే ఉంది. ఆయన ఆరోగ్యమే కాదు... మానసిక స్థితి కూడా సవ్యంగా లేదన్న మాట వినిపిస్తున్నా నితీశ్ అత్యంత సమర్థంగా పాచికలు విసురుతున్నట్టు కనిపిస్తోంది. ఆయనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పొసగడం లేదు. అమిత్ షా ఫోన్ చేసినా నితీశ్ పలకడం లేదు. అయితే శుక్రవారం అమిత్‌షా స్వయంగా పట్నా వచ్చి...నితీశ్‌తో భేటీ అయ్యారు. బుజ్జగింపుకు ప్రయత్నించారు. ముఖ్యమంత్రి అభ్యర్థి పేరు ప్రకటించాలని నితీశ్ డిమాండ్ చేస్తుండగా... అమిత్‌షా మాత్రం నితీశ్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళతామని, ముఖ్యమంత్రి అంశం తర్వాత మాట్లాడుకుందామని చెబుతున్నారు.

అయితే, నితీశ్ కుమార్‌కు ఇంకో సౌలభ్యమూ ఉంది. ఆయన ప్రస్తుతం బీజేపీతో కలిసి ఉండొచ్చు. కానీ మహాఘట్బంధన్‌లోని పార్టీలు సైతం ఆయనను ఈసడించడం లేదు. సైద్ధాంతికంగా చూస్తే నితీశ్ మహాఘట్బంధన్‌కే సన్నిహితుడు. అవసరాన్నిబట్టి ఎన్నికల ఫలితాలు వెలువడిన తరవాత నితీశ్ మహాఘట్బంధన్‌ను సమర్థించనూ వచ్చు. ఇలా పిల్లిమొగ్గలు వేయడం ఆయనకు కూసు విద్యే. తాను ముఖ్యమంత్రి స్థానంలో ఉండాలన్నదే ఆయన కోరిక. నితీశ్ 20 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్నా ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించడం లేదు. ఇటీవలే మహిళలకు పది వేల రూపాయల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం, ఇతర జనాకర్షక పథకాలు అమలు చేయడం వల్ల జనంలో నితీశ్‌పై వ్యతిరేకత కొంత తగ్గినట్లు కనిపిస్తోంది. రెండు కూటముల్లోనూ సీట్ల పంపిణీ సజావుగా సాగలేదు. రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ కలిసి నిర్వహించిన యాత్ర... ఆ తరవాత తేజస్వీ యాదవ్ ఒంటరిగా

- మిగతా 2 లో

జపాన్ మాజీ ప్రధాని మురయమ మృతి



టోక్యో: జపాన్ సోషలిస్టు పార్టీ నేత, మాజీ ప్రధాని తొమిచి మురయమ శుక్రవారం ఓయిటా సిటీలో కన్నుమూశారు. ఆయన వయసు 101 ఏళ్లు. 1924 మార్చి 3వ తేదీన జన్మించారు. సైన్యం చేరిన ఆయన రెండో ప్రపంచ యుద్ధంలో కుమమోటో వద్ద విధులు నిర్వర్తించారు. 1972లో దిగువ సభకు ఎన్నికయ్యారు. జపాన్ సోషలిస్టు పార్టీకి ఆయన 1993లో అధ్యక్షుడయ్యారు. 1994, జూన్ 29వ తేదీన జపాన్ 81వ ప్రధానిగా మురియమ బాధ్యతలు స్వీకరించారు. రెండో ప్రపంచ యుద్ధానికి 50 ఏళ్లు ముగిసిన సందర్భంగా 1995లో జరిగిన కార్యక్రమంలో యురయమ ఓ ప్రకటన చేశారు. తప్పుడు జాతీయ విధానం వల్ల జపాన్ యుద్ధ కాంక్షను ప్రదర్శించినట్లు చెప్పారు. దీంతో జపాన్ ప్రజలు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లినట్లు చెప్పారు. తమ వల్ల అనేక దేశాల ప్రజలు, ముఖ్యంగా ఆసియా దేశాల్లో డ్యామేజ్ ఎక్కువగా జరిగిందన్నారు. 2000 సంవత్సరంలో ఆయన రాజకీయాల నుంచి వైదొలిగారు.

హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ సర్కార్‌కు షాక్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయానికి ఆయన సొంత దేశంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తులపై ఏకంగా లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు) ఫీజు విధించాలన్న ఆయన ప్రతిపాదనను సవాలు చేస్తూ, దేశంలోని ప్రముఖ వాణిజ్య సంస్థ 'యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్' న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ మేరకు కొలంబియా జిల్లా కోర్టులో దావా దాఖలు చేసింది. ట్రంప్ సర్కార్ నిర్ణయం అమెరికా ఆవిష్కరణలను, పోటీతత్వాన్ని దెబ్బతీసేలా ఉందని, ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని తన పిటిషన్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 19న ట్రంప్ జారీ చేసిన ఈ ప్రకటన ఇమ్మిగ్రేషన్, జాతీయత చట్టాన్ని ఉల్లంఘిస్తోందని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆరోపించింది. వీసాలపై కాంగ్రెస్‌కు ఉన్న అధికారాన్ని అధ్యక్షుడు అతిక్రమించారని స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యంలో హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలతో పాటు వాటి కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చింది. ఈ నిర్ణయంపై చాంబర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీల్ బ్రాడ్లీ మాట్లాడుతూ, "ఈ భారీ ఫీజు వల్ల స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా సంస్థలు విదేశీ నిపుణులను నియమించుకోవడం దాదాపు అసాధ్యంగా మారుతుంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. అధ్యక్షుడికి విస్తృత అధికారాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ చేసిన చట్టాలను ఆయన ఉల్లంఘించలేరని చాంబర్ తన వాదన వినిపించింది. హెచ్-1బీ వీసా హోల్డర్లు అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు చేస్తున్నారని, వారు కొత్త ఉద్యోగాలు సృష్టించడంతో పాటు అమెరికన్ల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఆవిష్కరణలకు కారణమవుతున్నారని తెలిపింది. ట్రంప్ తాజా నిర్ణయం ఈ ప్రగతిని తారుమారు చేస్తుందని హెచ్చరించింది. ఒకవైపు అమెరికా ఇలాంటి కఠిన నిబంధనలు విధిస్తుండగా, మరోవైపు చైనా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించేందుకు 'కే-వీసా' పేరుతో కొత్త వర్క్ పర్మిట్‌ను ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

భారతీయులకు మరో ఎదురు దెబ్బ

యూఎస్ డైవర్సిటీ వీసా (డీవీ) లాటరీలో పాల్గొనేందుకు భారతీయులకు 2028 వరకు అవకాశం లభించదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ కార్డ్ లాటరీ కార్యక్రమంలో గత ఐదేళ్లలో అమెరికాకు తక్కువ వలసలు ఉన్న దేశాల దరఖాస్తుదారులను ఎంచుకుంటున్నట్లు తెలిపాయి. ఏటా 50 వేల మంది లోపు అమెరికాకు వలసవచ్చే దేశాలకే అవకాశం ఇస్తున్నట్లు సమాచారం. అమెరికాలో అన్ని దేశాలకు చెందిన వలసదారులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీసా లాటరీలో పాల్గొనడానికి అనుమతి ఉన్న దేశాలకు తాజా వీసా కేటాయింపులను ప్రకటించారు. గత కొన్నేళ్లుగా భారత్ నుంచి అమెరికాకు అధికంగా వలసలు ఉండడంతో భారతీయులకు ఈ వీసా కార్యక్రమానికి కావాల్సిన అర్హత పరిమితి మించిపోయిందని.. అందువల్లే ఈ లాటరీ లో పాల్గొనడానికి వారికి అవకాశం ఇవ్వట్లేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

అవసరమైతే రెండువైపులా యుద్ధం చేస్తాం

పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్

ఇస్లామాబాద్: సరిహద్దుల్లో భారత్ డర్టీ గేమ్స్ ఆడుతోందంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాలిబన్లతో సరిహద్దు ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో రెండు వైపులా యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. ఓ టెలివిజన్ ఛానెల్‌తో ఖవాజా ఆసిఫ్ మాట్లాడారు. అఫ్గాన్‌తో సరిహద్దు ఘర్షణల నడుమ భారత సరిహద్దులో ఉద్రిక్తతలు తీవ్రమయ్యే అవకాశం ఉందా? అని విలేకరులు ప్రశ్నించగా అందుకు ఆయన బదులిస్తూ... 'కచ్చితంగా.. దాన్ని తోసిపుచ్చలేము. అందుకు బలమైన అవకాశాలు ఉన్నాయి' అంటూ వ్యాఖ్యానించారు. పాక్ విషయంలో ఆఫ్ఘాన్, భారత్ అనుచితంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. సరిహద్దుల్లో భారత్ డర్టీగేమ్స్ ఆడుతోందని వ్యాఖ్యానించారు. రెండు వైపులా యుద్ధానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏకకాలంలో రెండువైపులా యుద్ధం చేయడానికి ఇప్పటికే వ్యూహాలను రూపొందించినట్లు ఆసిఫ్ తెలిపారు. అయితే, యుద్ధ వ్యూహాలను బహిరంగంగా చర్చించలేనంటూ వ్యాఖ్యానించారు. ఎలాంటి పరిస్థితులను అయినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అయితే ఇప్పటికే భారత్ తరఫున ఆఫ్గాన్ పరోక్ష యుద్ధం చేస్తుందంటూ ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలు చేశారు.

అమెరికా- సౌదీ అరేబియా రక్షణ ఒప్పందం?

న్యూయార్క్: ఇటీవల పాకిస్థాన్‌తో వ్యూహాత్మక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్న సౌదీ అరేబియా... ఇప్పుడు అమెరికాతో రక్షణ ఒప్పందం చేసుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఈమేరకు ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది. సౌదీ అరేబియా రాజు మహమ్మద్ బిన్ సల్మాన్ మరికొన్ని రోజుల్లో అమెరికాకు వస్తున్న నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సల్మాన్ వచ్చినప్పుడు ఓ ఒప్పందంపై సంతకాల గురించి చర్చలు జరిగాయని, కానీ వాటి వివరాలు అస్పష్టంగా ఉన్నాయని ట్రంప్ యంత్రాంగంలోని సీనియర్ అధికారి తెలిపారు. హమాస్ నాయకులే లక్ష్యంగా ఖతార్‌పై ఇటీవల ఇజ్రాయిల్ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీని తర్వాత అమెరికా- ఖతార్‌ల మధ్య కీలక ఒప్పందం జరిగింది. ఖతార్‌పై ఏ సాయుధ దాడి జరిగినా అది అమెరికాకు ముప్పుగా పరిగణించే ఒప్పందం అది.

అలాంటిదాన్నే ఇప్పుడు సౌదీతోనూ చేసుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇక, సౌదీతో చేసుకొనే ఈ రక్షణ సహకారం తమ ప్రాంతీయ వ్యూహానికి బలమైన పునాది అని అమెరికా విదేశాంగ అధికారులు పేర్కొన్నారు. అయితే, ఒప్పందానికి సంబంధించిన వివరాలను మాత్రం వెల్లడించలేదు.

భారత్, చైనా పంపేవి నాణ్యతలేని మందులు: అమెరికా

వాషింగ్టన్: భారత్, చైనా వంటి దేశాల నుంచి తాము దిగుమతి చేసుకొనే మందులు నాసిరకంగా ఉన్నాయంటూ అమెరికా సెనెటర్ జిమ్ బ్యాంక్స్ ఆరోపించారు. ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న విదేశీ ఔషధ తయారీ తనిఖీలను వేగవంతం చేయాలని ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ)ను కోరారు. ఎఫ్‌డీఏ కమిషనర్ మార్టిన్ మకారీకి రాసిన లేఖలో జిమ్ బ్యాంక్స్ విదేశీ ఔషధాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మందులపై నిర్లక్ష్యమైన పర్యవేక్షణ దేశ ప్రజలను ప్రమాదాల బారిన పడేసే అవకాశముందన్నారు. అమెరికా ఔషధ సరఫరాను రక్షించడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. విదేశీ ఔషధ కర్మాగారాల్లో తనిఖీలు మరింత విస్తృతం చేయాలన్నారు.

రూ.1.35 లక్షలు దాటిన పసిడి ధర

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. మరోవైపు, ధనత్రయోదశి నాడు ప్రజలు బంగారం, వెండి, విలువైన ఇతర పాత్రలు కొనుగోలు చేస్తారు. ఇది సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఆ సెంటిమెంట్ కూడా బంగారం ధర పెరుగుదలకు కారణమవుతోంది. దాంతోపాటు పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

నైరుతితో 8 శాతం మిగులు వర్షపాతం

(మొదటిపేజీ తరువాయి)

తిరోగమనం పూర్తవుతుందని, ఈ ఏడాది ఒకరోజు ఆలస్యమైనట్లు తెలిపింది. అదే సమయంలో ఈశాన్య రుతుపవనాలు తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్, కోస్తాంధ్ర, రాయలసీమ, కర్నాటక దక్షిణ ప్రాంతాలు, కేరళ -మహేలోకి ప్రవేశించాయని ఐఎండీ పేర్కొంది.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

సంఘాల అధ్వర్యంలో తెలంగాణ బంద్‌కు శనివారం పిలుపునిచ్చాయి. ఈ బంద్‌కు అధికార కాంగ్రెస్ పార్టీ సహా, బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు తెలిపాయి. సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి బిగ్ షాక్ తగిలింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చడంతో పాటు పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సూచించింది.

ఇసుక దందా!

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హత లేని డ్రైవర్లు వాయువేగంతో వాహనాలు నడుపుతుండడంతో ప్రాణం అరచేత పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు. ఖమ్మం జిల్లా మైనింగ్ అధికారులకు 'మహానుభావులు' అనే పేరు సార్థకమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇదే పాలేరు డివిజన్లో మట్టి మాఫియా గుట్టలకు గుట్టలు కాజేసినా కూడా ఆ మహానుభావులు అడ్డుకోలేకపోవడమే గాక కనీసం ఆ అక్రమార్కులపై కేసులు పెట్టటానికి కూడా సాహసించలేదని విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాయమైన ఆ గుట్టలపై దృష్టి పెట్టి అప్పట్లో మట్టి మాఫియా ఎవరు ఆ గుట్టలను మాయం చేసింది ఎవరో కనిపెట్టి వారిపై కేసులు పెట్టిన వైనం జిల్లా ప్రజల మదిలో నిక్షిప్తమై ఉన్నా... ఆ మహానుభావుల తీరు మాత్రం మారలేదని నియోజకవర్గ ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. ఇసుక మాఫియాపై ఉన్నతాధికారులు దృష్టి సారించి అడ్డగోలు దోపిడీని అరికడతారన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఐ మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

బాగం హేమంతరావు, వి.ఎస్.బోస్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో భేటీ అయ్యారు. మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో తమ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతునిస్తుందని కూనంనేని చెప్పారు.

నేడు బీసీల బంద్

(మొదటిపేజీ తరువాయి)

42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు 'స్టే' వలన ఎన్నికలు నిలిచి పోయాయన్నారు. బంద్ కు 135 బీసీ కుల సంఘాలు, 35 బీసీ సంఘాలు మద్దతు ప్రకటించాయని వెల్లడించారు. ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి అని అన్నారు. 30 బీసీ సంఘాలు ఇంప్లీడ్ కేసులు వేశాయని, పిటిషనర్ల వాదన కూడా వినకుండా స్టే ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 243-డీ-6 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లను నిర్ణయించే అధికారం ఉంది కాబట్టే జీవో జారీ చేశారని తెలిపారు. మండల్ కమిషన్ కేసు సందర్భంగా 9 మంది జడ్జీల ధర్మాసనం తీర్పు ప్రకారం జనాభా లెక్కలు ఉంటే దానిని అనుగుణంగా రిజర్వేషన్లు పెంచవచ్చు అని తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. ప్రత్యేకంగా డెడికేటెడ్ బీసీ కమిషన్ వేసి జనాభా లెక్కలు తీసి రిజర్వేషన్లు పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు ... కృష్ణమూర్తి కేసులో తీర్పు చెప్పిందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల సందర్భంగా 50 శాతం సీలింగ్‌ను ఎత్తివేసిందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రామ్ కోఠి, ఉదయ్ నేత, కొండ దేవయ్య, హరి సింగ్, శారద, మోదీ రాందేవ్, రవి యాదవ్, బాలయ్య, వీరన్న, మహేష్ పాల్గొన్నారు.

బీసీలను అవమానపర్చడమే: వెంకట్రాములు

రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపిస్తే మోదీ ప్రభుత్వం ఆమోదించక పోవడం బీసీలను అవమాన పరచడమేనని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. జీవో 9 పై ఆధిపత్య కులాలవారు హైకోర్టులో పిటిషన్ వేసి అడ్డుకోవడం దుర్మార్గమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్షంతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలమైందన్నారు.

తెలంగాణ జాగృతి సంపూర్ణ మద్దతు: కవిత

బీసీల బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. 'బంద్ ఫర్ జస్టిస్' కు మద్దతునివ్వాలని కోరుతూ ఆర్. కృష్ణయ్య లేఖ రాయడంతో బంద్‌కు ఆమె మద్దతు ప్రకటించారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పాస్ చేయకుండా నెలల తరబడి పెండింగ్ లో పెట్టిన కేంద్రంలోని బీజేపీ ఇప్పుడు బంద్‌లో పాల్గొంటోందని, అంటే బీసీ రిజర్వేషన్ల బిల్లులు పాస్ చేసినట్టు భావించాలా అని నిలదీశారు. కేంద్రంపై కొట్లాడకుండా ఉత్తుత్తి జీవో ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తామే ముందుండి బంద్ చేయిస్తా మంటోందని ఎద్దేవా చేశారు.

బీహార్‌లో సంకుల సమరం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన యాత్ర, ప్రత్యేక, సునిశిత ఓటర్ల జాబితా (సర్) పేర తలెత్తిన వివాదాలు తేజస్వి కూటమికి అనుకూలంగానే ఉన్నాయి. అయినా సీట్ల పంపిణీలో మహాఘట్బంధన్ కూడా తడబడక తప్పలేదు. మహాఘట్బంధన్‌లో భాగస్వామ్యం ఉన్న సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్)తో కూడిన వామపక్ష పార్టీలలో మాత్రమే ఎలాంటి తడబాటు కనిపించలేదు. కాంగ్రెస్ తనకు ఉన్న బలానికన్నా ఎక్కువ సీట్లలో పోటీ చేస్తామని పట్టుబట్టింది. ఇది కాంగ్రెస్ సహజమైన ధోరణే. ఎంత బలహీనంగా ఉన్నా కాంగ్రెస్‌కు ఇతర పార్టీలతో కలిసి పని చేసే అలవాటు లేదు.

బీహార్ రాజకీయ పోకడ భిన్నమైంది. ఎంత వెనుకబడి ఉన్నా రాజకీయంగా చాలా చైతన్యవంతమైంది. ప్రశాంత్ కిశోర్ ఎన్ని మాటలు చెప్పినా, ఎంత హడావుడి చేసినా చివరకు పోటీనుంచే విరమించుకున్నారు. ఆయన మాట మీద నిలబడిన దాఖలాలే లేవు. సామర్థ్యం కన్నా తొందరపాటే ఎక్కువ. ఆయన అట్టహాసం వాస్తవ స్థితిలోకన్నా మీడియా సందడే అధికం. ఆయన ఒకసారి రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తానన్నారు. తేజస్వి మీద రాఘోపూర్ నుంచి పోటీ చేయాలనుకుని జనాభిప్రాయం కోసం బ్రహ్మాండమైన కారు ర్యాలీ నిర్వహించారు. చివరకు తుస్సుమనిపించారు. మరోవైపు తేజస్వి నామినేషన్ రోజున అపూర్వ ప్రజార్యాలీ జరిగింది.

ఎన్‌డీఏలోనూ మిత్రపక్షాలలో అసమ్మతి జ్వాలలు ఎగసి పడుతున్నాయి. నితీశ్ కుమార్ గురి లక్ష్యం వైపే ఉన్నా బీజేపీతో రాసుకుపూసుకు తిరగడం లేదు. ఉపేంద్ర కుష్వాహ, జితం రాం మాంఝీ కూడా సణుగుడు మానలేదు. నిజానికి బీజేపీ ఏకపక్షంగా వ్యవహరించింది. ముఖ్యమంత్రి నితీశ్‌ను సరైన రీతిలో సంప్రదించలేదు. పేరుకు జేడీయూలాగే బీజేపీ 101 సీట్లలోనే పోటీ చేస్తున్నా చిరాగ్ పాశ్వాన్ పార్టీ పోటీ చేస్తున్న 29 స్థానాలను కలిపితే బీజేపీ 130 చోట్ల పోటీ చేస్తున్నట్టే. చిరాగ్ పాశ్వాన్‌కు లేని శక్తిని బీజేపీ కట్టబెట్టింది. ఆయనను హనుమంతుడిని ఉబ్బేసినట్టు ఉబ్బేస్తోంది. హనుమంతుడి రూపంలో ఉన్న చిరాగ్ నిజానికి హనుమంతుడికి ఉన్న బలమూ లేదు. ఆ స్వభావమూ కొరవడింది.

నితీశ్ బీజేపీతో కలిసి ఉండడం మీద ఎన్ని అభ్యంతరాలైనా ఉండొచ్చు కానీ ఆయనకు సకల పక్షాల అభిమానమూ ఉంది. నితీశ్‌తో జగడం బీజేపీకే నష్టం. ప్రస్తుతానికి కుష్వాహ, మాంఝీ బీజేపీ వైపు ఉన్నా అవసరమైనప్పుడు వారికి నితీశ్‌తో కత్తు కలపడానికి అభ్యంతరం ఉండదు. మహాఘట్బంధన్‌లోనూ మునుపటి ఉత్సాహం కొరవడినట్టుంది.

వామపక్షాలు తప్ప కాంగ్రెస్‌కు, ఆర్‌జేడీకి మధ్య సఖ్యత మాయమైనట్టుంది. రాహుల్ గాంధీ హఠాత్తుగా విదేశాలకు వెళ్లారు. వచ్చి రాగానే చండీగఢ్ వెళ్లారు తప్ప... పట్నా రాలేదు. మొత్తం భారమంతా తేజస్వీనే మోయాల్సి వస్తోంది. తేజస్వి నామినేషన్ దాఖలు చేసినప్పుడు చక్రాల కుర్చీలో లాలూ ప్రసాద్ కూడా ఉన్నారు. తేజస్వి తల్లి రాబ్డీ దేవి, సోదరి మీసా భారతి కూడా ఉండడం ఆ కుటుంబంలో ఉన్న ఐక్యతకు తార్కాణం. బీజేపీ విసురుతున్న నగదు పంపిణీ పంజాను ఎదుర్కోవడానికి ఏవో కొన్ని వాగ్దానాలు తేజస్వి గుప్పిస్తున్నారు. బీజేపీలో ఉన్న గందరగోళం, మహాఘట్బంధన్‌లో అవసరమైన ఉత్సాహం లేకపోవడంతో అంతిమంగా లబ్ధి పొందేది నితీశ్ కుమారే. మొత్తం మీద రెండు కూటముల మధ్య భీకర పోరు జరగడం మాత్రం ఖాయం.

రెవెన్యూ వ్యవస్థ బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నామని వెల్లడించారు. ఈనెల 19న శిల్ప కళావేదికలో రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వీరికి లైసెన్స్‌లు పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలోనే భూసర్వే మ్యాప్ ను జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు. ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులు భర్తీచేయడంతో పాటు సర్వేకు అవసరమైన అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూశాఖ కార్యదర్శి డి.ఎస్ . లోకేశ్ కుమార్, సర్వే విభాగం కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌తో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ తొలివిడతలో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చామని... 3,465 మంది అర్హత సాధించారని తెలిపారు. రెండోవిడతలో మరో మూడు వేల మందికి ఆగస్టు నుంచి శిక్షణను ప్రారంభించామని ఈనెల 26న జేఎన్‌టీయూ అధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులకు అప్రెంటిస్ శిక్షణ ఇచ్చి వీరిని డిసెంబరు నాటికి అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ప్రతి గ్రామంలో జీపీవోలు, ప్రతి మండలంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లతో భూ సంబంధిత సేవలు అందుబాటునలో ఉంటాయన్నారు. భూమి రికార్డులు స్పష్టంగా ఉండేలా, అవినీతి లేని సేవలు అందించడమే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి అన్నారు.

కుటుంబ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

తదితర అవసరాల కోసం ఏడాదికి రూ. ఐదు కోట్ల వరకు ఖర్చు అవుతున్నట్లు అంచనా వేశారు. 33 కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించారు. ఇది కేవలం వివాహ సమస్యల నివారణకు మాత్రమే కాకుండా, సమాజ నిర్మాణానికి దోహదపడే సంస్కరణాత్మక ప్రయత్నం అవుతుందని మంత్రి సీతక్క తెలిపారు. కుటుంబ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

తిరుపతి: తిరుపతి కలెక్టరేట్‌ను బాంబులతో పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించింది. కలెక్టర్ ఛాంబర్‌తో పాటు కార్యాలయంలోని వివిధ శాఖలకు చెందిన గదులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయ అధికారిక మెయిల్‌కు తమిళనాడు నుంచి బెదిరింపు మెయిల్ వచ్చినట్టు గుర్తించారు.

ప్రజలకు నిరాశే మిగిలింది

కాంగ్రెస్‌లో తుపాకీ సంస్కృతి

హరీశ్‌రావు ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రజలకు మంచి జరిగే నిర్ణయాలు తీసుకుంటారని అనుకుంటే ... అక్కడ మంత్రుల పంచాయితీ తప్ప ఒరిగిందేమి లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు అరడజను వర్గాలుగా చీలిపోయారని , ఒకరంటే ఒకరికి గిట్టడం లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... దసరాకు మొండి చేయి చూపారు... దీపావళి కానుకగా ప్రజలకు ఏదైనా తీపి వార్త చెబుతారేమో అనుకుంటే తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. రైతులకు బోనస్ పేరిట ఇచ్చే రూ.1,300 కోట్ల బకాయిలైనా ఇస్తరేమో లేదా మహిళలకు రూ.2500 ఇచ్చే మహాలక్ష్మి పథకం ప్రారంభిస్తరేమో చివరకు పింఛన్లు పెంచుతరేమో అని అనుకున్నామని పేర్కొన్నారు. కానీ అందరికీ నిరాశే మిగిలిందన్నారు. సీఎం, మంత్రులు... పాలన గాలికి వదిలి వ్యక్తిగత పంచాయితీలు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. కమీషన్ల కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం మరొకరు, వాటాల కోసం ... కబ్జాల కోసం... పోస్టింగుల కోసం ఇలా... దండుపాళ్యం ముఠా లెక్క ఉందన్నారు. కేసీఆర్ ఉద్యోగాల్లో 95శాతం లోకల్ రిజర్వేషన్ సాధించారని, నీళ్లలో వాటా కోసం... నిధుల వాటా కోసం కొట్లాడారు, కానీ నేడు కమీషన్లు, కాంట్రాక్టులు, అక్రమ వసూళ్లలో వాటా కోసం మంత్రులు కొట్లాడుతున్నరని, చివరకు డిపార్టుమెంట్లే రద్దు చేస్తున్నారని దుయ్యబట్టారు. పారిశ్రామిక వేత్తలను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను, సినిమా హీరోలను, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నరని మండిపడ్డారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ఐపాస్ తెచ్చి పెట్టుబడులకు స్వర్గధామంగా రాష్ట్రాన్ని మార్చియందని, పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ వేసాం. కానీ ఇప్పుడు వ్యాపారవేత్తలకు తుపాకులు పెడుతున్నరని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి గన్ కల్చర్ తెచ్చిండు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు అని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలతో విచారణ జరిపించాలన్నారు.

మావోయిస్టులకు ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేశ్ సహా 208 మంది శుక్రవారం చత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్‌లో పోలీసుల ముందు లొంగిపోయారు. వీరిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ, బస్తర్ రేంజ్ డీఐజీ సుందర్ రాజ్ పట్నా, ఇతర పోలీసు అధికారుల సమక్షంలో మావోయిస్టులు తొమ్మిది రకాల 153 ఆయుధాలను అప్పగించారు.

వీటిల్లో ఏకే-47 రైఫిళ్లు 19, ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు 17, ఇన్సాస్‌లు 23 , ఇన్సాస్ ఎల్ఎంజీ ఒకటి, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. మావోయిస్టుల లొంగుబాటుపై చత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి మాట్లాడుతూ 'ఇది దేశం మొత్తానికి చరిత్రాత్మకమైన రోజు. హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మేం వారిని కోరుతూ వచ్చాం. ఇప్పుడు వారికి నైపుణ్యాలు కల్పించి, పునరావాసానికి ఏర్పాటు చేస్తాం' అని వెల్లడించారు. మావోయిస్టు అగ్రనేత మల్లోజుల ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ ఇచ్చింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహించారు.

ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించారు. చంద్రబాబు, నేదురుమల్లి జనార్దనరెడ్డిపై బాంబులు పేల్చి హత్యాయత్నం చేశారు. 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య వంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు సమాచారం.

సింగరేణి కార్మికులకు రూ.400 కోట్ల బోనస్

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్‌కు పంపామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొన్ని నెలలుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రం నుంచి అఖిలపక్షంగా వచ్చి రాష్ట్రపతిని, ప్రధాన మంత్రిని కలుస్తామని అనేక సార్లు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినా కేంద్రం అనుమతి ఇవ్వలేదని వివరించారు. బీసీలకు ఇచ్చిన హామీని తూచా తప్పక పాటించేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి అధ్వర్యంలో దిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టి అన్ని పార్టీలను ఆహ్వానించామని, దేశంలోని ఇతర పార్టీలన్నీ మద్దతు తెలియజేశాయని చెప్పారు. అయితే బీజేపీ ఎందుకు అడ్డుపడుతుందని ప్రశ్నించారు. హైకోర్టు, సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసును గెలిచేందుకు అభిషేక్ మను సింఘ్వీ, రవి వర్మ వంటి ప్రముఖ న్యాయవాదులను కాంగ్రెస్ ప్రభుత్వం నియమించి కొట్లాడిన సంగతి దేశ ప్రజలందరికీ తెలుసునని అన్నారు. ఈ నెల 18న రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా జరుగుతున్న బీసీ బంద్ నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని ఆయన కోరారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు... ప్రధాని మోదీ, రాష్ట్రపతి వద్ద బీసీ బిల్లు ఆమోదం కోసం సమయం తీసుకుని... నాయకత్వం వహించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్రం నుంచి అఖిలపక్ష పార్టీలు దిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాము అడిగితే కేంద్ర పెద్దలు సమయం ఇవ్వడం లేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రతి రాగానే బీసీల రిజర్వేషన్ అంశంపై చర్చించి ఈనెల 23న జరగనున్న క్యాబినెట్ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మొహమ్మద్ జావేద్, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండపాల కోటేశ్వరరావు, మొక్క శేఖర్ గౌడ్, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల పరకామణి చోరీ కేసుపై ఏపీ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. సీజ్ చేసిన ఫైళ్లు, ప్రాథమిక దర్యాప్తు నివేదికను ఉన్నత న్యాయస్థానానికి సీఐడీ సమర్పించింది. ఈ ఘటనపై కౌంటర్ దాఖలు చేయకపోవడంపై టీటీడీ ఈవోపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. టీటీడీ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ నెల 27న ఈవో న్యాయస్థానం ముందు హాజరు కావాలని ఆదేశించింది. లేనిపక్షంలో రూ.20 వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఘటనపై కౌంటర్ దాఖలు చేసేందుకు టీటీడీ సమయం కోరడంతో... ఇందుకు సమయమిస్తూ విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. 2023లో వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల పరకామణిలో చోరీ కేసు నమోదైంది. ఈ ఘటనపై అప్పట్లోనే టీటీడీ విజిలెన్స్‌కు ఫిర్యాదు అందింది.

ఉద్యోగి రవికుమార్ పెద్దఎత్తున పరకామణిని కొల్లగొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అప్పటి టీటీడీ అధికారులు సమగ్ర దర్యాప్తు జరపకుండా లోకాయుక్తతో రాజీ చేయించారు. దీంతో శ్రీనివాసులు అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేయడంతో హైకోర్టు విచారణకు స్వీకరించి... సీఐడీ విచారణకు ఆదేశించింది.

ప్రతి ఒక్కరూ కళ్ళను కాపాడుకోవాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కంటిచూపు కాపాడుకోవడానికి ముఖ్యంగా పోషకాహారం తీసుకోవడం అవసరమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో శుక్రవారం పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబాలకు ఉచితంగా కంటి పరీక్షల మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శరత్ మాక్సివిజన్ కంటి ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందనీ డిఎస్పీ అన్నారు. ఇందులో ఎస్పీ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రతి మనిషికి శరీరంలోని అన్ని అవయవాలలో కళ్ళు చాలా ప్రధానమైనవన్నారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ వినియోగం ఎక్కువ కావడం ద్వారా మన కంటి చూపులో సమస్యలు త్వరగా వచ్చే అవకాశం ఉందన్నారు. మొబైల్ ఫోన్ తక్కువ వాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కంటి సమస్యలు రాకముందే నిర్లక్ష్యం చేయకుండా అప్పుడప్పుడు వైద్యులను సంప్రదించి అవసరమైన చికిత్సలు, సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 150 మందికి పైగా కంటి పరీక్షలు స్క్రీనింగ్,డిస్టెన్స్ విజిబిలిటీ టెస్ట్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు సుధాకర్, నరసింహారావు, కృష్ణారావు, లాల్ బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులపై దాడి...

విశాలాంధ్ర - పినపాక : కరకగూడెం మండలంలో పోడు భూముల వివాదం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఫారెస్ట్ అధికారులపై రోడ్డు సాగు చేస్తున్న గిరిజనులు వేటకొడవళ్లతో గాడికి దిగారు. శుక్రవారం అశ్వాపురంపాడు అటవీ ప్రాంతంలో వలస గిరిజనులు, బీట్ ఆఫీసర్ కోటిని కొట్టారు. ఇతను తలపై జరిగిన దాడిని సెక్షన్ ఆఫీసర్ గోవిందుకు చెప్పడు. దీంతో స్పందించిన గోవిందు సంఘటనా స్థలానికి వెళ్లి తమ అధికారిని ఎందుకు కొట్టారని వలస ఆదివాసీలను ప్రశ్నించారు. పోడు భూములు కొట్టడం తప్పు కదా అని అడగడంతో గోవిందుపై కొడవళ్ళతో, గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో అధికారులకు స్వల్ప గాయాలు అయ్యాయి. దీంతో భయపడ్డాను ఫారెస్ట్ అధికారులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై పీవీ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సంక్షేమంపై సమీక్ష

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల/మందమర్రి: మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పర్సనల్ డిపార్ట్మెంట్ సమీక్షా సమావేశాన్ని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలు, హెల్త్ కార్డుల యొక్క వివరాలు, ఉద్యోగుల గైర్హాజరు తదితర అంశాలను, అన్ని గనుల డిపార్టుమెంట్ల సంక్షేమ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల విషయంలో ఎటువంటి ఆలస్యం జరగరాదని, జీరో పెండెన్సీ దిశగా అందరూ కృషి చేయాలని వారు అన్నారు. ఈయొక్క కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఎస్.ఇ ఐ.ఈ.డి కిరణ్ కుమార్, మందమర్రి ఏరియా అన్ని గనుల డిపార్ట్మెంట్ల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర- కోదాడ: ఎలక్ట్రిసిటీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడే ఏకైక యూనియన్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అని రాష్ట్ర కార్యదర్శి జి.సాయిబాబా అన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం పట్టణంలో యూనియన్ నాయకులు నాదెళ్ళ బాలకృష్ణ నివాస గృహములో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.సాయిబాబా పాల్గొని మాట్లాడారు.కార్మికుల సమస్యలు పరిష్కారానికి ముందుండి,అనేక ఉద్యమాలు నిర్వహించి విజయం సాధించినట్లు తెలిపారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, తెలుసుకొని పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజుర్ నగర్ డివిజనల్ ఇంజనీర్ ఎన్.వెంకట కృష్ణయ్య, కోదాడ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఏం.వెంకన్న, కే.వేణు, జిల్లా అధ్యక్షులు నేతకాని వెంకన్న, నాదేళ్ల బాలకృష్ణ, యాదగిరి నాయుడు,జి.నర్సింహారెడ్డి, వీరేపల్లి మధుసూదన్ రావు, కే.వెంకటేశ్వర్లు, వీ.సోమయ్య, సిహెచ్.రవిబాబు, కే.శిరీష, వెంకటనారాయణ, ఎన్.దయాకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ముంపు బాధితులకు పరిహారం మంజూరు

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ కారణంగా నష్టపోయిన రైతులు, గ్రామాల కోసం పోరాడిన చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రస్తుత కార్మిక గనుల శాఖ మంత్రివర్యులు డా. వివేక్ వెంకటస్వామి మరోసారి తన హామీని నిలబెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి మండలానికి చెందిన రైతులకు రూ.10 కోట్ల పరిహారం మంజూరు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ముంపు బాధితులకు నిజమైన న్యాయం చేసిందన్నారు. డిసెంబర్ 18 తర్వాత మొదటి విడత పరిహారం రైతుల ఖాతాల్లో జమ కానుందని బ్యాక్‌వాటర్ వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగే వరకు తాను కృషి చేస్తానని మంత్రి స్పష్టం చేశారు.

పండుగ వ్యాపారం ఎలా వుంది?

విశాలాంధ్ర బ్యూరో,సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణంలో ఐబి గెస్ట్ హౌస్. సమీపంలో పండుగ కోసం ఉపయోగించే బొమ్మలు, ప్రమిదలు , పూల దుకాణాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం జగ్గారెడ్డి ఐబి నుండి వెళ్తుండగా చిరు వ్యాపారులకు చూసి కాసేపు ఆగి వారితో ముచ్చటించారు. బొమ్మలు, ప్రమిదలు ఎక్కడి నుండి తీసుకువస్తున్నారు? రోజూ ఎంత గిరాకీ అవుతుంది. ఎంత గిట్టుబాటు అవుతోంది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. చివరగా వారి వద్ద నుండి బొమ్మలు, ప్రమిదలు కొనుగోలు చేశారు.

ఆధునిక పద్ధతిలో ఆయిల్‌పామ్ విత్తనాలు : మంత్రి

విశాలాంధ్ర - అశ్వరావుపేట : రాష్ట్ర రైతాంగానికి స్థిరమైన ఆర్థిక వనరుల కోసం ప్రభుత్వం విశ ప్రయత్నం చేస్తుందని దానికోసం శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో అశ్వరావుపేట మండలంలోని నారావారిగూడెం గ్రామంలో ఆధునిక పద్ధతిలో ఆయిల్‌పామ్ విత్తన నాటింపు, రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు ముఖ్యఅతిథిగా అశ్వరావుపేట ఎమ్మెల్యే, జారే ఆదినారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగామయి తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటను వాతావరణానికి అనుగుణంగా, ధృవీకరించబడిన హైబ్రిడ్ విత్తనాల ద్వారా, సమయానికి తగిన సాంకేతిక పద్ధతులు, మందుల వినియోగం పాటిస్తూ పంట నష్టాలను తగ్గించవచ్చని తెలిపారు. నాణ్యతలేని తల్లి మొక్కలను నర్సరీ నుంచి బయటకు తీసుకురావద్దన్నారు. విత్తన నాణ్యతను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని చెప్పారు. ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు, స్థానిక, ప్రైవేట్ పరిశ్రమల ద్వారా పంటను సమగ్ర మార్కెట్‌కు కనెక్ట్ చేసి, బై-ప్రొడక్ట్స్ వాడకం ద్వారా అదనపు ఆదాయాన్ని రైతులకు అందించడం ముఖ్యమన్నారు. గతంలో పంటలు నష్టపోవడం, మార్కెటింగ్ సమస్యలు ఎదుర్కోవడం వంటి సమస్యలు ఎదురైనప్పటికీ, శాస్త్రీయ పద్ధతులు, నర్సరీ నియంత్రణలు, సాంకేతిక శిక్షణ ద్వారా సమస్యలను అధిగమించవచ్చని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 నుంచి 20 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ పంట విస్తరించవచ్చన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఫ్యాక్టరీల కలయిక ద్వారా మార్కెటింగ్, ప్రాసెసింగ్ సదుపాయాలను సమకూర్చి, రైతులకు స్థిరమైన ధరలు, ఆదాయం అందించగలమని మంత్రి భరోసా ఇచ్చారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ రైతుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే పంట ఆయిల్ పామ్ సాగు అన్నారు. మనం నాటే ప్రతి విత్తనం కేవలం మొక్క కాదు... అది రైతు గుండెల్లో ఉజ్వల ఆర్థిక భవిష్యత్తుకు బాట వేస్తుందన్నారు. ఈ ఆయిల్ ఫామ్ ద్వారా రాబోయే రోజుల్లో సుమారు 5 నుంచి 10 వేల మందికి ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ చందా రాఘవరెడ్డి, ఆయిల్ ఫెడ్ ఎండి శంకరయ్య, నాచారం పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర రాఘవరావు, రాష్ట్ర అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, జిఎం సుధాకర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవెల్లి వీరభద్రరావు, ఓ ఎస్ డి అడపా కిరణ్ కుమార్, వ్యవసాయ కళాశాల డీన్ హేమంత్, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషించాలి : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : తెలంగాణ రైజింగ్ విజన్ 2047 అమలులో విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూలి విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అందిన ప్రతి సలహా నోట్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా సబ్ స్టేషన్ల ఏర్పాటుకు స్టడీ చేసి ప్రతిపాదనలు తయారు చేయాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ఖమ్మం జిల్లాలో పెరుగుతున్న పారిశ్రామిక అవసరాల దృష్ట్యా రెండు 400 కేవి సబ్ స్టేషన్ లను మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలో 5 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు చేశామని, ప్రతి యంగ్ ఇండియా స్కూల్ ఒక గ్రామం తలపిస్తుందని, కొత్త పారిశ్రామిక పార్కులను ఖమ్మం జిల్లాకు మంజూరు చేయడం జరిగిందని, వీటిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ పంపిణీ, రవాణా వ్యవస్థ బలోపేతం చేయాలని అన్నారు. విద్యుత్ స్తంభాలు, వైర్లు లూజుగా ఉండటం వల్ల ప్రాణ నష్టం జరగడానికి వీలు లేదని, పొలం బాట కార్యక్రమం కింద ప్రతివారం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ నివారణ చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని డిప్యూటీ సీఎం విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వరదల, వర్షాల సమయంలో నీటిలోనే వెళ్లి మన విద్యుత్ సిబ్బంది పనిచేసి రికార్డు సమయంలో విద్యుత్ పునరుద్ధరణ చేస్తున్నారని అన్నారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న సిబ్బంది కృషి ఫలితాన్ని కొద్దిమంది తమ స్వార్థం కోసం చెడగొట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. విద్యుత్ అంబులెన్స్ లను ట్రాన్స్ ఫార్మర్ తో సహా అవసరమైన సామాగ్రి, టెక్నిషియన్స్ తో ఏర్పాటు చేశామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కనీసం ఒక విద్యుత్ అంబులెన్స్ అందుబాటులో ఉండాలని అన్నారు. 1912 నెంబర్ ను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు రావద్దని, వ్యవసాయ విద్యుత్ నూతన కనెక్షన్ దరఖాస్తులను త్వరగా మంజూరు చేయాలని అన్నారు. ఇందిరా సౌర గిరి జల వికాసం క్రింద సోలార్ పంప్ సెట్ల ద్వారా ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలకు సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరా సౌర గిరి జల వికాసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తదితర అంశాలపై మంత్రి చర్చించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డైరెక్టర్ లు వి. మోహన్ రావు, వి. తిరుపతి రెడ్డి, టి. మధుసూదన్, సి. ప్రభాకర్, సిఈలు టి. సదర్ లాల్, కె. తిరుమల్ రావు, రాజు చౌహాన్, ఆర్ చరందాస్, ఉమ్మడి జిల్లా ఎస్.ఈ. లు, డి.ఈ. లు, ఏ.డీ.ఇ లు, అధికారులు పాల్గొన్నారు.

పాన్ షాపుల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో పోలీసులు పాన్ షాపులకు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చైతన్యం - డ్రగ్స్ పై యుద్ధం అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఈ తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాన్ షాపుల్లో పోలీస్ తనిఖీలు జరిగాయి. నిషేధిత గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలను నిర్మూలనే లక్ష్యంగా నిత్యం ఇలాంటి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వెల్లడించారు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, మణుగూరు, భద్రాచలం సబ్ డివిజన్ల వారీగా డిఎస్పీల ఆధ్వర్యంలో పోలీస్ జాగిలాల సహాయంతో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఎవరైనా నిషేధిత గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయించడం లేదా రవాణా చేయడం గానీ, సేవించడం గానీ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పి హెచ్చరించారు. మన జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీస్ శాఖ కు ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు.

జర్నలిస్టుల అక్రమ కేసులపై నిరసన

విశాలాంధ్ర - అశ్వరావుపేట : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నిజాలు రాసే జర్నలిస్టులపై కక్షగట్టి అక్రమ కేసులు ప్రణయించి వేదిస్తున్నట్లు తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం అశ్వరావుపేటలో స్థానిక జర్నలిస్టులు ఏపీ ప్రభుత్వ అక్రమ కేసులను ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేసారు. కూటమి ప్రభుత్వం పోలీసులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి తోపాటు ఆ పత్రిక పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నట్లు ఆరోపించారు. విచారణ పేరుతో నిర్బంధించి వేధించడం సహించేది లేదని రాబోయే కాలంలో ఈ పరిణామాలు తీవ్రంగా ఉంటాయ ని హెచ్చరించారు. స్థానిక రింగ్ సెంటర్ లొ నిర్వహించిన ఈ నిరసనలొ పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని ఏపీ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలొ జర్నలిస్టులు, నాయకులు వాసు, మౌలాలి, హరీష్, అప్పారావు, జక్కుల రాంబాబు, సంకురాత్రి సతీష్, విరాంజనేయులు, రోహిణి, ఉజ్జు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి, షెట్ పల్లి గ్రామాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ఏ. ఈ. కాంసాని లతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు అందించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, బేస్ మెంట్, లెంటల్, స్లాబ్ స్థాయిల వారీగా పూర్తి అయిన పనులకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాలలో బిల్లులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని వేలాల గ్రామంలో గల ఇసుక రీచ్ ప్రాంతాన్ని పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఇసుకను తీయాలని, ఇందిరమ్మ పథకంలో ఇండ్ల నిర్మాణాలకు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ముందుగా ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు

విశాలాంధ్ర- నల్లగొండబ్యూరో : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీస్ ఫ్లాగ్ డే వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు శుక్రవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ పోటీలు పోలీస్ అమరవీరుల సేవా స్ఫూర్తిని స్మరించుకునే ఉద్దేశ్యంతో అక్టోబర్ 21 నుంచి 31 వరకు జరగనున్న వారోత్సవాల్లో భాగంగా నిర్వహించబడతాయని ఆయన పేర్కొన్నారు. పోలీసులు అత్యవసర పరిస్థితుల్లో చూపిన స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో అందించిన సేవలు, ప్రజా రక్షణలో చేసిన త్యాగాలు, పోలీస్ విభాగ ప్రతిష్ఠను పెంచే అంశాలపై తీసిన ఫోటోలు, షార్ట్ ఫిల్మ్స్ ఈ పోటీలకు అర్హమవుతాయి.2024 అక్టోబర్ నుండి 2025 అక్టోబర్ వరకు తీసిన మూడు ఫోటోలు (10-8 సైజ్‌లో) మరియు 3 నిమిషాల లోపు నిడివి గల షార్ట్ ఫిల్మ్స్ మాత్రమే నామినేషన్‌కు అర్హమని ఎస్పీ తెలిపారు.పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ ఫోటోలు మరియు షార్ట్ ఫిల్మ్ పెన్ డ్రైవ్‌లో సాఫ్ట్ కాపీతో కలిపి ఈ నెల 23వ లోపు నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఐటీ కోర్ సెక్షన్ విభాగానికి అందజేయాలని ఆయన సూచించారు.

బీసీ బంద్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర -ఖమ్మం : నేడు జరుగు తెలంగాణ రాష్ట్ర బందు విజయవంతం కోసం బీసీ సంఘాలు సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సిపిఎంఎల్ న్యూడెమొక్రసీ మాదిగ దండోరా మాల మహానాడు నంగారా బేరి తదితర సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ బైక్ ర్యాలీ పెయిలం గ్రౌండ్ నుండి పాత కలెక్టరేట్ మీదుగా కొత్త బస్టాండు వరకు నిర్వహించారు. కొత్త బస్టాండ్ దగ్గర నుండి అంబేద్కర్ విగ్రహానికి మోటార్ సైకిల్ ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. ఈ ర్యాలీని సంస్థలు అధినేత ఆర్జెసి కృష్ణ, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మ రాజేష్ రావు,, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు కత్తినెవరు గౌడ్, మేకల సుగుణ రావు, పెరుగు వెంకటరమణ, పీఠర స్వర్ణకుమార్, సంగమేశ్వర రావు, విజయకుమార్, ఆకుల గాంధీ ,పోతుల జగదీష్, నాయి బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు జగదీష్, ఈ సభలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, సిపిఐ జిల్లా నాయకులు తాటి వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా నాయకులు బోడబట్ల సుదర్శన్, జన సమితి నాయకులు బాబు, ఎమ్మార్పీఎస్ తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షులు కోరిపల్లి శ్రీనివాస్, మాదిగ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, ఎల్ హెచ్ పి ఎస్ జాగృతి సేవాసమితి రాష్ట్ర నాయకులు భానోత్ కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవ సభకు భారీగా జన సమీకరణ

విశాలాంధ్ర ఖమ్మం : శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు భారీ సమీకరణ చేయాలని కొండపర్తి గోవిందరావు అన్నారు. అష్టకష్టాలు పడి రైతులు పండిస్తున్న వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ఆరోపించారు. పాలకుల వైఖరి, సహకరించని ప్రకృతి -నడుమ వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా -సమితి సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో - గోవిందరావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఏ పంటకు కనీస మద్దతు ధర లభించ లేదని ఆరోపించారు. పత్తిని సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని ఆన్లైన్ బుకింగ్ పద్ధతిని రద్దు చేయాలని క్వింటాకు రూ.10075 మద్దతు ధర చెల్లించాలని గోవిందరావు డిమాండ్ చేశారు. గ్రామం యూనిట్గా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిసారి రైతాంగ జపం చేస్తున్నాయి తప్ప ఆచరణలో రైతులకు చేస్తున్నది ఏమి లేదని గోవిందరావు తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు భారీ సంఖ్యలో రైతులను సమీకరించాలని రైతు సంఘం జిల్లా సమితి - సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో రైతు సంఘ బాధ్యులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, బాగం ప్రసాద్, మామిళ్ల సుదర్శన్రెడ్డి, అమరనేని వీరభద్రం, నల్లమోతు నర్సింహారావు, దొబ్బల కృష్ణ, వెంకటనర్సయ్య, చింతల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడిచేసిన నిధింతుడుపై, దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని, యంఆర్పి ఏటూరునాగారం మండల అధ్యక్షులు ఎంపెలి జాషువా డిమాండ్ చేశారు. శుక్రవారం అణగారిన వర్గాల హక్కుల గొంతుక పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు భారతదేశ ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై దాడి చేసిన నిందితుడిపై దేశద్రోహం కేసు నమోదు చేసి, తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, ములుగు జిల్లాలోని వివిధ మండలాల కేంద్రంలోని తహసిల్దార్లకు కార్యాలయం లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో విన్నతి పత్రం అందచేశారు.వివిధ మండలాల నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గావాయిపై జరిగిన దాడి రాజ్యాంగం పై జరిగినట్టేనని, భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గావాయి పై దాడి చేసిన నిందితుడిపై దేశద్రోహం కేసు నమోదు చేసి,తక్షణమే కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంపెల్లి శంకర్ మాదిగ, జాడి లక్ష్మి నారాయణ, చంటి, కె.సాగర్,ప్రకాష్,చిట్యాల నరేష్, మాదిగ, రమేష్, ఎల్ పి శ్రీను, వెంకన్న, కోగిల అక్షయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులలో వేగం పెంచాలి : కలెక్టర్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: మేడారం ప్రాంగణ అభివృద్ధి పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మేడారం దేవాలయం ప్రాంగణ అభివృద్ధి పనుల మ్యాప్ ప్రకారం తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు పలు సూచనలను చేశారు. ప్రతి రోజు వచ్చే భక్తులకు ఆటంకం కలుగకుండా పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు ప్రత్యేక కౌన్సెలింగ్ :ఎస్పీ

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, ఎటువంటి అవాంఛనీయ నేర సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలుగా ములుగు జిల్లా పోలీస్ విభాగం ప్రత్యేక నిఘా చర్యలను చేపట్టిం దని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పి అన్నారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి,ఆదేశాల మేరకు, ములుగు జిల్లా పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ప్రతి నెలా క్రమం తప్పకుండా ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిం చాలని, వారి కదలికలపై నిఘా ఉంచాలని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ పి. జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు.ఎస్పీ ఆదేశాల ప్రకారం, ముందస్తు చర్యలలో భాగంగా ములుగు జిల్లా పోలీస్ అధికారులు మొత్తం 69 రౌడీ షీటర్లు, 128 సస్పెక్ట్ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి, వారి కదలికలపై మరింత నిఘా పెంచారు. ఈ సందర్భంగా, ఏవైనా చట్టవ్యతిరేక కార్యకలా పాలకు, పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రౌడీ షీటర్లు,సస్పెక్ట్ షీటర్లను హెచ్చరించారు. గత సంవత్సర కాలంగా సత్ప్రవర్తన కలిగి ఉన్న 20 మంది పై రౌడీషీట్, 53 మంది పై సస్పెక్ట్ షీట్ లు మొత్తంగా 73 మంది పై షీట్‌లు ఎత్తివేసినట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.

అక్రమ కేసులపై జర్నలిస్టుల ధర్నా

విశాలాంధ్ర - ఇల్లందు : ఏపీ ప్రభుత్వం జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయ్యాలని డిమాండ్ చేస్తూ ఇల్లందు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని జేకే కాలనీ అంబేద్కర్ విగ్రహానికి జర్నలిస్టులు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టీజేఎఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యులు గుర్రం రాజేష్ మాట్లాడుతూ సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి మీద, ఏపీలోని రిపోర్టర్ల పై చంద్రబాబు ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని ఆరోపించారు. వెంటనే కేసులు ఉపసంహరించుకోవాలన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. నిజాలను రాస్తే సహించలేని స్థితికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపాలకులు చేరుకు న్నారని విమర్శించారు. అనంతరం సాక్షి జర్నలిస్ట్ ఇల్లందుల నాగేశ్వ రరావు మాట్లాడుతూ ఏపీ లోని కూటమి ప్రభుత్వం గత కొంతకాలంగా సాక్షి దినపత్రిక మీద కక్ష కట్టి జర్నలిస్టులను అక్రమ కేసుల పెట్టి వేధిస్తుందన్నారు. జర్నలిస్టులు శ్రావణ్ కుమార్ రెడ్డి, వేముల రాజు, యాకుబ్ పాషా, రాధాకృష్ణ, మధు, ప్రసాద్, భాస్కర్, విశాలాంధ్ర విజ్ఞాన్, చాంద్, రాజేష్, ఏఎస్ రావు, గుడివాడ శ్రీనివాస్, మధు, రమణ, ఎస్ఎల్ ముత్యం, డానియల్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలుపై అడ్డంకులు సృష్టిస్తున్న కేంద్రం: సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : దుష్ట రాజకీయ వక్రబుద్ధితోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు అమలులో అడ్డంకులు సృష్టిస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా ఆరోపించారు. ప్రధాని మోదీ ఆధిపత్య విధానాలను తెలంగాణ సమాజం తిప్పికొట్టి కేంద్రానికి బుద్ధి చెప్పాలనీ పిలుపునిచ్చారు. రాష్ట్ర బిసి జేఏసీ పిలుపుమేరకు 18న జరగనున్న బంద్ జయప్రదం చేయాలనీ కోరారు. శుక్రవారం సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో బంద్ విజయవంతంకోసం రాజకీయ పక్షాలు, సామాజిక, జర్నలిస్టు, మైనార్టీ, బిసి సంఘాల ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసారు. ఇందులో సాబీర్ పాషా ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బిసి వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తేనే వారికి సముచిత న్యాయం జరుగుతుందన్నారు. దీనిపై రాష్ట్ర సభల్లో ఆమోదం చేసి పంపితే బిల్లుకు ఆమోదం లభించకుండా కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. తెలంగాణ చట్టసభలు, రాష్ట్ర ప్రజలు ఎలాంటి అభ్యంతరం లేకుండా సంపూర్ణంగా మద్దతు తెలుపుతుంటే కేంద్రానికి వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. కేంద్రం వెంటనే స్పందించి రిజర్వేషన్ బిల్లును ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. దీటి లక్ష్మీపతి అధ్యక్షత జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల, పక్షాల నాయకులు కంచర్ల జమలయ్య, గొల్లపల్లి దయానంద్, ఎమ్ ఎ. రజాక్, అనుదీప్, కాసుల వెంకట్, వంగ వెంకట్, ఉదయ్ కుమార్, మద్దెల శివకుమార్, జక్కుల రాములు, ఎండి. యూసుఫ్, అబిద్, కురుమెళ్ళ శంకర్, భూపతి శ్రీను, కోడి లింగయ్య, డి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం :మంత్రి

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో : రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో 72 గంటల్లోనే డబ్బులు జమ అవుతాయని ఆయన స్పష్టం చేశారు.శుక్రవారం ఆయన తిప్పర్తి మండలంలోని కంకణాలపల్లి, అంతాయ గూడెం, మామిడాలపల్లి గ్రామాల్లో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం కంకణాలపల్లిలో గ్రామ పంచాయతీ భవనంను కూడా ప్రారంభించారు. తిప్పర్తి మండల కేంద్రంలో ధాన్యం తరలించే లారీలకు జెండా ఊపి ప్రారంభం చేశారు.మంత్రి మాట్లాడుతూ, "రైతుల కళ్లల్లో సంతోషం చూడడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు అమ్మిన ధాన్యం కొనుగోలుకు ?25,000 కోట్ల రూపాయలు క్యాబినెట్ కేటాయించిందని తెలిపారు. "డబ్బులు 72 గంటల్లో జమ కాకుంటే నన్ను నేరుగా సంప్రదించవచ్చు" అని మంత్రి స్పష్టం చేశారు.రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తిలో నల్గొండ జిల్లా రెండవ స్థానంలో ఉందని, అయితే రైతులు సన్నధాన్య పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. "నిజామాబాద్ జిల్లాలో 75 శాతం రైతులు సన్నబియ్యాన్ని పండిస్తున్నారు. నల్గొండలో కూడా అదే విధంగా చేయాలి. పేదలందరికీ రేషన్ ద్వారా సన్నబియ్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది" అని తెలిపారు.ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.6,600 కోట్లుతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారని, ఇంకా రూ.4,500 కోట్లుకి క్యాబినెట్ అనుమతి ఇచ్చిందని తెలిపారు. జనవరి నాటికి మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాల వరకు డబుల్ రోడ్లు, గ్రామాల నుంచి మండలాలకు సింగిల్ రహదారులు నిర్మించనున్నట్లు వెల్లడించారు.'రహదారులు, రవాణా సౌకర్యం బాగుంటేనే రైతుల ఉత్పత్తులు సకాలంలో మార్కెట్‌కు చేరుతాయి" అని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి, డీఎస్ఓ వెంకటేష్, పౌర సరఫరాల డీఎం గోపికృష్ణ, డీసీఓ పత్యానాయక్ పాల్గొన్నారు.

సంపాదకీయం

చమురు సెగలు

ఏ రోజుకారోజు ఏదో ఒక వివాదం ఉంటేనే డోనాల్డ్ ట్రంప్‌కు నిద్రపడుతుంది. లేకుంటే జాగారమే. అది జగమెరిగిన సత్యం. అగ్గి-బుగ్గి ఆయనకు అన్నదమ్ముల్లాంటివి. ప్రశాంతంగా ఉన్న చోట అగ్గిరాజేయడం, తిరిగి తానే నీళ్లుపోసి, ఆర్పేయడం, ఆ తర్వాత మంటలు రగలకుండా శాంతి నెలకొల్పినట్లు ధాంబికాలు పలకడం ట్రంప్‌కు అలవాటు. నిజానికి అమెరికా నైజమే అది. అమెరికా అధ్యక్షుడు ఎవరైనా బహుశా ఈ తరహా వైఖరి ఉండాలేమో! తాజాగా రష్యా నుంచి భారత్ ముడిచమురును కొనడం ఆపేయాలంటూ ట్రంప్ గద్దించారు. పైగా ఈ విషయంలో మోదీ తనకు మాటిచ్చారని సెలవిచ్చారు. దీనిపై మోదీ స్వయంగా స్పందించకపోయినా, భారత విదేశాంగశాఖ అధికారికంగా స్పందించి, ట్రంప్ వ్యాఖ్యలను ఖండించింది. ట్రంప్ అంటేనే భయపడే మోదీ సహజంగానే 'మౌనముని' వేషధారణతో, తనదైన శైలిలో చేతులుకట్టుకొని కూర్చున్నారు. మోదీ, ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని, దేశ అవసరాలు, ప్రయోజనాల కోణంలోనే రష్యా నుంచి ముడిచమురు కొంటున్నామని, ఈ విషయంలో వేరే మాటకు తావేలేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. మోదీ సారథ్యంలోని ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికాకు మోకరిల్లాల్సిన దౌర్భాగ్య పరిస్థితి భారత్‌కు దాపురించింది. ఒకసారికాదు, రెండుసార్లు కాదు, వివిధ సందర్భాల్లో భారత్‌ను అమెరికా బెదిరిస్తూనే ఉంది. ఇప్పుడు ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపే సాకుతో రష్యా చమురు కొనవద్దంటూ దబాయిస్తోంది. గజాను వందశాతం నేలమట్టంచేసి, వేలాది మంది ప్రాణాలను బలిగొన్న తర్వాత, పలస్తీనీయుల రక్తం తాగి, కండుపునిండాక... శాంతిగీతం ఆలపించిన ట్రంప్ పనిలోపనిగా ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని కూడా ఆపాలని చూస్తున్నారు. యుద్ధాన్ని ఆపితే ఎవరికైనా ఆనందమే. కాకపోతే ఉక్రెయిన్‌కు ఇవ్వాల్సిన ఆయుధాలన్నీ ఇచ్చేసి, యుద్ధాన్ని తీవ్రంగా పెంచేసి, ఇప్పుడు రష్యా మెడలువంచి, శాంతికపోతం ఎగరేయాలని చూడటం విచిత్ర సన్నివేశమే అవుతుంది. ఇప్పటికే రష్యాపై తీవ్రమైన ఆంక్షలను విధించిన ట్రంప్ కొత్తగా రష్యా నుంచి చమురు ఎగుమతులను ఆపేయడంపై దృష్టిసారించారు. రష్యా ముడి చమురు ఎగుమతుల్లో సుమారు 47% వాటా చైనాదే. భారతదేశం సుమారు 38% ముడిచమురును రష్యా నుంచి కొనుగోలు చేస్తున్నది. ఇక యూరోపియన్ యూనియన్ 6%, టర్కీ 6% కొనుగోలు చేస్తున్నది. చమురు ఉత్పత్తుల ఎగుమతి విషయానికొస్తే, టర్కీ సుమారు 26% కొనుగోలు చేస్తూ, అతిపెద్ద కొనుగోలుదారుగా నిలిచింది. రెండోస్థానంలో చైనా 12% తో ఉండగా, తదుపరి స్థానాల్లో బ్రెజిల్ (12%), సింగపూర్ (8%) ఉన్నాయి. సెప్టెంబర్ 2025లో భారతదేశ మొత్తం ముడి చమురు దిగుమతులలో రష్యా వాటా సుమారు 34% ఉంది. సెప్టెంబర్ 2025 డేటా ప్రకారం పరిమాణం పరంగా, భారతదేశం రోజుకు సుమారు 1.6 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురును రష్యా నుంచి దిగుమతి చేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్ ధరలు, ఆంక్షలు, డిస్కౌంట్లు, ఇతర భౌగోళిక-రాజకీయ పరిణామాలను బట్టి ఈ కొనుగోలు పరిమాణాలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. అయినప్పటికీ, రష్యా చమురుకు అతిపెద్ద కొనుగోలుదారుల్లో భారత్ కీలకం. ఆయిల్, ఆయుధాలు లేకుండా అమెరికా విదేశాంగ విధానమే లేదు. చమురు సరఫరాను సురక్షితం చేయడం, అంతర్జాతీయ చమురు ధరలను స్థిరీకరించడం అమెరికా విదేశాంగ విధానంలో ముఖ్యమైన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పశ్చిమ ఆసియా ప్రాంతంలో చమురు లభ్యతను దృష్టిలో పెట్టుకొని, అమెరికా సైనిక కార్యకలాపాలు, ఒప్పందాలు చేసుకుంటూ ఆ ప్రాంతంలో పెత్తనం చేస్తూ ఉంటుంది. ప్రపంచంలో తన సైనిక ఆధిపత్యాన్ని, శక్తిని కొనసాగించడానికి అమెరికా పెద్ద ఎత్తున ఆయుధాల ఎగుమతులు, రక్షణ ఒప్పందాలను నిర్వహిస్తుంది. ఇతర దేశాలపై ప్రభావం చూపడానికి వాటిని ఒక సాధనంగా ఉపయోగిస్తుంది. అంతర్జాతీయ వేదికపై అమెరికా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ఆర్థిక, రాజకీయ, సైనికపరమైన వ్యూహాల్లో భాగమే ఉక్రెయిన్ యుద్ధం. డాలర్ ప్రాబల్యాన్ని కాపాడుకోవడం, అంతర్జాతీయ సంస్థలను ప్రభావితం చేయడం, వాణిజ్యపరమైన ఆంక్షలు విధించడం వంటి చర్యలూ ఇందులో భాగమే. అమెరికా నయా వలస విధానానికి రష్యా మొదట్నించీ వ్యతిరేకమే.

2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలయ్యాక, రెండువైపులా సుమారు 2 లక్షల మందికి పైగా సైనికులు, పౌరులు మరణించినట్లు ప్రాథమిక అంచనా. బాంబు దాడుల కారణంగా వేలాది మంది అమాయక పౌరులు, చిన్నారులు కూడా మరణించారు. ఆసుపత్రులు, పాఠశాలలు, నివాస భవనాలు, రోడ్లు, రైల్వేలు, ఇతర మౌలిక సదుపాయాలు భారీగా ధ్వంసమయ్యాయి. రెండు దేశాలూ నష్టపోయాయి. కారణం మాత్రం అమెరికా, దాని సామ్రాజ్యవాదమే. అమెరికా రెచ్చగొడితే, జరిగిన ఈ యుద్ధంతో ఉక్రెయిన్ ఏమైనా బాగుపడిందా అంటే... అదీలేదు. ఈ యుద్ధం ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసింది. ఉక్రెయిన్‌కు లక్షల కోట్ల రూపాయల (సుమారు 100 బిలియన్లకు పైగా) ఆర్థిక నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. యుద్ధ ప్రభావంతో సుమారు 60 లక్షల మందికి పైగా ఉక్రెయిన్ పౌరులు తమ దేశాన్ని విడిచిపెట్టి విదేశాలకు, ముఖ్యంగా యూరప్ దేశాలకు శరణార్థులుగా వలస వెళ్లారు. ఉక్రెయిన్‌కు అమెరికా ఆర్థిక, మానవతా సాయం అందించడం కన్నా, క్లస్టర్ ఆయుధాలు, ఫిరంగి గుండ్లు, మందుగుండు సామగ్రి, ఇతర అత్యాధునిక ఆయుధాలతో సహా రక్షణ సామగ్రిని ఉక్రెయిన్‌కు పంపింది. కీల్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ప్రకారం, 2022 నుంచి 2024 వరకు ఉక్రెయిన్‌కు అమెరికా సుమారు 119.8 బిలియన్ల సాయం అందించింది. అందులో సింహభాగం ఆయుధాలదే. రష్యా సైనిక కదలికలు, దాడులు, వ్యూహాలకు సంబంధించిన కీలక ఇంటెలిజెన్స్ సమాచారాన్ని అమెరికా ఉక్రెయిన్‌తో పంచుకుంది. ఇది ఉక్రెయిన్‌కు తమ రక్షణ వ్యూహాలను రూపొందించడంలో చాలా సహాయపడింది. ఇది చాలదన్నట్లు, రష్యా ఆర్థిక వ్యవస్థను బలహీనం చేయడానికి, యుద్ధాన్ని ఆపేలా ఒత్తిడి తీసుకురావడానికి అమెరికా, దాని మిత్ర దేశాలతో కలిసి రష్యాపై విస్తృతమైన ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇందులో భాగమే, భారత్‌పై ఒత్తిళ్లు కూడా. ఇప్పటికే చాలావరకు భారత్‌పై ఆంక్షలు విధించిన ట్రంప్ రష్యా చమురుకు చెక్ పెట్టాలని మోదీ స్నేహాన్ని పావుగా వాడుకుంటున్నారు. అమెరికా ఒత్తిడితో ఆపరేషన్ సిందూర్‌ను అకస్మాత్తుగా ఆపేయడం, హెచ్1బీ వీసా జాబితాలో భారత్‌ను తొలగించడంతో సహా ట్రంప్ వల్ల భారత్‌కు ఎప్పటికప్పుడు ఎదురుదెబ్బలు తగులుతున్నప్పటికీ, మోదీ మాత్రం ట్రంప్‌కు పంపించిన అభినందనల సందేశాలు ప్రేమలేఖలను మించిపోయాయి. కీలకమైన భారత ప్రభుత్వ నిర్ణయాలు పార్లమెంటులో కాకుండా వైట్‌హౌస్‌లో జరుగుతున్నట్లుగా అన్పిస్తోంది. ఇప్పుడు రష్యా చమురు విషయంలో భారత్ తరపున నిర్ణయాలు తీసుకొని, ప్రకటనలు చేసే అధికారాన్ని ట్రంప్‌కు అప్పగించినట్లు కన్పిస్తోంది. భారత విదేశాంగ విధాన ఘోర వైఫల్యానికి ఇది నిదర్శనం.

మళ్లీ "రావూ" బాల సరస్వతి

మీకిష్టమైన గులాబ్ జామ్‌లు ఇస్తాం. ఆ రెండు చేతుల నిండా చాక్లెట్లు నింపుతాం. ఎలాంటి ఆంక్షలు లేకుండా హాయిగా పాడుకునేలా చేస్తాం. లతా మంగేష్కర్ లేదు కదా "పాడనివ్వద్దు" అని చెప్పడానికి... అందుకని బాలీవుడ్‌లో కూడా పాటలు పాడేయచ్చు. ఒక్కసారి మళ్లీ "రావూ" బాల సరస్వతమ్మా. "తానే మారెనా... గుణమ్మే మారెనా... దారీ తెన్నూ లేనే లేక ఈ తీరాయనా" అన్నారు కదా దేవదాస్‌ని. ఆ దేవదాసులం మేం. ఇక మారం. గుణమ్మూ కూడా మార్చుకోం. ఎవరినీ నమ్మం. మిమ్మల్ని తప్ప. అశరీర ఆకాశవాణి మిమ్మల్ని " ఏ" గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తించలేదని బాధపడ్డారు కదమ్మ. సశరీర మానవులం మేం. మీకు కొన్ని లక్షల గ్రేడ్‌లు ఇచ్చాం మీరు పాడిన "ధరణికి గిరి భారమా... గిరికి తరువు భారమా... కనిపెంచే తల్లికి పిల్ల భారమా". ఆనాటి గ్రామ్‌ఫోన్ పుట్టింది ఇతరేతర గాయకుల కోసమేనని అనేక మంది భ్రమించారేమో కాని ఆ గ్రామ్‌ఫోన్‌కి మాత్రం తాను పుట్టింది మీ కోసమే అని మాబాగా తెలుసు. లేకపోతే ఆరో ఏటే ఆ కొప్పరపు సుబ్బారావు గారు "నమస్తే మా ప్రాణనాథ" అనే పాటని మీ చేత ఎందుకు పాడించి

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

రికార్డు చేయిస్తారంటారు. అన్నట్లు ఈ పాటని కపిలవాయి రామనాథ శాస్త్రిగారు ఆ గుంటూరు వేదికపై మీ నాలుగో ఏడే ఎందుకు పాడిస్తారమ్మా బాల సరస్వతమ్మ. పువ్వు పుట్టగానే పరిమళించింది. కాకపోతే తాళిబొట్టుతో ఆ పరిమళం గాల్లో కలిసి పోయింది. కోరంగి సంస్థానాధీసం ఎంత అన్యాయం చేసింది ఈ సమస్త సంగీత ప్రపంచానికి అనిపిస్తుంది మీ పాటలు విన్నప్పుడుల్లా. ఘోషా అన్నారు కానీ, పొసెసివ్‌నెస్ అనుకున్నారు కాని చివరికు అన్యాయం జరిగింది మాత్రం సంగీత ప్రియులకే కదమ్మ బాల సరస్వతమ్మా. మామ నున్నా నరేష్ పుస్తకం మిణుగురులు ఆవిష్కరించిన తర్వాత ఏం మాట్లాడతారో ఈ గాన సుందరి అనుకున్నాం. ఇంతా చేసి ఏం మాట్లాడలేదు. అదిగో ఆనాటి "అందం చూడవయా... ఆనందిచవయా... అందాల ఆనందం ఇంతేనయ్యా" పాటకి వయసొచ్చినట్లుగా "తలుపు తీయునంతలో... తత్తర మదినేలనోయీ... తాళుము కృష్ణా... కొంతసేపు తాళుము కృష్ణ" అని పాడగానే... చెప్పడు... కృష్ణుడే కాదు... మేం కూడా తాళ లేకుండిపోయాం.

అనుకరణ కళ... అదే మిమిక్రీ అంటారు చూడండి. అందులోనూ బాల సరస్వతమ్మ తాళం వేసిన చెయ్యి. తన చిన్ననాటి స్నేహితుడు, ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వరరావుని ఈనాటి అభిమానుల ముందు అచ్చుగుద్దినట్లు మిమిక్రీ చేసి చూపించింది కూడా ఈ బాల సరస్వతమ్మే. అంతెందుకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్టీఆర్‌ని సాయం అడిగి ఆయన్ని కలవడానికి వెళ్లారు ఈ సంగీత సరస్వతి. "హు... మీరూ ఆవిడ్ని కలవండి. విషయం ఆవిడకి చెప్పండి" అంటే ఆ ఫలానీ ఆవిడ్ని కలిశారట. మొదటిసారి కలిసిన సరస్వతమ్మని ఆ ఫలానీ ఆవిడ పైకీ కిందకి చూసి "ఇంతకీ మీరేం చేస్తారు" అని అడిగితే మారు మాట్లాడకుండా వెనక్కి వచ్చేశారు ఈ మహాగాయని. ఈ సందర్భాన్ని, ఆ ఫలానీ ఆవిడ హావభావాల్ని మిమిక్రీ చేసి చెబుతూంటే చూడాలి. రాయలేం. ఈ అదృష్టం రచయిత, చిత్రకారుడు తల్లావఝుల శివాజీకి దక్కడం పూర్వజన్మ సుకృతం. మనకి దక్కని అవకాశం అని అనుకోవాలి తప్ప మరింకేమిటి అంటారు చెప్పండి.

1958వ సంవత్సరం బాల సరస్వతమ్మ అభిమానపులకు దురదృష్టాన్ని మిగిల్చిన ఏడాది. ఎందుకంటే ఆ ఏడే తునిలో జరిగిన ఓ సంగీత సమ్మేళనం బాల సరస్వతమ్మ రేఖల్ని కాదు ఆమె రాగాల్ని మార్చేసింది. బాల సరస్వతమ్మని చూడడానికి వచ్చిన వందలాది మందిని చూసి ఈర్ష్యించిన రాజుగారు ఆమె పాటలకు తెర దించేశారు. " అందరికీ తెలుసు ఆయన పాడనివ్వలేదని" అంటూ ఓ ఇంటర్వ్యూలో చెబుతూంటే ఎంత వేదన పడ్డావమ్మా అనిపించింది. ఇదే కాదు... అభిమానుల భ్రమలన్నీ పటాపంచలు చేసేసిన ధైర్యం ఆ సరస్వతమ్మది. "అబ్బే నా పాట విని నన్ను చేసుకోలేదు. నేను ఆయన థర్డ్ వైఫ్.. అదే మూడో భార్యని. పిల్లల కోసం చేసుకున్నారు" అంటూంటే.... ఆ పాత పాట "రాజ్యాలను ఏలినారు వేన వేల రాజులు... చివరికి ఎవరు మిగిల్చారు కుల సతులకు గాజులు" గుర్తొస్తుంది. "మూడంటే మూడే సంఘటనలు తర్వాత నా సంగీత ప్రపంచం కూలిపోయింది" అంటూ బాల సరస్వతి ఆ విలేకరి కుర్రాడికి చెబితే... "తల్లీ కూలింది నీ సంగీత ప్రపంచం కాదమ్మా... నీ పాట వినలేని మా జన్మలు కుప్పకూలాయమ్మా" అని అరవాలనిపించింది. అందుకే... ఇందుకే... అమ్మా... సంగీత సరస్వతీ... మళ్లీ మరోసారి "రావూ" బాల సరస్వతమ్మా అని నీ పాటలు వింటూ రెండు నిమిషాలు మౌనం పాటిస్తున్నాం.

– సీనియర్ జర్నలిస్టు, 99120 19929

న్యూరెంబర్గ్ ట్రయల్స్‌కు 80 ఏళ్లు

కృష్ణ ఝా
డిప్యూటీ ఎడిటర్, న్యూయేజ్

మనమంతా జీవిస్తున్న ప్రపంచంతో హద్దులు దాటి వ్యవహరిస్తున్న అందరికీ మరణగంట మోగుతుంది. హద్దులు దాటడం అంటే ఆటవికత వైపు వెళ్లడమే. కానీ, పరిణామాలు కూడా అదే స్థాయిలో వస్తాయి. ఎవరూ తప్పించుకోలేరు. నూరెంబర్గ్ ట్రయల్స్ ఇందుకు సజీవ ఉదాహరణలు. ఫాసిస్ట్ పాలనలో జరిగిన నేరాలను విచారించేందుకు ఏర్పాటు చేసిన నూరెంబర్గ్ ట్రయల్స్‌లో మొదటి అభియోగం దాఖలు చేసి ఈ ఏడాది అక్టోబర్ 18 నాటికి 80 వ సంవత్సరం పూర్తవుతుంది. అధికారాన్ని దుర్వినియోగం చేసి, మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన వారు, వారి అధికారం, స్థానం ఏమైనప్పటికీ, ఒక రోజు జవాబుదారీగా ఉండవలసి వస్తుందనే విషయాన్ని ఈ తేదీ గుర్తు చేస్తుంది. ఆష్విట్జ్ అనే ఒక డెత్ కేంప్‌లో కేవలం మే 1940 నుంచి డిసెంబర్ 1943 వరకు 25 లక్షల మందిని భట్టీలలో చంపినట్లు నాజీ అధికారులలో ఒకరైన రుడాల్ఫ్ హెస్ ధృవీకరించాడు. మరో 5 లక్షల మంది ఆకలి లేదా వ్యాధుల కారణంగా చనిపోయారు. మొత్తంగా, కేవలం ఆష్విట్జ్‌లోనే 40 లక్షల మందిని చంపేశారు. తల్లి చేతుల నుంచి తీసుకున్న పిల్లలను సజీవంగా మండే కొలిమిల్లోకి విసిరారు.

1945 అక్టోబర్ 18న హెర్మన్ గోరింగ్, ఆల్బర్ట్ స్పియర్ వంటి అత్యంత క్రూరమైన వారు సహా 24 మంది మాజీ నాజీ నాయకులపై యుద్ధ నేరాలకు సంబంధించిన అభియోగాలు మోపారు. విచారణ 10 నెలలు జరిగిన అనంతరం 1946 అక్టోబర్ 1 న తీర్పు వెలువడింది.

నూరెంబర్గ్ ట్రయల్స్ అనేవి రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నాజీ జర్మనీలోని ప్రముఖ నాయకులను యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలు, శాంతికి వ్యతిరేకంగా చేసిన నేరాలు విచారించేందుకు మిత్రరాజ్యాలు (యునైటెడ్ స్టేట్స్, గ్రేట్ బ్రిటన్, సోవియట్ యూనియన్, ఫ్రాన్స్) అనేక సైనిక ట్రిబ్యునల్స్‌ను నిర్వహించాయి. 1945, 1946 మధ్య జర్మనీలోని నూరెంబర్గ్‌లో జరిగిన ఈ విచారణలు, వ్యక్తులను వారి చర్యలకు జవాబుదారీగా చేసి, హోలోకాస్ట్ (జాతిహననం) అకృత్యాలను అధికారికంగా నమోదు చేయడం ద్వారా అంతర్జాతీయ చట్టంలో ఒక కీలకమైన ఉదాహరణను నెలకొల్పాయి. యునైటెడ్ స్టేట్స్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించిన గొప్ప అమెరికన్ న్యాయవాది రాబర్ట్ జాక్సన్ ఇలా అన్నారు. మా రుజువు అసహ్యకరంగా ఉంటుంది. నేను మీ నిద్రను దూరం చేశానని మీరు అంటారు, కానీ ఇవే ప్రపంచం కడుపును దేవినట్లుగా ఉండే విషయాలు. జర్మనీ మొత్తం ఒక పెద్ద హింసా శిబిరంగా మారింది, బాధితుల ఆర్తనాదాలు ప్రపంచమంతటా వినిపించాయి, నాగరిక ప్రజలకు వణుకు పుట్టించాయి. ఈ యుద్ధ సమయంలో నేను ఈ కథనాలను సందేహంతో, అవిశ్వాసంతో స్వీకరించిన వ్యక్తిని, కానీ ఇక్కడ ఉన్న రుజువు ఎంత బలంగా ఉందంటే, నేను మాట్లాడే ఒక్క మాటను కూడా ఎవరూ ఖండించలేరు. నాజీల దురాక్రమణ ప్రపంచంపై కలిగించిన గాయాలు ఎంత లోతైనవి అంటే అవి ఇప్పటికీ రక్తం కారుస్తూనే ఉన్నాయి".

జాక్సన్ మాటలు నిజమయ్యాయి. నాజీయిజం ప్రపంచంలోకి ఒక కొత్త రూపంలో ప్రవేశించింది. అవి జాతి విద్వేషం, ఉగ్రవాదం, హింస, అధికారపు అహంకారం, క్రూరత్వం, నిర్దాక్షిణ్యమైన జాతీయవాదం, సైనికీకరణకు సజీవ చిహ్నాలుగా ఉంటాయి. నాజీ జర్మనీలో హెర్మన్ గోరింగ్ రెండవ అత్యంత శక్తిమంతమైన అధికారి. హిట్లర్ నియంతృత్వంలో చాలాకాలం పాటు, హిట్లర్ తర్వాత ఆయన మాత్రమే అత్యంత శక్తిమంతుడు. తూర్పు ఐరోపాను జయించాలనే జర్మనీ ప్రణాళికలో గోరింగ్ కీలక పాత్ర పోషించాడు. యూదులను దోచుకోవడం, చంపడం కోసం నాజీ విధానాలను రూపొందించడంలో సైతం ఆయన సహాయం చేశాడు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, నూరెంబర్గ్‌లోని అంతర్జాతీయ సైనిక న్యాయస్థానం గోరింగ్‌కు మరణదండన విధించింది. తనకు ఉరిశిక్ష విధించేందుకు ముందే గోరింగ్ ఆత్మహత్య చేసుకున్నాడు.

నాజీయిజం అనేది జర్మన్ గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టి. ఇది అధికారంతో పాటు వచ్చింది, తనను తాను బలోపేతం చేసుకుంది. అంతర్జాతీయ సామ్రాజ్యవాద ప్రతీఘాతచర్య మద్దతు, ప్రత్యక్ష సహాయం ఫలితంగా భయాన్ని, అకృత్యాలను పురిగొల్పే చర్యలను కొనసాగించగలిగింది.

ఇటలీలోని ఫాసిజం మాదిరిగానే నాజీయిజం కూడా అత్యంత ప్రతీఘాతక, సామ్రాజ్యవాద శక్తుల నియంతృత్వాన్ని స్థాపించే ధోరణిని కలిగి ఉంది. క్రూప్స్, ది వోగ్లర్స్, ది లావెన్‌ఫెల్డ్, ష్రోడెస్, ది ష్మిట్‌జ్లర్స్ వంటి అనేక మంది జర్మన్ పారిశ్రామికవేత్తలు, ఆర్థిక దిగ్గజాలు నుంచి ఎస్ఎస్ వినాశకారుల వరకు మద్దతు ఇచ్చారు. ఈ పెట్టుబడి దిగ్గజాలు జర్మనీ మొత్తం ఆర్థిక సామర్థ్యాన్ని నాజీ దురాక్రమణ సేవలో ఉంచారు. వారు తమకు అందుబాటులో ఉన్న మానవులపై అమానవీయమైన నాజీ ప్రయోగాలలో పాలుపంచుకున్నారు. వారు భయంకరమైన ప్రయోగాల ప్రక్రియలో పదుల వేల మందిని చంపారు. ప్రజలను బానిసలుగా మార్చారు. వారు ఎదుర్కోవలసి వచ్చిన భయంకరమైన పరిణామాలు ఉన్నాయి. మొత్తంగా, నూరెంబర్గ్‌లో 199 మంది నిందితులపై విచారణ జరిగింది. 161 మంది దోషులుగా నిర్ధారించగా, 37 మందికి మరణశిక్ష విధించారు. వీరిలో ఇంటర్నేషనల్ మిలిటరీ ట్రిబ్యునల్ విచారించిన 12 మంది ఉన్నారు. కొన్ని విచారణలలో హోలోకాస్ట్ (సామూహిక హననం) నేరాలు చేర్చినప్పటికీ, ఐన్సాట్ గ్రుప్పెన్ నాయకులపై మాత్రమే అమెరికా విచారణలో ప్రధాన దృష్టి కేంద్రీకృతమైంది. నిందితులు సాధారణంగా తాము ఆరోపించిన నేరాలు జరిగాయని అంగీకరించారు. కానీ తాము ఉన్నత అధికారం నుంచి ఆదేశాలను పాటించామని పేర్కొంటూ, తమకు బాధ్యత లేదని ఖండించారు. నాజీల అత్యున్నత అధికారం, హోలోకాస్ట్ (సామూహిక హననం)కు ఎక్కువ బాధ్యత వహించాల్సిన వ్యక్తి, విచారణలకు హాజరుకాలేదు. అడాల్ఫ్ హిట్లర్ యుద్ధం చివరి రోజుల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే ఆయన సన్నిహిత సహాయకులలో కొందరు కూడా ఆత్మహత్యలు చేసుకున్నారు. చాలామంది నేరస్థులను ఎప్పుడూ విచారించలేదు. కొందరు జర్మనీ నుంచి పారిపోయి విదేశాలలో నివసించగా, వీరిలో వందలాది మంది యునైటెడ్ స్టేట్స్‌కు వెళ్లారు.

తమ శత్రువులుగా లేదా బెదిరింపులుగా భావించిన ప్రజల సమూహాలను నాజీ జర్మనీ హింసించింది, క్రూరంగా వ్యవహరించింది, హత్య చేసింది. యూదులను నాజీలు తమ ప్రధాన శత్రువుగా చూశారు. వారు యూదు పురుషులు, మహిళలు, పిల్లలను అలుపెరుగని దృష్టితో లక్ష్యంగా చేసుకున్నారు. ఈ భయం పరిధి, భారీ మానవ నష్టం కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అవి ఏమిటంటే, నాజీలు ఏ సమూహాలను లక్ష్యంగా చేసుకున్నారు? వారు ఈ నిర్దిష్ట సమూహాల ప్రజలను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? నాజీలు మొదటి నుంచి జర్మనీలోని యూదు ప్రజలను క్రూరంగా, నిరంతరంగా ఒంటరి చేయాలని, పేదవారిని చేయాలని, వివక్ష చూపాలని కోరుకున్నారు. కాబట్టి నాజీ జర్మనీ యూదులను లక్ష్యంగా చేసుకుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో, ఈ విధానం సామూహిక హత్యలకు పెరిగింది. మొత్తంగా, నాజీలు, వారి మిత్రులు, సహకరించినవారు 60 లక్షల మంది యూదులను హత్య చేశారు. ఇది ఇప్పుడు హోలోకాస్ట్(సామూహిక హననం)గా పిలిచే జాతిహననం. యూరప్‌లోని యూదుల జాతిహననంతో, కమ్యూనిస్టులను, ఇతర సమూహాల ప్రజలను కూడా నాజీలు హింసించారు. వారి పట్ల క్రూరంగా వ్యవహరించారు లేదా హత్య చేశారు. కొన్ని సందర్భాలలో, వారు తమ మిత్రులు, సహాయకారుల సహాయంతో అలా చేశారు.

(1945 అక్టోబర్ 18 న నాజీల సంచలన విచారణలో తొలి అభియోగం మోపి శనివారానికి 80 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా...)

బీజేపీపై చిందులేస్తున్న మిత్ర పార్టీలు

డా॥జ్ఞాన్‌పాఠక్

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎన్డీఏలో మిత్ర పార్టీల మధ్య సీట్ల పంపిణీ వ్యవహారం గందరగోళంగా తయారయ్యింది. ప్రత్యేకించి ఎల్జేపీ(ఆర్‌వీ)పైన బీజేపీ మిక్కిలి ప్రేమ చూపుతోంది. ఇతర పార్టీల కంటే ఎక్కువ సీట్లను అమిత్‌షా కేటాయించారు. అది కూడ జేడీ(యూ) పోటీ చేయనున్న బలమైన సీట్లలో చాలా సీట్లు ఎల్జేపీకి కేటాయించాడు. దీనితో జేడీ(యూ) నాయకుడు, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ లోలోపల అమిత్‌షా పైన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్జేపీ పైన అమిత్‌షా మితిమీరిన ప్రేమను ఇతర మిత్ర పార్టీలు ఏమాత్రం భరించలేక మండిపడుతున్నాయి. ఎన్డీఏ అయిదు మిత్ర పార్టీలలో మూడు పార్టీలు- జేడీ(యూ), ఆర్ఎల్ఎం, హెచ్ఏఎం పార్టీలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. జేడీ(యూ) బహిరంగంగా ప్రకటన చేయకపోయినప్పటికీ సీట్ల పంపిణీ విషయంలో తీవ్ర అభ్యంతరాలు తెలియజేస్తోంది. మరోవైపు ఆర్ఎల్ఎం, హెచ్ఏఎం బహిరంగంగానే అసమ్మతిని ప్రకటిస్తున్నాయి. తమ మద్దతును బీజేపీకి ఇవ్వడం అసాధ్యమవుతుందని ఈ మూడు పార్టీలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ వెంటనే తీవ్ర పోరాటాన్ని ప్రారంభించింది. ఈ వ్యవహారం రాజకీయంగా ఇప్పటికే నష్టం కలుగచేసింది. నవంబరులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీపైన తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనున్నాయని విశ్లేషకులు గట్టిగా అంచనా వేశారు. ఎన్డీఏలో మిత్ర పార్టీల మధ్య సీట్ల పంపిణీ ప్రకటన పూర్తిగా బీజేపీ నిర్ణయమే. ప్రత్యేకించి అమిత్‌షా బాధ్యత తీసుకుని సీట్ల పంపిణీ చేశారు. అందువల్ల అమిత్‌షా పైనే ఎక్కువగా అసమ్మతిని ప్రకటించడమే గాక మద్దతు ఇవ్వడానికి ఉత్సాహం చూపడం లేదు. ఈ సీట్ల పంపిణీపై ఎల్జే (రామ్‌విలాస్) పార్టీ తప్ప మరే పార్టీ సంతృప్తిగా లేదు. ఈ పార్టీ నాయకుడు చిరాగ్‌పశ్వాన్ తమకు 29 సీట్లు కేటాయించటంపై బాగా సంతోషంగా ఉన్నారు.

అసమ్మతిని వ్యక్తం చేసిన పార్టీలలో రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం), హిందూస్థాన్ అవాం మోర్చా (హెచ్ఎఎం) ఉన్నాయి. అక్టోబరు 15 వ తేదీన ఎల్జేపీ(ఆర్‌వి) కి కేటాయించవలసిన సీట్ల కంటే ఎక్కువగా కేటాయించారని ఇతర పార్టీలు తీవ్ర అసమ్మతిని ప్రకటించాయి. దాదాపు ఎక్కువ మిత్ర పార్టీలు అసమ్మతిని వ్యక్తం చేయడంతో అనేక సీట్ల పంపిణీ విషయంపై మూడు రోజులు పాటు తిరిగి చర్చలు జరిపారు. బీహార్ ప్రస్తుత అసెంబ్లీలో ఎల్జేపీ (ఆర్‌వి) కి ఒక్క సీటు లేకపోయినా 29 సీట్లలో పోటీచేసే అవకాశం లభించింది. కారణమేమైనా బీజేపీ నాయకుడు అమిత్‌షా బోలెడంత ప్రేమ కురిపించాడు. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్జేపీ స్వతంత్రంగా పోటీ చేసి ఒక సీటును మాత్రం గెలుచుకుంది. 2021లో ఎల్జేపీ రెండుగా విడిపోయింది. ఈ పార్టీకి అయిదు ఎంపీ సీట్లు ఉండగా పశుపతినాథ్‌పరస్ నలుగురు సభ్యులతో విడిపోయారు. ఆ నలుగురు సభ్యులతో పశుపతినాథ్‌పరస్ బీజేపీలో చేరిపోయారు. చిరాగ్‌పశ్వాన్‌ను ఆనాడు బీజేపీ పూర్తిగా విస్మరించింది. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. చిరాగ్‌పశ్వాన్ ప్రస్తుతం బీజేపీ మిత్రుడిగా మారిపోయాడు. పశుపతినాథ్‌పరస్ అంకుల్ ప్రస్తుతం ఇండియా బ్లాకులో మిత్రుడిగా ఉన్నారు. బీహార్‌లో ఇండియా బ్లాకులోని పార్టీలన్నిటిని కలిపి మహాఘటబంధన్ అని పిలుస్తున్నారు. ఎల్జేపీ (ఆర్‌వి) 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏలో భాగస్వామిగా పోటీచేసి అయిదు సీట్లు గెలుచుకున్నది. చిరాగ్‌పశ్వాన్‌ను ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మొదట వ్యతిరేకించినప్పటికీ ఇప్పుడు ఎన్డీఏలో చేరడానికి సమ్మతించారు.

ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు ఎన్డీఏలో బీజేపీ ఏమాత్రం ప్రాధాన్యతను ఇవ్వడంలేదని స్పష్టంగా తెలిసిపోతోంది. అదే సమయంలో చిరాగ్‌పశ్వాన్‌కు ప్రాధాన్యత ఇస్తున్న విషయం స్పష్టంగా వెల్లడవుతోంది. నితీశ్‌కుమార్ అలాగే ఇతర జేడీ(యూ) నాయకులు బీజేపీ నాయకత్వం ధోరణిలో వచ్చిన మార్పుపైన ఏమాత్రం సమ్మతితో లేరు. బీజేపీ నాయకత్వ ధోరణిని అంగీకరించే పరిస్థితిలో లేరు. 2024 లోక్‌సభ ఎన్నికలకు కొంచెం ముందుగా ఇండియా బ్లాకు నుంచి నితీశ్‌కుమార్ వైదొలిగాడు. దీంతో ఆయన ప్రతిష్ఠ బాగా దెబ్బతింది. తరుచుగా పార్టీలను మారుతున్న నితీశ్‌ను పల్టూరామ్(పార్టీలు మారే వ్యక్తి) అని పిలిచారు. బీహార్‌లో చోటు చేసుకున్న ప్రతి రాజకీయ మలుపులో నితీశ్‌కుమార్‌ను బీజేపీ అవమానిస్తూనే వచ్చింది. అయినప్పటికీ జేడీ(యు) బహిరంగంగా బీజేపీని విమర్శించటం లేదు. అయితే క్రమం తప్పకుండా బీజేపీ నాయకత్వానికి తన అసమ్మతిని తెలియజేస్తోంది. సోన్‌బర్సా, రాజ్‌గిర్ ఎంఎల్ఏ సీట్లు జేడి(యూ) గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచింది. ప్రస్తుతం ఇద్దరు ఎంఎల్ఏలు ఆ పార్టీకి ఉన్నారు. ఈ రెండు నియోజక వర్గాల నుంచి ఎన్నికైన ఎంఎల్ఏలు ఇద్దరూ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు చాలా సన్నిహితులు. 2010 నుంచి నితీశ్‌కుమార్ స్నేహితుడు రత్నేష్‌సదా రాజ్‌గిర్ నుంచి గెలుపొందుతూనే ఉన్నారు. జేడీ(యూ)కు బలమైన ఎంఎల్ఏ. ఈ నియోజక వర్గం నుంచి రెండుసార్లు రత్నేష్‌సదా గెలుపొందారు. సోన్‌బర్సా, రాజ్‌గిర్ స్థానాలను జేడీ(యూ) ఎల్జేపీ(ఆర్‌వీ) పార్టీకి ఎంతమాత్రం ఇవ్వదలుచుకోలేదు. అయితే బలవంతంగా చిరాగ్‌కు అమిత్‌షా కట్టబెట్టారు. జేడీ(యూ) పార్టీలో గ్రూపు తగాదాలు ఎక్కువగా ఉన్నాయి. సీనియర్ పార్టీ నాయకులు ఒక గ్రూపుగా ఉన్నారు. వీరు బీజేపీ నాయకత్వ మాట వినడానికి సిద్ధంగా ఉంటారు. ఈ అంశంపై నితీశ్‌కుమార్ తన అసమ్మతిని తెలియజేస్తూనే ఉంటారు. ఈ విధంగా నడుచుకోవద్దని నితీశ్‌కుమార్ చెప్పినప్పటికీ సీనియర్ నాయకులు పట్టించుకోరు. బీజేపీ ప్రయోజనాలకు సీనియర్ నాయకుల గ్రూపు తలొగ్గుతారు. వీళ్లపై నితీశ్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ సీట్ల పంపిణీలో ఒకే విధమైన నిర్ణయం తీసుకోవడం మూలంగా ఆర్ఎల్ఎం, హెచ్ఎం పార్టీల నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తమ పార్టీలు ఎన్డీఏకు అనుకూలంగా పని చేస్తాయన్న నమ్మకం లేదని ఆర్ఎల్ఎం నాయకులు ఉపేంద్రకుశ్వా వెల్లడించాడు. బీజేపీ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి సమ్రాట్‌చౌదరి, కేంద్ర మంత్రి నిత్యానంద్‌రాయ్‌తో రహస్యంగా సమావేశమై ఈ అంశాలను వివరించారు. తనకు ఇష్టం లేకుండా దినారా, మహువా సీట్లను ఎల్జేపీ (ఆర్‌వి) పార్టీకి అప్పగించడమే తన కోపానికి కారణమని కుశ్వా తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన హడావిడిగా దిల్లీకి బయలుదేరి వెళ్లి బీజేపీ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలుసుకున్నారు. ఈ సారి రాజ్యసభ సీటు ఇచ్చి మంత్రి పదవి కూడా ఇస్తామని నడ్డా, అమిత్‌షా నుంచి హామీ పొందారు. మిత్ర పార్టీలకి చెందిన అభ్యర్థులకు ముఖ్యంగా ఎల్జేపీ (ఆర్‌వి)కి అప్పగించటం వల్ల కేంద్రమంత్రి, హిందూస్తానీ అవామ్ మోర్చా నాయకుడు జితిన్‌రామ్‌మాంఝీ ఆగ్రహం చెందాడు. ఈ విధంగా ఎన్డీఏలో లుకలుకలు బహిరంగంగానే బయటపడ్డాయి. ఈ పరిణామాలపై బీజేపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు.

నాయకత్వం నితీశ్‌దే...సీఎం సంగతి అడగొద్దు

- ఎన్నికల తర్వాత ఎన్డీఏ పక్షాలదే తుది నిర్ణయం
- హెూంమంత్రి అమిత్‌షా కీలక వ్యాఖ్యలు
- బీహార్‌లో భారీ మెజారిటీతో గెలుస్తున్నామని వెల్లడి

పట్నా: బీహార్‌లో గత 20ఏళ్లలో లేనంత భారీ మెజారిటీతో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడబోతుందని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా జోస్యం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శరణ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎన్‌డీఏకు మోదీ ప్రధాన ఆకర్షణ అయినా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోనే బీహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు షా వెల్లడించారు. లాలూ- రబ్రీదేవి జంగిల్ రాజ్ పాలనకు వ్యతిరేకంగా నితీశ్ పోరాడాడని గుర్తు చేశారు. ఈసారి బీహార్ ప్రజలకు నాలుగు సార్లు దీపావళి జరుపుకొనే అవకాశం వచ్చిందన్నారు. శ్రీరాముడు అయోధ్యకు తిరిగివచ్చినందుకు మొదట దీపావళి చేసుకుంటారు. ఆ తర్వాత ప్రభుత్వ పథకం కింద మహిళల ఖాతాల్లో రూ. 10,000 జమ చేసినప్పుడు రెండోది, జీఎస్టీపై 5శాతానికి తగ్గించినప్పుడు మూడో దీపావళి. ఇక నవంబర్ 14న ఓట్ల లెక్కింపు రోజు నాలుగో దీపావళిని జరుపుకుంటారని షా అన్నారు. "కశ్మీర్ మనదా... కాదా? మీరే చెప్పండి. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేయాలా...వద్దా? ప్రధాని మోదీ ఆర్టికల్ 370 రద్దు చేసి కశ్మీర్‌ను ప్రధాన స్రవంతిలో కలిపారు. అంతకుముందు కాంగ్రెస్ పాలనలో కశ్మీర్‌లో ఉగ్రవాదులు రక్తంతో హెూలీ ఆడేవారు" అని షా అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా పట్నా చేరుకున్న అమిత్‌షా నితీశ్‌కుమార్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ ఆయన కీలక విషయాలను వెల్లడించారు. బీహార్ ఎన్డీఏలో చీలికలు ఉన్నాయనే ఊహాగానాలను తోసిపుచ్చారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్డీఏ పోటీ చేస్తుందని వెల్లడించారు. ఎన్నికల తర్వాతే బీజేపీ, దాని మిత్రపక్షాలు సీఎం అభ్యర్థిని నిర్ణయిస్తాయని స్పష్టం చేశారు. నవంబర్ 14న ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ఎన్డీఏ గత రికార్డులన్నింటినీ బద్దలు కొడుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీహార్ సీఎం నితీశ్ కుమార్ కూటములు మార్చడంపైనా అమిత్ షా స్పందించారు. నితీశ్‌ను భారత సోషలిస్ట్ రాజకీయాల్లో కీలక వ్యక్తిగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ పట్ల నితీశ్‌కు దీర్ఘకాలంగా ఉన్న వ్యతిరేకతను హైలైట్ చేశారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ పాలనను గట్టిగా వ్యతిరేకించి జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమంలో చేరారని గుర్తు చేసుకున్నారు. అలాగే నితీశ్ ఆరోగ్య పరిస్థితిపై విపక్షాలు పదేపదే చేస్తున్న విమర్శలపైనా అమిత్ షా వివరణ ఇచ్చారు. తాను నితీశ్‌తో ముఖాముఖిగా మాట్లాడానని, ఫోన్‌లో కూడా సంభాషించానని, ఆ సమయంలో బీహార్ సీఎంలో ఎలాంటి అనారోగ్య సమస్యలను గమనించలేదన్నారు. వృద్ధాప్యం కారణంగా కొన్ని సమస్యలు తలెత్తవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే సీఎం నితీశ్ మాత్రమే కాదు, ఆయన బృందం కూడా పరిపాలనా వ్యవహారాలను నిర్వహిస్తుందని స్పష్టం చేశారు.

ఆర్జేడీ, లాలూపై విమర్శలు

అలాగే లాలూ ప్రసాద్ యాదవ్, మహాఘట్ బంధన్‌పై అమిత్ షా విమర్శలు గుప్పించారు.

లాలూ పాలనను చూసిన బీహార్ ప్రజలు, మళ్లీ తమ రాష్ట్రంలో మహాఘట్ బంధన్ తిరిగి అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మిత్రపక్షాలను తక్కువగా చూస్తుందని దుయ్యబట్టారు. ఇతర పార్టీలను తక్కువ చేసి చూడడం వల్ల కాంగ్రెస్ కూడా చిన్నదిగా మారిందన్నారు. కాంగ్రెస్ కు ఉన్న ఈ అహంకారమే ఆ పార్టీని బీహార్ నుంచి బెంగాల్ వరకు అన్ని రాష్ట్రాలలో పట్టును కోల్పోయేలా చేసిందన్నారు

ముస్లిం ఓట్లపై ఆశలొదులుకున్న నితీశ్

- జేడీయూ టికెట్ల కేటాయింపులో కీలక మార్పు
- 101 స్థానాల్లో కేవలం నలుగురు ముస్లింలకే అవకాశం
- బీజేపీ పొత్తుతో ముస్లింలు దూరమవుతున్నారనే భావన

పట్నా: బీహార్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ (యునైటెడ్) సంచలన నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా తన సెక్యులర్ ఇమేజ్‌ను కాపాడుకుంటూ వస్తున్న ఆ పార్టీ, ఈసారి మైనారిటీ అభ్యర్థుల విషయంలో భిన్న వైఖరి ప్రదర్శించింది. ముస్లిం ఓటర్లు తమకు అనుకూలంగా లేరనే భావనతోనో ఏమో వారికి కేటాయించే టికెట్ల సంఖ్యను తగ్గించింది. 101 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న జేడీయూ... కేవలం నలుగురు ముస్లిం అభ్యర్థులకే టికెట్లు కేటాయించింది. 2020 ఎన్నికల్లో ఆ పార్టీ 11 మంది ముస్లింలకు అవకాశం ఇవ్వగా... వారిలో ఒక్కరు కూడా గెలవలేదు. అదే సమయంలో అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఎంఐఎం పార్టీ ఐదు స్థానాల్లో విజయం సాధించింది. ఈ పరిణామాల నేపథ్యంలో జేడీయూ తన వ్యూహాన్ని మార్చుకున్నట్లు స్పష్టమవుతోంది. బీజేపీతో పొత్తులో ఉన్నంత కాలం ముస్లిం మైనారిటీలు తమకు ఓటు వేయరనే నిర్ధారణకు జేడీయూ వచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2015లో ఆర్జేడీ, కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసినప్పుడు ఏడుగురు ముస్లిం అభ్యర్థులను నిలబెట్టగా, ఐదుగురు విజయం సాధించారు. కానీ, బీజేపీతో కలిసినప్పుడు మాత్రం ఆ ఓటు బ్యాంకు దూరమవుతోందని పార్టీ భావిస్తోంది. ఇటీవల పార్టీ నేతల వ్యాఖ్యలు కూడా ఈ మార్పును బలపరుస్తున్నాయి. ముస్లింలు ఎప్పుడూ నితీశ్ కుమార్‌కు ఓటు వేయలేదని పార్టీ సీనియర్ నేత లలన్ సింగ్ గతంలో వ్యాఖ్యానించారు. అలాగే ముస్లింలు, యాదవుల వ్యక్తిగత పనులు చేయనని మరో ఎంపీ దేవేశ్ చంద్ర ఠాకూర్ అనడం వివాదాస్పదమైంది. ఈ వ్యాఖ్యలు పార్టీలోని అసంతృప్తిని సూచిస్తున్నాయి. వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుకు జేడీయూ మద్దతు ఇవ్వడం కూడా మైనారిటీల విషయంలో పార్టీ తన వైఖరిని మార్చుకుందనడానికి నిదర్శనమన్న వాదన కూడా ఉంది.

మొదటి విడత నామినేషన్లకు ముగిసిన గడువు

- మహాఘట్బంధన్‌లో తేలని పొత్తులు
- 48మంది అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితా

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్‌కు సంబంధించి నామినేషన్ల గడువు శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు ముగిసింది. నామినేషన్ పత్రాల పరిశీలన శనివారం జరుగుతుంది. అక్టోబర్ 20 సాయంత్రం వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ఉపసంహరించుకోవచ్చు. నవంబరు 6వ తేదీన 121 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. ఓ పక్క అధికార ఎన్డీఏ కూటమి సీట్ల పంపకాల ప్రక్రియను పూర్తిచేసుకుని... అభ్యర్థులను ప్రకటించగా... మరో పక్క ప్రతిపక్ష మహాఘట్బంధంలో ఇప్పటికీ సీట్ల పంపకంపై అవగాహన కుదరలేదు. నామినేషన్లు దాఖలు చేసిన ప్రముఖుల్లో ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్, బీజేపీకి చెందిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా ఉన్నారు. రాఘోపూర్ నుండి మళ్లీపోటీ చేస్తున్న తేజస్వి...మరో స్థానంలో పోటీపై ఊహాగానాలను తోసిపుచ్చారు. వరుసగా మూడవసారి విజయం సాధిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. సిన్హా లఖిసరాయ్ నుండి నాల్గవసారి పోటీ చేస్తున్నారు. ఎన్డీఏలో ప్రధాన మిత్రపక్షాలు అనేక అభ్యర్థుల జాబితాలను విడుదల చేశాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ 101 స్థానాలకు అభ్యర్థుల పేర్లను బహిరంగంగా ప్రకటించింది. వారిలో సగానికి పైగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన తరగతులకు చెందిన వారుండగా, నలుగురు ముస్లిం అభ్యర్థులున్నారు. ఇక మహాఘట్బంధన్‌లో కాంగ్రెస్ పార్టీ గురువారం రాత్రి 48 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను ప్రకటించింది. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ రామ్ (కుతుంబ), సీఎల్పీ నాయకుడు షకీల్ అహ్మద్ ఖాన్ (కద్వా), రాష్ట్ర యూత్ కాంగ్రెస్ చీఫ్ ప్రకాశ్ గరీబ్ దాస్ (బెచ్వాడా) సీట్లు కేటాయించారు. బగాహాలో జయేశ్ మంగళ్ సింగ్, నౌతన్‌లో అమిత్ గిరి, చన్‌పటియాలో అభిషేక్ రంజన్, బెట్టియాలో వాసి అహ్మద్, రక్సౌల్‌లో శ్యామ్ బిహారీ ప్రసాద్ పోటీ చేయనున్నారు. గోవింద్‌గంజ్ స్థానం నుంచి శశి భూషణ్ రాయ్ అలియాస్ గప్పు రాయ్, రిగా నుంచి అమిత్ కుమార్ సింగ్ పోటీకి దిగనున్నారు. కాగా, ఆర్‌జేడీ సహా మహా ఘట్బంధన్ పక్షాల మధ్య సీట్ల పంపకాలు ఓ కొలిక్కి రాకమునుపే కాంగ్రెస్ ఈ జాబితాను ప్రకటించడం గమనార్హం. ప్రస్తుతం ఈ కూటమి పక్షాల మధ్య సీట్ల పంపిణీ చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో మొదటి దశ పోలింగ్ నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసి పోగా రెండో దశ పోలింగ్ నామినేషన్లకు ఈ నెల 20వ తేదీతో గడువు ముగియనుంది. వామపక్ష పార్టీలు కూడా అభ్యర్థులను నిలబెట్టాయి. సీపీఎం అభ్యర్థులు బిభూతిపూర్ (సమస్తిపూర్), మాంఝి (సరణ్), పిప్రా (తూర్పు చంపారణ్), మతిహాని (బెగుసరాయ్) నుండి నామినేషన్లు దాఖలు చేశారు. ఆర్జేడీ బహిష్కృత నేత, బీహార్ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ గురువారం వైశాలి జిల్లా మహువా నుండి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఇప్పుడు కొత్తగా స్థాపించిన జనశక్తి జనతాదళ్ కు నాయకత్వం వహిస్తున్న తేజ్ ప్రతాప్ ఎన్నికలకు 21 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటివరకు ఎన్నికలకు 59 మంది అభ్యర్థులను ప్రకటించింది. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జాన్ సూరాజ్ పార్టీ 116 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. పట్నా, దర్భంగా, మాధేపురా, సహర్సా, ముజఫర్‌పూర్, గోపాల్‌గంజ్, సివాన్, సరన్, వైశాలి, సమస్తిపూర్, బెగుసరాయ్, లఖిసరాయ్, ముంగేర్, షేక్‌పురా, నలంద, బక్సర్ మరియు భోజ్‌పూర్ జిల్లాల్లో మొదటి దశలో ఎన్నికలు జరుగుతాయి.

కేంద్రం సర్వేకు ఏం సమాధానం చెబుతారు?

ఇన్ఫోసిస్ మూర్తికి సిద్ధరామయ్య ప్రశ్న

బెంగళూరు: కర్నాటకలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేపై ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి దంపతులకు కొన్ని అపోహలు ఉన్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఇది వెనకబడిన వర్గాల సర్వే అనే అభిప్రాయంతో వాళ్లు ఉన్నారని చెప్పారు. ఈ సర్వేను నారాయణమూర్తి దంపతులు తిరస్కరిస్తూ... తమది వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబం కాదని, ఈ సమీక్షలో పాల్గొనటం వల్ల కమిషన్‌కు, ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని వివరణ ఇవ్వడంపై సీఎం స్పందించారు. 'ఇది వెనకబడిన తరగతుల సర్వే కాదు. ఏడు కోట్ల జనాభా సర్వే అని 20 సార్లు చెప్పాం. వాళ్లు ఏది కావాలంటే అది రాసుకోనివ్వండి. ఈ సర్వే దేని గురించి అనేది ప్రజలు అర్థం చేసుకోవాలి.నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోలేకపోతే నేనేం చేయాలి' అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆర్థికంగా వెనకబడిన మహిళలకు నెలకు రూ.2 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకాల్లో అగ్రవర్ణ మహిళలు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న మహిళలు లేరా అని సీఎం ప్రశ్నించారు.

ఈ సర్వేపై మంత్రులు అనేకసార్లు స్పష్టమైన ప్రకటనలు చేసినప్పటికీ వారికి అపోహలు తొలగిపోలేదన్నారు. ఇప్పుడు కేంద్రం కూడా కుల గణనతో ముందుకు వస్తోందని, అప్పుడు వాళ్లు (మూర్తి దంపతులు) ఏం సమాధానం చెబుతారని అన్నారు. వాళ్ల దగ్గర తప్పుడు సమాచారం ఉందని భావిస్తున్నట్లు చెప్పారు.కాగా, రాష్ట్రంలో నాయకత్వం మారే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయని అడిగిన ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. మార్పు అనేది విప్లవం కాదన్నారు. సందర్భం లేకుండా ఎప్పుడూ ఇటువంటి వాదనలు వస్తూనే ఉంటాయని, వాటిని పట్టించుకోవద్దన్నారు. ఇక ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, కాలేజీల్లో ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలను నిషేధిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సీఎం సమర్థించారు. ఇది ఆర్ఎస్ఎస్ సంస్థ గురించి కాదని, ఇటువంటివి నిర్వహించుకోవాలంటే ఏ సంస్థ అయినా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు.

గరిష్ఠస్థాయికి దళితుల అణచివేత

యోగి సర్కార్‌పై రాహుల్ గాంధీ ధ్వజం

రాయ్‌బరేలిలో బాధిత కుటుంబానికి ఓదార్పు

న్యూఢిల్లీ: రాయ్‌బరేలిలో గ్రామస్తులచే కొట్టి చంపబడిన దళితుడు హరిఓం వాల్మీకి కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరామర్శించారు. యోగి ఆదిత్యనాథ్ పాలనలో దళితుల 'అణచివేత' గరిష్ట స్థాయికి చేరుకుందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుడు చకేరి విమానాశ్రయంలో దిగి ఫతేపూర్‌కు రోడ్డు మార్గంలో దాదాపు 80 కి.మీ ప్రయాణించి... అక్కడ మృతుడి కుటుంబ సభ్యులను కలిశారు. ఆ కుటుంబంతో దాదాపు 25 నిమిషాలు గడిపారు. ఆ సమయంలో బాధితుడు హరిఓం తండ్రి గంగాదీన్, సోదరుడు శివం, సోదరి కుసుమ్‌తో మాట్లాడారు. సంతాపం, మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'ఈ ప్రభుత్వంలో దళితుల అణచివేత అత్యున్నత స్థాయిలో ఉంది. ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదిక ప్రకారం దళితుల అణచివేత కేసుల్లో ఉత్తరప్రదేశ్ నంబర్ వన్ స్థానంలో ఉంది. నన్ను కలవకూడదని ఆ కుటుంబాన్ని ఈ ఉదయం ప్రభుత్వం బెదిరించింది. బాధితుడి కుటుంబం నన్ను కలుస్తుందా లేదా అనేది ముఖ్యం కాదు. ఈ వ్యక్తులు నేరస్థులు కాకపోవడం ముఖ్యం. వారు ఎటువంటి తప్పు చేయలేదు' అని రాహుల్ గాంధీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అన్నారు. 'నేను మృతుడి కుటుంబాన్ని కలిశాను. వారి ఆవేదన విన్నాను. కాంగ్రెస్ పార్టీ, నేను ఆ కుటుంబానికి సాధ్యమైనంత సహాయం అందించడానికి ప్రయత్నం చేస్తాము. దేశంలో దళితులపై ఎక్కడ దారుణాలు జరిగినా కాంగ్రెస్ సహాయం చేయడానికి, న్యాయం కోసం పోరాడటానికి ముందుటుంది' అని తెలిపారు. సమావేశం వివరాలను కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 'ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఫతేపూర్‌లో హరిఓం వాల్మీకి కుటుంబాన్ని కలుసుకుని వారి బాధను పంచుకున్నారు. కొన్ని రోజుల క్రితం దళితుడైన హరిఓంను దారుణంగా కొట్టి చంపారు. అతని కుటుంబం తీవ్ర బాధలో ఉంది. న్యాయం కోసం ఎదురు చూస్తోంది' అని పేర్కొంది. 'హరిఓం వాల్మీకికి జరిగినది ఈ దేశ రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసిన తీవ్రమైన నేరం. ఇంత నిస్సారమైన భావజాలం సమాజానికి మచ్చ. ఈ అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా మేము పోరాడుతూనే ఉంటాము. ఈ దేశం బాబా సాహెబ్ రాజ్యాంగం ద్వారా పరిపాలించబడుతుంది. మనువాదం ద్వారా కాదు' అని తెలిపింది. కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్ విభాగం హిందీలో ఒక పోస్ట్‌లో 'రాహుల్ గాంధీ ఆశ, మద్దతుకు పేరు ('ఉమ్మీద్ ఔర్ భరోసే కా నామ్ - రాహుల్ గాంధీ')' అని పేర్కొంది. ఇదిలాఉండగా, కాంగ్రెస్ నాయకుడు రాకముందే హరిఓం సోదరుడు శివం ఒక వీడియోను విడుదల చేశాడు. 'ఇద్దరు కేబినెట్ మంత్రులు నా ఇంటికి వచ్చారు. నాకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు. నేను ప్రభుత్వంతో సంతృప్తి చెందాను. నా సోదరుడి హంతకులను జైలుకు పంపారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాహుల్ గాంధీ లేదా మరే ఇతర నాయకుడు నా ఇంటికి రావాలని నేను కోరుకోవడం లేదు. నేను ప్రభుత్వంతో సంతృప్తి చెందాను' అని పేర్కొన్నారు. అయితే ఈ వీడియో ఒత్తిడిని సృష్టించడానికి, పరిస్థితిని మార్చటానికి బీజేపీ చేసిన ప్రయత్నంలో భాగమని కాంగ్రెస్ ఆరోపించింది.

విజయ్ పార్టీకి గుర్తింపు లేదు

మద్రాసు హైకోర్టుకు తెలిపిన ఈసీ

చెన్నై: ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు విజయ్‌కు చెందిన టీవీకే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదని భారత ఎన్నికల కమిషన్ శుక్రవారం మద్రాసు హైకోర్టుకు తెలియజేసింది. తమిళగ వెట్రీ కజగం (టీవీకే) గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ సి.సెల్వకుమార్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణకు వచ్చినప్పుడు ఈసీ తరపు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ ప్రధాన న్యాయమూర్తి ఎంఎం శ్రీవాస్తవ, న్యాయమూర్తి జస్టిస్ జి.అరుళ్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం ముందు ఈ వాదనను వినిపించారు. సెప్టెంబరు 27న కరూర్‌లో నిర్వహించిన పార్టీ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన నేపథ్యంలో టీవీకే గుర్తింపు రద్దు కోరింది. విజయ్ ఈ ర్యాలీకి హాజరయ్యారు. కరూర్ తొక్కిసలాటకు సంబంధించిన అన్ని విషయాలను హైకోర్టు పరిపాలనా పక్షం ముందు ఉంచాలని, సుప్రీం కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న కేసులను మినహాయించి కేసులను పరిష్కరించడానికి ఒక బెంచ్‌ను ఏర్పాటు చేయాలని బెంచ్ రిజిస్ట్రీని ఆదేశించింది. టీవీకే గుర్తింపును రద్దు చేయాలనే అభ్యర్థన విషయానికొస్తే... నిరంజన్ రాజగోపాల్ ఆ పార్టీ గుర్తింపు పొందిన పార్టీ కాదని, అందువల్ల ఆ అభ్యర్థన నిలబడదని అన్నారు. మొదట, ఈ పిటిషన్ మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్‌లో దాఖలయింది. కానీ పిటిషన్‌లో మొదటి ప్రతివాది ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) అయినందున దానిని బదిలీ చేసి మొదటి బెంచ్ ముందు జాబితా చేశారు. విజయ్‌పై ఎఫ్ఆర్‌ను మార్చాలనే అభ్యర్థన విషయానికొస్తే... సీబీఐ దర్యాప్తునకు సుప్రీం కోర్టు ఆదేశం ద్వారా దీనిని సమర్థవంతంగా పరిష్కరించవచ్చని బెంచ్ తెలిపింది. ఫిబ్రవరి 5, 2024 నాటి ఆదేశాన్ని కచ్చితంగా పాటించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఏదైనా రాజకీయ ర్యాలీలు, ఊరేగింపులు, ఎన్నికల ప్రచారాలలో పిల్లలు, మహిళలను ఉపయోగించుకోవడంపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని సెల్వకుమార్ తన పిటిషన్‌లో కోరారు. అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పైన పేర్కొన్న నిషేధానికి కట్టుబడి ఉండేలా హామీ ఇవ్వాలని, లేకుంటే ఈసీఐ గుర్తింపును రద్దు చేయడంతో సహా తగిన చర్యను ప్రారంభించాలని ఆయన ఆదేశించాలని ఆయన కోరారు. చట్టవిరుద్ధంగా మహిళలు, మైనర్ పిల్లలను సమీకరించడం వల్ల సామూహిక ప్రాణనష్టం జరిగిందనే ఆరోపణలపై టీవీకే నాయకత్వంపై బాధ్యత వహించాలని కూడా ఆయన కోరారు. మృతులకు కనీసం 1 కోటి రూపాయలు, గాయపడిన వారికి తగిన పరిహారం చెల్లించాలని టీవీకేను ఆదేశించాలన్నారు.

డీఐజీని పట్టించిన వాట్సాప్ కాల్

చండీగఢ్: పంజాబ్‌లో డీఐజీ హర్‌చరణ్ సింగ్ బుల్లార్‌కు చెందిన అవినీతి ఆరోపణలపై సీబీఐ అధికారులు ఆధారాలను విడుదల చేశారు. లంచం తీసుకోవాలని మధ్యవర్తితో బుల్లార్ మాట్లాడిన వాట్సాప్ కాల్ రికార్డింగ్‌ను సాక్ష్యంగా చూపారు. మండి గోబింద్‌ఘర్‌కు చెందిన స్క్రాప్ డీలర్ నరేశ్ బట్ట ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీబీఐ అధికారులు రంగంలోకి దిగారు. 2023 నాటి క్రిమినల్ కేసును సెటిల్ చేసేందుకు రూ. 8 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. మధ్యవర్తి కిర్షను కూడా అరెస్టు చేశారు. షిర్‌హింద్ పోలీసు స్టేషన్‌లో బుల్లార్‌పై నమోదు అయిన ఎఫ్ఐఆర్‌లో అనేక అంశాలు పొందుపరిచారు. డీఐజీ బుల్లార్ ప్రతి నెలా డబ్బులు ఇవ్వాలని వేధించారు. ఒకవేళ నెలనెలా వసూళ్లు ఇవ్వకుంటే, బిజినెస్ సంబంధిత నేరాల్లో ఇరికిస్తామని హెచ్చరించేవాడు. నెలవారి వసూళ్లతో పాటు బుల్లార్ అదనంగా 28 లక్షలు డిమాండ్ చేసినట్లు స్క్రాప్ డీలర్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మధ్యవర్తి కిర్షనుతో బుల్లార్ మాట్లాడిన ఫోన్ కాల్ అతడి అరెస్టులో కీలకంగా మారింది. డీఐజీ, మధ్యవర్తి మధ్య జరిగిన సంభాషణ ఆధారంగా సీబీఐ చర్యలకు దిగింది. ఈ నెల 11వ తేదీన ఇద్దరి మధ్య వాట్సాప్ ద్వారా సంభాషణ జరిగింది. అయితే లంచం వసూల్ చేయాలని చెప్పి మధ్యవర్తి కిర్షనుకు ఆ ఫోన్ కాల్ ద్వారా డీఐజీ ఆదేశించినట్లు తేలింది. 8 లక్షలు తీసుకో.. లేదా అతడు ఎంత ఇస్తే అంత తీసుకో, కానీ చివరకు 8 లక్షలు ఇవ్వాల్సిందే అని చెప్పు అని డీఐజీ తన సంభాషణలో పేర్కొన్నారు. బుల్లార్ ఇంటి నుంచి రూ.5 కోట్ల నగదు, 1.5 కేజీల బంగారాన్ని, బీఎండబ్ల్యూ, ఆడి కార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. 22 లగ్జరీ వాచీలు, 40 లీటర్ల విదేశీ మద్యం, వివిధ రకాల ఆయుధాలు, డబుల్ బారెల్ గన్, పిస్తోల్, రివాల్వర్, ఎయిర్‌గన్ ఉన్నాయి.

ఉప రాష్ట్రపతి నివాసానికి బాంబు బెదిరింపు

చెన్నై: తమిళనాడులో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. కొన్ని రోజులుగా ప్రముఖుల ఇళ్లు, ప్రధాన కార్యాలయాలకు బాంబు బెదిరింపులు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నివాసమే లక్ష్యంగా ఈ బెదిరింపులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన అధికారులు తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం చెన్నైలోని ఉప రాష్ట్రపతి నివాసంలో బాంబు అమర్చినట్లు రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. దీంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది ఆయన ఇంటికి చేరుకొని తనిఖీలు చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. దీంతో ఇది బూటకపు బెదిరింపుగా నిర్ధారించారు. ఈ మెయిల్ పంపిన వారిని పట్టుకునేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

పరీక్ష ఎగ్గొట్టేందుకు...

పరీక్ష ఎగ్గొట్టేందుకు ఓ విద్యార్థి ఏకంగా పాఠశాలలో బాంబు ఉందంటూ బెదిరింపులకు పాల్పడిన ఘటన ఢిల్లీలో చోటుచేసుకుంది. గురువారం విశాల్ భారతి పబ్లిక్ స్కూల్‌కు ఈ-మెయిల్ ద్వారా ఈ బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేయగా... ఎలాంటి పేలుడు పదార్థాలు దొరకలేదు. దీంతో ఇది బూటకమైనదిగా పేర్కొన్నారు. మెయిల్ పంపిన వారిని గుర్తించేందుకు దర్యాప్తు చేయగా... బెదిరింపులకు పాల్పడింది ఆ పాఠశాల్లోని విద్యార్థి అని తేలింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించారు. పరీక్షలకు భయపడే తాను ఇలా చేశానని విద్యార్థి అంగీకరించాడు. దీంతో పోలీసులు బాలుడిని మందలించి ఇంటికి పంపించేశారు.

జుబీన్ గర్గ్ మరణంపై అనుమానాల్లేవ్

సింగపూర్ పోలీసుల వెల్లడి

గువహతి: అస్సామీ గాయకుడు జుబీన్ గర్గ్ మరణంపై సింగపూర్ పోలీసులు కీలక సమాచారం అందించారు. జుబీన్ గర్గ్ మరణం విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి అనుమానాలు కనిపించలేదని, దర్యాప్తు జరుగుతోందని సింగపూర్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు సింగపూర్ కరోనర్స్ చట్టం ప్రకారం దర్యాప్తులో ఉందని, ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా ఎటువంటి అనుమానం రాలేదని సింగపూర్ పోలీసులు తెలిపారు. 'ఈ కేసుపై సమగ్రమైన, వృత్తిపరమైన దర్యాప్తు నిర్వహించడానికి కట్టుబడి ఉన్నాం. దీనికి సమయం పడుతుంది. ధృవీకరించని సమాచారాన్ని ఊహాగానాలు చేయవద్దని, వ్యాప్తి చేయవద్దని మేము ప్రజలను కోరుతున్నాము' అని తెలిపారు. దర్యాప్తు జరుగుతున్నప్పటికీ అక్టోబర్ 1న పోస్టుమార్టం కాపీని, ప్రాథమిక దర్యాప్తును భారతదేశానికి పంపినట్లు తెలిపారు. దర్యాప్తునకు మూడు నెలల సమయం పడుతుందన్నారు. జుబీన్ గర్గ్ సింగపూర్‌లోని నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్‌కు వెళ్లారు. సెప్టెంబర్ 19న సముద్రంలో ఈత కొడుతూ ప్రాణాలు కోల్పోయారు. జుబీన్ గర్గ్ మరణంపై అనేక అనుమానాలు రేకెత్తాయి. దీంతో అసోం ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. దర్యాప్తులో భాగంగా ఈవెంట్ నిర్వాహకుడు శ్యామ్‌కాను మహంత, మేనేజర్ సిద్దార్థ్ శర్మ, బంధువు సందీపన్ గర్గ్, నందేశ్వర్ బోరా సహా ఐదుగురిని అరెస్టు చేశారు. జుబీన్ గర్గ్‌పై విషప్రయోగం జరిగిందని ఆయన బ్యాండ్‌మేట్ ఆరోపించాడు. ప్రస్తుతం ఆ దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

రవాణా ఉద్యోగులకు దీపావళి బోనస్

చెన్నై: రాష్ట్ర రవాణా శాఖ ఉద్యోగులకు తమిళనాడు ప్రభుత్వం దీపావళి బోనస్ ప్రకటించింది. చక్కెర కర్మాగారాల్లో పనిచేస్తున్న 5,308 మంది కార్మికులకు కూడా బోనస్ ప్రకటించింది. ఈ విషయమై రవాణా శాఖ మంత్రి శివశంకర్ మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా రవాణా శాఖలో పనిచేస్తున్న 1,05,955 మంది ఉద్యోగులకు బోనస్, గ్రాట్యుటీ నిధిగా రూ.175.51 కోట్లు వారి బ్యాంక్ ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. సహకార సంఘాల ఉద్యోగులకు 20 శాతం దీపావళి బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో సహకార సంఘాలకు కేటాయించిన మిగులు పరిగణనలోకి తీసుకుని 20 శాతం బోనస్ ఇస్తున్నట్లు తెలిపింది. మిగులు లేని సంఘాల్లో పనిచేసే వారికి 10 శాతం బోనస్, గ్రాట్యుటీ అందిస్తున్నామని, నికర లాభం పొందని ఉద్యోగులకు రూ.2,400 గ్రాట్యుటీ అందజేయనున్నట్లు తెలిపింది. ఆ ప్రకారం 44,081 మంది ఉద్యోగులకు రూ.44.11 కోట్లు బోనస్, గ్రాట్యుటీగా అందజేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

శబరిమల బంగారం కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

తిరువనంతపురం: శబరిమల ఆలయంలో విగ్రహాల బంగార తాపడం కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతనిని మధ్యాహ్నం కోర్టు ముందు హాజరు పరిచారు. బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త ఉన్నికృష్ణన్ పొట్టిని ఆయన ఇంట్లో (పులిమత్‌లో) అదుపులోకి తీసుకున్నట్లు (సిట్) అధికారులు తెలిపారు. అనంతరం, తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలో విచారించినట్లు సిట్ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ఇంజనీర్ కె.సునీల్ కుమార్‌ను ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ గతంలో సస్పెండ్ చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

పాఠశాల సందర్శన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ రాధిక గుప్త జిల్లా విద్యాశాఖ అధికారి విజయ్ కుమారి, స్థానిక మున్సిపల్ కమిషనర్‌తో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జవహర్ నగర్, బాలాజీ నగర్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల యొక్క మౌలిక వసతులను విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను పరిశీలించడం జరిగింది. ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అత్యధికంగా ఉండడం వలన విద్యార్థులకు కావలసిన అదనపు టాయిలెట్స్ కానీ కాంపౌండ్ వాల్ కిచెన్ షెడ్ డైనింగ్ హాల్ మొదలకు అంశాలకు సంబంధించిన అవసరాలను గుర్తించి వాటికి సంబంధించిన ఎస్టిమేషన్స్ ను తయారు చేసి ఆ పనులను త్వరలో పూర్తి చేసే విధంగా అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న వివిధ ల్యాబ్ లను ఏఆర్ వీఆర్ ల్యాబ్ కూడా పరిశీలించడం జరిగింది.

నేడు రాష్ట్ర బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం బీసీ జేఏసీ ఈనెల 18న ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర బందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సంపూర్ణ మద్దతు తెలిపిందని సీపీఐ జిల్లా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు అన్నారు. పార్టీలకు అతీతంగా బీసీ శ్రేణులు పాల్గొని బీసీల ఐక్యతను చాటాలని కాసర్ల నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కుల గణన సర్వే నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపిన స్పందించలేదని శాసన సభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపిన ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయి అన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని దేశానికి వినిపించడం కోసమే ఈనెల 18న బంద్ జరుగుతుందని ఈ బందుకు అఖిలపక్ష రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించాలని బీసీ ఉద్యమం వ్యక్తుల కోసం కాదని బీసీ వ్యవస్థ మేలు కోసం జరిగే ఈ బందుకు వ్యాపార వాణిజ్య విద్యాసంస్థలు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా బందుకు సహకరించాలని నాగరాజు విజ్ఞప్తి చేశారు.

సీపీఆర్‌పై అవగాహన

విశాలాంధ్ర, హైదరాబాద్ : అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే సిపిఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డా.ప్రొఫెసర్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గాంధీ మెడికల్ కాలేజ్, సికింద్రాబాద్,అలుమిని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సిపిఆర్ అవగాహన సదస్సులో జక్కుల రాములు , జిల్లా మీడియా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు సిపిఆర్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఈరోజు ఈ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది 60 మంది పాల్గొన్నారు. డా.వెంకటి జిల్లా వైద్య అండ్ ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి సిపిఆర్‌పై అవగాహన కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉన్నట్లయితే అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తులు ప్రాణాలను ఎలా కాపాడగమో అనే విషయాన్ని గ్రహిస్తే , ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించుటకు వీలు కలుగుతుందన్నారు. ప్రొఫెసర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం మందగించినప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్స. గుండెపోటు, లేదా ఇతర అకస్మాత్తుగా సంభవించే సంఘటనల వంటి అత్యవసర పరిస్థితులలో సిపిఆర్ చేయడం చాలా ముఖ్యమని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, ప్రజలకు సీపీఆర్ పద్ధతులను నేర్పడంతో తద్వారా అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.చైతన్య, డా.శ్రీనివాసరావు , మెడికల్ సూపరింటెండెంట్, గోల్కొండ ప్రభుత్వ ఆస్పత్రి, డా. శ్రీధర్ బాబు, డిప్యూటీ సివిల్ సర్జన్, డాక్టర్ అరుణ్ కుమార్, హరిప్రియ, ప్రజ్ఞ, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) అలైన్మెంట్లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులకు ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసిత రైతులు ప్లాట్ల యజమానులు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు చింతల దామోదర్ రెడ్డి, నడికుడి అంజయ్య, గుజ్జుల సురేందర్ రెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి, జాల వెంకటేష్ యాదవ్, జాల శ్రీశైలం యాదవ్, సందగల మల్లేష్ గౌడ్, నాగవల్లి దశరథ గౌడ్, నెల్లికండి నాగార్జున యాదవ్, గాజుల భగత్, రావికంటి శ్రీనివాస్, బద్రీద్దీన్, తాటికొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు మద్దతుగా నల్ల బ్యాడ్జీలతో నిరసన

విశాలాంధ్ర, బషీర్ బాగ్: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేపట్టాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్స్ లేక పోవడం వల్ల అన్యాయం జరుగుతుందన్నారు. బీసీ ఉద్యోగులకు జనాభా ప్రాతిపదికన బీసీ ఉద్యోగులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్ అమలు చేయాలని అన్నారు. నేటి బీసీ బంద్ కు సంఘీభావంగా రాష్ట్రంలోని బీసీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రమాదేవి, జ్ఞానేశ్వర్, రామరాజు, శ్రీనివాస్, శంకర్, యాదయ్య, సాగర్, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్‌లో రాష్ట్రంకు మూడో ర్యాంకు

అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ ప్రతిభ కనబర్చి.. అవార్డులు సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సెక్రెటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ అవార్డులను స్వీకరించారు. శుక్రవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆది కర్మయోగి జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్‌మన్, ఆది కర్మయోగి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామ స్థాయి అధికారులను రాష్ట్రపతి సత్కరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సన్మాన కార్యక్రమం జరిగింది. గిరిజన సాధికారత కార్యక్రమాలు - PM-JANMAN, ఆది కర్మయోగి అభియాన్, జనభాగిరధి, ధర్తి ఆబా జన్ భగీదరి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖలు, అధికారులకు భారత రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. మూడో స్థానంలో నిలిచింది. అలాగే.. తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ పి.విని సూపర్ కోచ్‌లు/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్‌లలో ఒకరిగా సత్కరించారు. ఆదికర్మయోగి అభియాన్ - ఆదిలాబాద్, నల్గొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఉత్తమ ప్రదర్శన సూపర్ కోచ్/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్ - డాక్టర్ కీర్తి. ధార్తీ అభా జనభాగిదారి అభియాన్ - ఆదిలాబాద్, ఆసిఫాబాద్. ఈ కార్యక్రమంలో డా.గౌరవ్ ఉప్పల్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి పాటిల్, వెంకటేశ్ ధోత్రే లు, ఆదిలాబాద్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మత్, ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, ట్రైబల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో శనివారం జరిగే బీసీ బందును జయప్రదం చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. హిమాయత్ నగర్ నుండి ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ మీదుగా వైఎంసిఏ నారాయణగూడ చౌరస్తా దుకాణదారులకు, వ్యాపారస్తులకు రేపు బంద్ సందర్భంగా సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలి. రాష్ట్రంలో ఉన్నటువంటి బీజేపీ నేతలు తీరు చూస్తుంటే నోటితో మాట్లాడుతూ నొసలితో వెక్కిరిస్తున్నట్లు కనబడుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు 8 మంది ఉన్న పార్లమెంటులో బీసీల పక్షాన బీసీ రిజర్వేషన్ల కోసం నోరు మెదపకపోవడం సిగ్గుచేటు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి బీసీ బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపగా ఒత్తిడికి తెరవెనుక బిజెపి ఒత్తిడికి తలొగ్గిన గవర్నర్ ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తూ తీరని అన్యాయం చేస్తున్నాడు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోర్టుల చుట్టూ తిరగకుండా అఖిలపక్ష నాయకులను ఏకం చేసి దిల్లీలో ప్రధానమంత్రి దగ్గరికి తీసుకువెళ్ళి బీసీ రిజర్వేషన్లను సాధించే దిశగా ఒత్తిడి తేవాలి. కమతం యాదగిరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ వర్గాలకు రాజ్యాంగ సవరణ చేసి రిజర్వేషన్లు కల్పించిన విధంగానే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించుట కోసం రాజ్యాంగా సవరణ చేసి 9వ షెడ్యూల్లో పెట్టాల్సిన బాధ్యత ఉన్నదని తెలిపారు. రేపు బీసీ సంఘాలు ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు, బహుజన సంఘాలు తలపెట్టిన ఈ బందుకు తెలంగాణ సబ్బండ వర్గాల ప్రజలు, చేతివృత్తుల ప్రజలు, కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు, సామాజిక వేత్తలు, చైతన్యవంతులు అందరూ పాల్గొని తమ ఆకాంక్షను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్ కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, షేక్ మహమూద్,బొడ్డుపల్లి కిషన్, ఇమ్రాన్, చైతన్య, ఎన్.ఆర్.శ్రీనివాస్ అనిల్, లెనిన్, షబ్బీర్, ఉదయ్, జగన్, అరుణ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : దీపావళి పండుగ వేళ కార్మికుల బతుకులు చీకటి అలుముకోకుండా పెండింగ్ వేతనం అందించి పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. శుక్రవారం పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనం తక్షణమే అందించాలని కోరుతూ మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరకి కార్మికులు వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా సాయి సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీకి వేతనాలు సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కార్మికులకు దసరా పండుగకు జీతాలు అందలేదని యూనియన్ కార్మికుల విజ్ఞప్తి మేరకు సాయి సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ నిర్వాహకులు అడ్వాన్సు రూపేనా రూ.5000 నుండి 7000 వరకు డబ్బులు మాత్రమే ఇచ్చారని అన్నారు. పండగ పూట కార్మికులు చేసిన కష్టార్జితం చేతికి రాక పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడదని అన్నారు. త్వరలో దీపావళి పర్వదినం వస్తున్న నేటికీ కార్మికులకు వేతనాలు అందలేదని వాపోయారు. కనుక తక్షణమే కార్మికులకు రావాల్సిన పెండింగ్ జీతం వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో మెరుపు సమ్మె తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు బి.చెన్నయ్య, అంజి, యాదయ్య, నైసన్, పద్మ, ఎల్లమ్మ,అరుణ, జంగమ్మ,సునీత, అంజలమ్మ,జమున, వరలక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం

- నోటీసులు జారీ చేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్
- నగర ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉదయం 09.30 గంటల కల్లా వ్యర్థాలను తొలగించాలని హుకుం.
- ఆదేశాలను బేఖాతరు చేస్తే హెవీ పెనాల్టీలతో పాటు చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరిక

విశాలాంధ్ర, హైదరాబాద్ : నగరంలోని చెత్త సేకరణ కార్యకలాపాల్లో ఆలస్యం, నిర్లక్ష్యం కారణంగా జీహెచ్‌ఎంసీ రాంకీ సంస్థకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ నోటీసు జారీ చేశారు. నగర వ్యాప్తంగా ఉన్న 2,532 గార్బేజ్ వల్నరెబుల్ పాయింట్ (జీవిపి) లలో, అలాగే బిన్ పాయింట్‌లలో ప్రతి రోజూ ఉదయం 10.30 గంటల కల్లా చెత్తను ఒప్పందం మేరకు సంస్థ తప్పనిసరిగా తొలగించాలి. అక్టోబర్ 16 నగర వ్యాప్తంగా ఉన్న 2,532 గార్బేజ్ వల్నరెబుల్ పాయింట్ (జీవిపి)లలో కేవలం 1,879 మాత్రమే నిర్దేశిత సమయంలో తొలగించింది. నిర్దేశిత సమయంలో జీవిపి, బిన్ పాయింట్ లలో చెత్తను తొలగించడం లలో రాంకీ సంస్థ వైఫల్యం చెందుతుంది. నగరంలో ప్రతిపాదించిన 2,000 సెకండ్ స్టోరేజ్ బిన్లలో 850 బిన్‌లను మాత్రమే ఏర్పాటు చేసింది. మిగిలిన బిన్లను వెంటనే ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉదయం 09.30 గంటల కల్లా వ్యర్థాలను తొలగించాలని కమిషనర్ సంస్థను ఆదేశించారు. ఈ ఆదేశాలను పాటించకపోతే, ఒప్పందంలోని నిబంధనల ప్రకారం హెవీ పెనాల్టీ లు విధించడంతో పాటు చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ నోటీస్ లో హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్.డబ్ల్యు సంస్థను జీహెచ్‌ఎంసీ కమిషనర్ హెచ్చరించారు.

బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు : బి. బాల్‌కిషన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : అక్టోబర్ 18న స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాలు రాజకీయ పార్టీలు బంద్ చేస్తున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు ఒక ప్రకటనలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి బాల్‌కిషన్ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ షెడ్యూల్ 9లో చేర్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు రాష్ట్రంలో ఉన్న బీజేపీ నేతలు మాట్లాడకుండా బీసీలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు దిల్లీ వెళ్లి ప్రధాని వద్ద ఉద్యమం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి బీజేపీ దాటవేత ధోరణి చేస్తుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుంటే ఆందోళనలు తప్పవన్నారు. అక్టోబర్ 18న బీసీ సంఘాలు చేస్తున్న బందుకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలుపుతూ ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో పార్టీ శ్రేణులు ప్రజా సంఘాల నాయకులు బందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పట్టణ కార్యదర్శి కోట కదిర నరసింహ , సత్యనారాయణ రెడ్డి, చాంద్ భాషా, ఏఐవైఎఫ్ కో కన్వీనర్ మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ నాయకులు గంటల శ్రీనివాసులు, సుందర్ రాజ్, హనుమంతు రమేష్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఆందోళన

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజే జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శేరిలింగంపల్లి బీ జే జెఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చందానగర్ లోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్న వ్యతిరేక శక్తులకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతిపత్రాన్ని జేఏసీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి తెలంగాణ జేఏసీ మాజీ చైర్మన్, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కో చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, తెలంగాణ బిసి కుల సంఘాల జేఏసీ కన్వీనర్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, జేఏసీ నాయకులు తుడి ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ లు మాట్లాడుతూ దేశంలో స్వతంత్రం వచ్చిన నాటినుంచి నేటి వరకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేవలం బీసీలకు మాత్రమే లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 18న బంద్ ఫర్ జస్టిస్ పేరుతో తలపెట్టిన తెలంగాణ బంద్‌ను సంపూర్ణంగా విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కె సాయన్న ముదిరాజ్, బీసీ జేఏసీ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్, సగర సంఘం రాష్ట్ర సలహాదారులు కెపి రామ్ సగర, సగర సంఘం గ్రేటర్ అధ్యక్షుడు మోడల రవి సగర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక శ్రీనివాస్ సగర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంగాధర్ సగర, జేఏసీ నాయకులు జిల్ల గణేష్, సీతారాం సగర, రామకృష్ణ సగర, అశోక్ యాదవ్, నరసింహ, శంకర్ ముదిరాజ్, బాలరాజు సగర, నారాయణ రావు, శివశంకర్, ఆంజనేయులు సగర, చింతకింది రవీందర్ గౌడ్, కుమార్ యాదవ్, చెన్నం రాజు ముదిరాజ్, చందు సగర తదితర బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు,

హ్యూవెల్ నూతన కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైసెస్ పార్క్‌లో హ్యూవెల్ సంస్థ ఏర్పాటు చేసిన నూతన కెమిస్ట్రీ ల్యాబ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాంత బయోటెక్ ఎండీ వరప్రసాద్ రెడ్డి, హ్యూవెల్ కంపెనీ ఎండీ, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ మెడికల్ డివైసెస్ పార్క్ ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించారు. మనదేశంలో 70. 8 నుంచి 80శాతం మనం వాడే మెడికల్ పరికరాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అట్లా ఎందుకు ఉండాలి? మన దేశంలో ఎందుకు ఈ ఉత్పత్తులు కాకూడదు? అనే ఆలోచనతో కేసీఆర్ ప్రభుత్వంలో ఈ మెడికల్ డివైసెస్ పార్క్ ఏర్పాటు చేయడం జరిగింది. మన దేశంలో ఉత్పత్తి అయితే ధర కూడా తగ్గి, సామాన్యుడికి ఇవన్నీ అందుబాటులోకి వస్తాయన్న ఉద్దేశంతోనే దీనిని ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు. పార్క్ ఏర్పాటుకు ముందు సుల్తాన్‌పూర్ ఏరియాలో స్టోన్ క్రషర్లు, మెటల్ క్రషర్లు, కొంత ఖాళీ జాగా తప్ప ఏమీ లేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఇక్కడికి వస్తే వేల మంది పని చేస్తుండటం, అనేక పరిశ్రమలు రావడం చూసి చాలా సంతోషం అనిపించిందని అన్నారు. ఇక్కడ జరిగిన పరిశోధనలు, ప్రవేశపెట్టిన ఉత్పత్తులు చూస్తే తనకు విశ్వాసం కలిగిందని తెలిపారు. కోవిడ్ సమయంలో ఆర్టీపీసీఆర్ టెస్ట్‌లకు, కోవిడ్ కిట్స్‌కు విపరీతమైన గిరాకీ, డిమాండ్ ఉండేదని, ఆ రోజుల్లో టెస్ట్ కిట్ కావాలంటే చాలా పెద్ద ఎత్తున ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. హ్యూవెల్ సంస్థకు చెందిన శిశిర్, రచన, వారి బృందం మొత్తం కలిసి అప్పట్లో రూ.6,000 ఖర్చయ్యే ఒక టెస్ట్ ధరను కేవలం రూ.12కు తగ్గించామని చెప్పడం అద్భుతమని కొనియాడారు. పోర్టబుల్ ఆర్టీపీసీఆర్ కిట్ వంటి ఉత్పత్తుల ద్వారా ధరలు తగ్గించి సామాన్యుడికి మేలు చేసే పరిశోధనలు, కార్యక్రమాలు చేస్తున్నందుకు కేటీఆర్ హ్యూవెల్ బృందాన్ని అభినందించారు. "సామాన్యుడికి ఫలాలు అందించని పరిశోధన నిష్ఫలం, దాని వల్ల వ్యర్థం," అని కేసీఆర్ తమకు ఎప్పుడూ చెప్తుంటారని కేటీఆర్ తెలిపారు. సాంకేతికత (టెక్నాలజీ) ఉన్నా దాని వల్ల సామాన్యుడికి లాభం జరగకపోతే అది వేస్ట్ అని కేసీఆర్ సందేశాన్ని ఆయన పునరుద్ఘాటించారు. హ్యూవెల్ సంస్థకు ఇది పదవ వార్షికోత్సవం సందర్భంగా కేటీఆర్ బృందాన్ని అభినందించారు. మీరు కూడా మేము కూడా కలిసి హైదరాబాద్‌ని, తెలంగాణాని, భారతదేశాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మనసారా కోరుకుంటున్నాను,' అని కేటీఆర్ ఆకాంక్షించారు. మరో రెండేళ్లలో మేము అధికారంలోకి వస్తాం. వచ్చిన తర్వాత ఇంకా బాగా చేస్తాం, అని ఆయన అన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం తోపునూరి చక్రపాణి అధ్యక్షతన శుక్రవారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం హైదరాబాద్‌లో జరిగినది. ఈ సమావేశంలో ముఖ్య అతిదిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్. బాలరాజు మాట్లాడుతూ పాఠశాల వంట కార్మికులు వంట బిల్లులు, వేతనాలు నెలలు తరపడి పెండింగ్‌లో ఉంటే వారి జీవనం ఎలా అన్నారు. అల్పాహారం పాత బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని, మళ్లీ అల్పాహారం పథకం ప్రవేశ పెడితే ఎలా అమలు చేయాలి, వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం ఎన్నికల హామీ అయిన రూ.10వేల వేతనాలు వెంటనే అమలు చేయాలని, వంట కార్మికులను తొలగించకుండా జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈ నెల 31న, నవంబర్ 12న టోకెన్ సమ్మె చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యధర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపెల్లి విజయలక్ష్మి, తోపునూరి చక్రపాణి, ఆధి రంగారెడ్డి, మీస లక్ష్మణ్, ధర్మల రామ్మూర్తి, నిమ్మటూరి రామక్రిష్ణ, సంఘెం పద్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

విశాలాంధ్ర హైదరాబాద్ : భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో పురస్కరించుకొని శుక్రవారం మల్లికార్జుననగర్‌లో గల అప్పర్ ప్రైమరి పాఠశాలలో వెస్ట్ మల్కాజిగిరి సత్యసాయి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు డాక్టర్ హైమావతి చేతుల మీదిగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు టూత్ బ్రెస్, ప్రేస్టను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏకలవ్య నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రాధా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంత సంరక్షణ ముఖ్య మని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, పాఠశాల నిర్వాహకురాలు భారతి, రేణుక, భారతి, ఇందిరా, క్రిష్ణ కుమారి, సునీత, శ్రీనివాస్ గౌడ్, గంగాధర్, సుబ్బారాయుడు, వై.శంకర్రావు, ఏవి స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో గేమింగ్ ఈవెంట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఫెస్టివల్ డ్రీంహ్యాక్ ఇండియా 2025 మళ్లీ హైదరాబాద్ కామిక్ కాన్తో కలసి ఈ ఏడాది అభిమానులకు మూడురోజుల గేమింగ్, ఈ-స్పోర్ట్స్, పాప్ కల్చర్ ఉత్సవాన్ని అందించబోతోంది. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, హైదరాబాద్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి. ఆరవ వార్షికోత్సవ ఎడిషన్‌గా జరుగుతున్న ఈసారి డ్రీంహ్యాక్ ఇండియా మరింత ఘనంగా, ఉత్సాహభరితంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ-స్పోర్ట్స్ ఉత్సాహాన్ని కామిక్ కాన్ సృజనాత్మకతతో కలిపి అభిమానులకు వినోదభరిత అనుభవం అందించనున్నారు. కాస్ప్లే పోటీల్లో విజేతలకు రూ.50,000 వరకు బహుమతులు ఉండనున్నాయి. నాడ్విన్ గేమింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అక్షత్ రాఠీ మాట్లాడుతూ గత ఆరు ఏళ్లలో డ్రీంహ్యాక్, కామిక్ కాన్ కలయిక భారత గేమింగ్ ప్రపంచానికి కొత్త ఉత్సాహం తెచ్చింది. ఈ ఏడాది మరింత బలంగా, పెద్దదిగా వస్తున్నాం,' అన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోరు

ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి దిశా నిర్దేశం : మాగంటి సునీత

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : మనం వేసే ప్రతి ఓటు ప్రజాస్వామ్య పునాదులను మరింత బలోపేతం చేస్తుందని జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం శ్రీనగర్ కాలనీ, కమలాపురి కాలనీ లోని మర్కజ్ ఖైరుల్ ఆనామ్ మస్జిద్ లో ముస్లిం సోదరులను కలిసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. అనంతరం గడపగడపకు వెళ్లి ప్రజలతో మమేకమై జూబ్లీహిల్స్ గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని మరోసారి తమకు మద్దతు అందించాలని కోరారు.

బీఆర్ఎస్ గెలుపుఖాయం : కృష్ణారావు

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఆపార్టీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మల్కాజిగిరి కంటెస్టెడ్ ఎంపీ రాగడి లక్ష్మారెడ్డిలు ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని జైరాగుశంబాగ్, నందానగర్ వెంకటేశ్వర కాలనీ, కళ్యాణ్ నగర్, ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ వెనకాల వీధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతతో కలిసి గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాల్సిందిగా ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత భారీ మోజార్టీతో గెలుపొందడం ఖాయన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అవినీతిమయంగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ఎన్నికల ముందు ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాన్ని ఉప ఎన్నిక ప్రచారంలో ప్రజలకు తెలిపి బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టుగూడ కార్పొరేటర్ సునీత, కూకట్పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి పార్టీ సీనియర్ నాయకురాలు ఆయుషా షకీల్, ఎర్రగడ్డ కంటెస్టెడ్ కార్పొరేటర్ పల్లవి యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రచారం

విశాలాంధ్ర, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ శ్రేణులతో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రచారం చేపట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో కీలక సమావేశం జూబ్లీహిల్స్, శ్రీనగర్ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించారు. పోలింగ్ బూత్ నంబర్లు 303 నుండి 310 పరిధిలోని బూత్ ఇన్చార్జిలతో జరిగిన ఈ సమావేశానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సోమాజిగూడ డివిజన్ క్లస్టర్ పరిధిలోని నాయకులతో చర్చించి, ఉప ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించేందుకు కార్యాచరణ రూపకల్పన, ప్రచార వ్యూహాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పార్టీ ఘన విజయానికి ప్రతినిధులంతా ఏకతాటిపై పని చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మన్నే కవిత గోవర్ధన్ రెడ్డి, చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, మేకల సునీత రాము యాదవ్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జేఏసి వెంకన్న, మురుగేష్, అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్, తోట నరేందర్ రెడ్డి, చిన్న యాదవ్, శివ గౌడ్, జనార్ధన్, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం-వీవీప్యాట్‌ల మొదటి రాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవిఎంలు), ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయిల్ (వివిప్యాట్) ల మొదటి రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పర్యవేక్షణలో, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ రాండమైజేషన్ ప్రక్రియను ఈవిఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా, జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 407 పోలింగ్ కేంద్రాల కోసం మొత్తం 569 బ్యాలెట్ యూనిట్లు, 569 కంట్రోల్ యూనిట్లు, 610 వివిప్యాట్ లు కేటాయించబడ్డాయి. ఈ రాండమైజేషన్ జాబితాను సంబంధిత రాష్ట్ర, జాతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పంచుకున్నారు. ఎంపికైన ఈవిఎంలు, వివిప్యాట్ లు సంబంధిత నియోజకవర్గ స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. తదుపరి, పోటీ అభ్యర్థుల తుది జాబితా ఖరారు అయిన తర్వాత, ఈ రాండమైజ్ చేసిన ఈవిఎంలు, వివిప్యాట్ ల వివరాలను అభ్యర్థులతో పంచుకుంటారు.

భారీ ర్యాలీతో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శుక్రవారం పండుగ వాతావరణం కన్పించింది. కాంగ్రెస్ అభ్యర్థి వి నవీన్ యాదవ్, నామినేషన్ దాఖలు సందర్భంగా ఉదయం 9 గంటలకు నవీన్ యాదవ్ ఇంటి నుంచి మొదలైన ర్యాలీ యూసఫ్ కూడా చౌరస్తా దగ్గర బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించిన నవీన్ యాదవ్ ఆ తర్వాత లక్ష్మీ నరసింహ నగర్ వెంకటగిరి మొదలైన బస్తీల, కాలనీల మీదుగా సుమారు 6 గంటల క భారీ ర్యాలీ అనంతరం రిటర్నింగ్ ఆఫీసర్ సాయిరాం కి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వేలాదిగా హాజరైన ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నవీన్ యాదవ్ జిందాబాద్, రేవంత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ మార్మోగిన నియోజకవర్గ. తెలంగాణ సంప్రదాయ పండగలైన బతుకమ్మ, బోనాలతో నవీన్ యాదవ్ ను ఆశీర్వదించిన మహిళలు. లైబాస్ హోటల్ దగ్గర మాజీ కార్పొరేటర్ సంజయ్ గౌడ్ తన అనుచరులతో కలిసి మిగితా వారితో కలిసి డప్పు వాయిస్తూ నవీన్ యాదవ్ కి ఘనా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారితో స్టీఫెన్ మనోజ్, సాయి, కుసల్ మొదలైన వారు పాల్గొన్నారు. ర్యాలీ లో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి, మాజీ ఎంపీ అజారుద్దీన్ , గ్రంధాలయ సంస్థ చైర్మన్ రియాజ్ తదితర కార్పొరేషన్ చైర్మన్ లు వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు.అనంతరం నామినేషన్ దాఖలు సందర్భంగా నవీన్ యాదవ్ తో పాటు మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు, సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షులు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, రహమత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్ రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

బోధన అభ్యసన మేళా విద్యార్థులకు మేలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : బోధన అభ్యసన మేళా వలన ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా విద్యార్థులు సులభంగా త్వరగా పాఠ్యాంశాలను అర్థం చేసుకోగలరని, విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంచడానికి ఈ మేళా దోహదపడుతుంది అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో ఒక్క రోజు నిర్వహించిన జిల్లా బోధన అభ్యసన మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మేళాను ప్రారంభించి స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు రూపొందించిన వినూత్న బోధన ఉపకరణాల ప్రదర్శన ద్వారా విద్యార్థులలో నైపుణ్యాలు అభివృద్ధి అవుతాయని ఆయన చెప్పారు. వినూత్న బోధనా పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా, బోధన నాణ్యతను పెంచడం ఈ మేళా ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ మేళాలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలను ఆయన సందర్శించి, ఎఎంఓను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేళాలో 17 పాఠశాలల నుంచి 175 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, సిఎంఓ సుధాకర్ రెడ్డి, ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, చంచల రవి, కొప్పోలు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ప్రాణాంతకం కాదు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసోత్సవంలో భాగంగా భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో క్యాన్సర్ సంబంధిత మరణాలకు ప్రధాన కారణం రొమ్ము క్యాన్సర్ అని కేర్ హాస్పిటల్స్ గుర్తుచేస్తోంది. అందుకే, మహిళలు క్రమం తప్పకుండా బ్రెస్ట్ చెకప్‌లు చేయించుకోవడం, ముందస్తు స్క్రీనింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం చాలా ముఖ్యం అని హెచ్చరిస్తోంది. 'రొమ్ము క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే పూర్తిగా నయం చేసుకోవచ్చు. ఎక్కువ మంది భారతీయ మహిళల్లో వ్యాధి ఇప్పటికే ముదిరిన తర్వాతే నిర్ధారణ అవుతుంది, దీని వల్ల చికిత్స ఫలితం తగ్గుతుంది. ముందస్తు హెచ్చరికల సంకేతాలను గుర్తించడంలో మామోగ్రామ్‌లు, స్వీయ-రొమ్ము పరీక్షలు చాలా అవసరం' అని హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్స్‌లోని కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సతీష్ పవార్ చెప్పారు. 'అవగాహనే రక్షణకు మొదటి అడుగు. మహిళలు ముడుతలు లేకుండా ఉండటం, రొమ్ములో ఆకారంలో మార్పులు, చర్మం గుంటలు లేదా చనుమొనలో ఉత్సర్గ వంటి లక్షణాలను అప్రతక్షంగా చూడకూడదు. చిన్న ఆలస్యం కూడా రోగ నిర్ధారణలో చికిత్స ఫలితాలను ప్రభావితం చేస్తుంది" అని డాక్టర్ సతీష్ చెప్పారు.

భద్రతా నియమావళి పాటించాలి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : రాబోయే దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని పోలీస్ స్టేషన్ పరిధిలో తాత్కాలిక, శాశ్వత క్రాకర్ వ్యాపార లైసెన్స్ కలిగిన వ్యాపారవేత్తలతో సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో భద్రతా ఏర్పాట్లు, స్టాల్స్ లేఅవుట్, భద్రతా నియమావళి అమలు, ఉల్లంఘనల నివారణ, ప్రజల భద్రత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించబడింది. అగ్ని మాపక శాఖ మరియు పోలీస్ శాఖ సూచించిన భద్రతా మార్గదర్శకాలను అన్ని వ్యాపారవేత్తలు కచ్చితంగా పాటించాల్సిందిగా ఆదేశించబడింది. ప్రతి స్టాల్ వద్ద తగిన అగ్ని మాపక పరికరాలు కలిగి ఉండాలి మరియు నిషేధిత క్రాకర్స్ విక్రయించరాదు అని సూచించబడింది. లైసెన్స్ నిబంధనలు లేదా భద్రతా మార్గదర్శకాలను ఉల్లంఘించిన పక్షంలో ఎ%జుఇజూశ్రీశింఱబవం¬ాష్% మరియు సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంగా తెలియజేయబడింది. ప్రజలు సురక్షితంగా దీపావళి పండుగను జరుపుకునేందుకు వ్యాపారవేత్తల సహకారం కోరారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు ప్రారంభం

విశాలాంధ్ర, పటాన్ చెరువు : పటాన్ చెరువు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా జరుగుతున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్, కబడ్డీ రెండవ రోజు పోటీలను శుక్రవారం ఉదయం పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి అల్పాహారం చేశారు. మూడు రోజులపాటు జరగనున్న పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లు జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. శనివారం సాయంత్రం ముగింపు పోటీలు జరుగుతాయని తెలిపారు.

కయేరాకు బంగారు పతకం

విశాలాంధ్ర , కాప్రా : నాచారం ఎస్ జి ఎఫ్ 69వ రాష్ట్ర బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో డెక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్ విద్యార్థిని కయేరా (అండర్ 17) 42కెజిల విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. ఇంతటి ఘనత సాధించిన కయెరా ఈ నెల 28న ఈశాన్య రాష్ట్రం అరుణాచల ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో జరిగధ జాతీయ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఎంపిక కావడం తెలంగాణకు గర్వకారణమని స్కూల్ చైర్మన్ నవనీతరావు ప్రశంసించారు. బాలికలు అన్నిరంగాలలో రాణించడం వారి ఆత్మస్థైర్యానికి నిదర్శనమన్నారు. జాతీయ స్థాయి పోటీలకు కయెరాను తీర్చిదిద్దుతున్నమని స్కూల్ ప్రిన్సిపాల్ అక్కినేని స్వర్ణ అన్నారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, కయెరాకు అభినందనలు తెలిపారు.

ట్రామా అండ్ ఆక్యూట్ సర్జరీ విభాగం ప్రారంభం

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రపంచ ట్రామా దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ, ప్రాణాలను రక్షించడంలో మరో ముఖ్యమైన అడుగు వేసింది. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రామా అండ్ ఆక్యూట్ సర్జరీ విభాగాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ వంటి నగరాల్లో ట్రామా (ఆకస్మిక గాయాలు) ఇప్పుడు కేవలం రోడ్డు ప్రమాదాలకు మాత్రమే పరిమితం కాదు. మెట్లు జారిపడటం, నిర్మాణ ప్రాంగణ ప్రమాదాలు, ఇంటి, కార్యాలయ గాయాలు వంటి సంఘటనలు కూడా పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సరం సుమారు 4.6 లక్షల రోడ్డు ప్రమాదాలు, 1.5 లక్షల మరణాలు, 3 లక్షల తీవ్రమైన గాయాలు సంభవిస్తున్నాయి. వీటిలో దాదాపు 50% మరణాలు సరైన సమయాన చికిత్స అందితే నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. హైటెక్ సిటీలోని మెడికవర్ హాస్పిటల్స్‌లో ఈ విభాగాన్ని డా. దామోదర్ కాకుమాను, కన్సల్టెంట్ ట్రామా, ఆక్యూట్ కేర్ సర్జన్ నేతృత్వంలో ప్రారంభించారు. ఆయన ఎయిమ్స్, న్యూఢిల్లీ నుండి పట్టా పొందారు. ఆయన మార్గదర్శకత్వంలో మెడికవర్‌లో అత్యాధునిక ట్రామా ప్రోటోకాల్స్, వేగవంతమైన స్పందన వ్యవస్థలు, మరియు బహుళ వైద్య విభాగాల సమన్వయంతో రోగుల ప్రాణరక్షణలో కొత్త దిశను చూపిస్తున్నారు. నగరాల్లో ట్రామా కేసులు సాధారణంగా జరుగుతుంటాయి. కానీ వాటిని చాలా సార్లు నిర్లక్ష్యం చేస్తారు. మొదట్లోనే గుర్తించి, వెంటనే స్పందిస్తే ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చు, అని డా. దామోదర్ కాకుమాను తెలిపారు. మెడికవర్ హైటెక్ సిటీలోని లెవల్-1 ట్రామా సెంటర్‌లో 24ఇ7 అత్యవసర వైద్య సేవలు, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్స్, జనరల్ మరియు ప్లాస్టిక్ సర్జరీ, క్రిటికల్ కేర్, ఫిజియోథెరపీ వంటి విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. ప్రమాదం జరిగిన క్షణం నుంచి పూర్తిస్థాయి కోలుకునే వరకు రోగికి సమగ్ర సేవలు అందించేలా విభాగం రూపొందించబడింది. రోగుల శారీరక, మానసిక పునరుద్ధరణపై కూడా ప్రత్యేక దృష్టి సారించబడింది. ప్రపంచ ట్రామా దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శ్రీచైతన్య ఐఐటీ క్యాంపస్, అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. డా. దామోదర్ కాకుమాను, ట్రామా కేర్ బృందం విద్యార్థులు, ప్రజలకు రోడ్డు భద్రత, బేసిక్ లైఫ్ సపోర్ట్, ప్రమాద సమయంలో చేయాల్సిన మొదటి చర్యలు, రక్తస్రావ నియంత్రణ, మరియు రోగిని సురక్షితంగా తరలించే విధానాలపై ప్రత్యక్ష ప్రదర్శనలు చేశారు. అనేకమంది విద్యార్థులు, ప్రయాణికులు పాల్గొని ట్రామా నివారణ, ప్రాణరక్షణ చర్యలపై అవగాహన పొందారు. రోడ్డు భద్రత, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగంపై సమాచారం కలిగిన బ్రోషర్లు, లీఫ్‌లెట్లు పంపిణీ చేయబడ్డాయి. సమాజంలో ప్రమాదాలపై అవగాహన పెంచడం, అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయడం లక్ష్యంగా మెడికవర్ హాస్పిటల్స్ నిరంతరం విద్యా, శిక్షణ మరియు ప్రజా కార్యక్రమాలు చేపడుతోందని ప్రతినిధులు తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి

విశాలాంధ్ర-మొయినాబాద్ : పాడి రైతులు పశువులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్ సూచించారు. మొయినాబాద్ మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో పశువైద్యాధికారిణి దేవిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు గాలికుంటూ వ్యాధి టీకాలు వేశారు. అమ్డాపూర్ గ్రామంలో జరిగిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో ముచ్చటించారు. ప్రతిరోజు ఉదయమే గ్రామాలకు వచ్చి టీకాలు వేసే పశు వైద్య సిబ్బందికి రైతులు సహకరించాలని తప్పని సరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

పాత, కొత్త రాజకీయాలకు ఎంతో బేధం :చిన్నారెడ్డి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: పాత, కొత్త రాజకీయాలకు ఎంతో బేధం ఉందని మాజి మంత్రి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో కనిగిరి సత్యనారాయణ ప్రసాద్ రచించిన 'ఈ 21వ శతాబ్దపు కొత్త రాజకీయ నీతి' పుస్తకాన్ని ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. నూతన తరానికి కొత్త కాన్సెప్ట్ ను ఈ పుస్తకం ద్వారా అందించడం శుభపరిణామం అని, రచయితను అభినందించారు. నేటి రాజకీయాల్లో తమ లాంటి నాయకులు ఈమడలేక పోతున్నారని వాపోయారు. ఈ పుస్తకాన్ని ప్రసాద్ చాలా ధైర్యంగా రాశారని కొనియాడారు. పాత కొత్త రాజకీయాలకు పోల్చి చూస్తే చాలా భేదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.సుబ్బారాయుడు, ప్రొ. మహేందర్ మిలేని, సీనియర్ జర్నలిస్ట్ అరవింద్, న్యాయవాది శ్రీకాంత్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

' స్టోవ్‌క్రాఫ్ట్' త్యోహార్ మేరా స్టైల్ ప్రచారం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : భారతదేశంలోని అగ్రగామి కిచెన్ అప్లయెన్స్ కంపెనీలలో ఒకటైన స్టోవ్‌క్రాఫ్ట్ లిమిటెడ్, తన ప్రముఖ బ్రాండ్ పిజన్ అప్లయెన్సెస్ పండుగ కాలానికి అనుగుణంగా 'త్యోహార్ మేరా స్టైల్' పేరుతో ప్రత్యేక ప్రచారాన్ని ప్రకటించింది. ఈ ప్రచారం భారతీయ పండుగల మారుతున్న రూపాన్ని ప్రతిబింబిస్తూ, దేశవ్యాప్తంగా ప్రజలు పండుగలను ఎలా జరుపుకుంటున్నారనే విషయానికి నూతన, ఆధునిక అర్థం ఇస్తుంది. ఈ ప్రచారాన్ని జెబెక్ కమ్యూనికేషన్స్ రూపకల్పన చేసింది. ఇది డిజిటల్-ఫస్ట్ విధానంలో రూపొందించబడింది, మెటా, యూట్యూబ్, ఇతర ప్రధాన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో ప్రచార చిత్రాలు విడుదలయ్యాయి. స్టోవ్‌క్రాఫ్ట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్ర గాంధీ మాట్లాడుతూ, "భారతదేశంలో పండుగలు ఆనందం, భోజనం, కుటుంబం, ఐక్యత, అలాగే వ్యక్తిగత వ్యక్తీకరణ గురించినవే. 'త్యోహార్ మేరా స్టైల్' ద్వారా ప్రతి ఒక్కరు తమదైన రీతిలో పండుగలను ఎలా జరుపుకుంటారో ఆ ప్రత్యేకతను మేము జరుపుకుంటున్నాం" అన్నారు. స్టోవ్‌క్రాఫ్ట్ మార్కెటింగ్ హెడ్ అమితాభ్ భాటియా మాట్లాడుతూ, "ప్రతి కుటుంబం పండుగలను జరుపుకునే తనదైన ప్రత్యేక పద్ధతులు, చిన్న చిన్న మార్పులు కలిగి ఉంటుంది. 'త్యోహార్ మేరా స్టైల్' ద్వారా ఆ ప్రత్యేకతను జరుపుకోవాలనుకున్నాం" అని అన్నారు. ఈ ప్రచారం పిజన్ బ్రాండ్ తత్వం "సూపర్ ఖుష్ హై హమ్" ను ప్రతిబింబిస్తుంది. 65,000 కిపైగా అవుట్‌లెట్లతో, 14కు పైగా దేశాలకు ఎగుమతులతో, స్టోవ్‌క్రాఫ్ట్ తన విశ్వసనీయ బ్రాండ్‌లైన పిజన్ మరియు గిల్మా ద్వారా భారత గృహాలలో కొత్త ఆవిష్కరణలు, సౌకర్యం, సాంస్కృతిక అనుసంధానాన్ని తీసుకువస్తోంది.

ఘనంగా సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర , కాప్రా : తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ళ సతీష్ రెడ్డిపుట్టిన రోజు వేడుకలను ఆయన తన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల రామారావుని, మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్‌రావుని కలిసి వారి ఆశీర్వాదం తీసుకొన్నారు. అనంతరం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా కాప్రా సర్కిల్ మున్సిపల్ పారిశధ్య కార్మికులకు బట్టల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 16 సంవత్సరములుగా తన పుట్టినరోజు సందర్భంగా పరిశుధ్య కార్మికులకు బట్టలు ఇచ్చి భోజనాలు పెట్టి వారితో కలసి పుట్టిన రోజు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు అడిషనల్ డీసీపీ వెంకటరమణ , కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్, ఎస్సై సతీష్ మాజీ కార్పొరేటర్ పావనిరెడ్డి, అన్ని పార్టీ నాయకులు, అన్ని కాలనీ అధ్యక్ష కార్యదర్శులు , యువ సంఘాలు, నాయకులు వారిని ఆశీర్వదించారు.

పేదలకు చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర, పటాన్ చెరువు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నేడు నిరుపేదలకు వరంగా మారాయని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గం పరిధిలోని అమీన్పూర్, రామచంద్రపురం, గుమ్మడిదల, జిన్నారం, పటాన్చెరు రెవెన్యూ మండలాల పరిధిలోని 105 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన ఒక కోటి 5 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, గుమ్మడిదల మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ప్రమోద్ గౌడ్, ఐలేష్, బండి శంకర్, వెంకటేష్, షేక్ హుస్సేన్, రంశెట్టి, శివా రెడ్డి, ఆయా మండలాల తహసిల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

'న్యూ షాప్ కెఫే' ప్రారంభం

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ మెట్రో స్టేషన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'న్యూ షాప్ కెఫే'ను శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో నిర్వాహకులు శ్రీ సాయిబాబా గారిని శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో నిర్వాహకులు గౌతమ్, ఫణి, భవాని ప్రసాద్ రెడ్డి మరియు నాయకులు భాస్కర్,రమేష్ గౌడ్, మధు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల మహా పాదయాత్ర ప్రారంభం

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్ పల్లిలో గల శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో జరిగిన శబరిమల మహా పాదయాత్ర ప్రారంభోత్సవం కార్యక్రమంలో కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి , ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి , అయ్యప్ప స్వాములు, భక్తులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పీఏసీ చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ స్వాములకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గంపై మోదీ సర్కారు ముప్పేట దాడి

- నూతన విధానంతో కార్పొరేట్ల నియంత్రుత్వం
- కార్మికులు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్
- రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: కేంద్రప్రభుత్వం తాజాగా ప్రకటించిన నూతన కార్మిక విధానాన్ని కార్మికవర్గం పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్ స్పష్టం చేశారు. బ్రిటిష్ పాలనా కాలంనుండి పారిశ్రామిక వివాదాల పరిష్కారం కోసం అమల్లో ఉన్న త్రైపాక్షిక సంప్రదింపుల వ్యవస్థను నూతన కార్మికవిధానం నీరు కారుస్తుందని, మధ్యవర్తిత్వం స్థానంలో కార్పొరేట్ వర్గాల ఏకపక్ష నియంతృత్వం కొనసాగుతుందని, కార్మికుల పక్షాన పనిచేయాల్సిన కార్మికశాఖ తన స్వరూపాన్ని , స్వభావాన్ని కోల్పోతుందని రవీంద్రనాథ్ అన్నారు. నూతన కార్మిక విధానం కార్మికహక్కులకు గొడ్డలిపెట్టని ఆయన అభివర్ణించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ రెండురోజుల సమావేశాలు శుక్రవారం ప్రారంభయ్యాయి. ముందుగా ఏఐటీయూసీ పతాకాన్ని సిపాయిపేటలోని భవననిర్మాణ కార్మికసంఘ కార్యాలయం వద్ద యూనియన్ సీనియర్ నాయకుడు నెక్కంటి సుబ్బారావు ఎగురవేశారు. అనంతరం కామ్రేడ్ పూడి సుబ్బారావు ప్రాంగణంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు దూసనపూడి సోమ సుందర్, జె. లలితమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. స్వాగతోపన్యాసంలో సోమ సుందర్ మాట్లాడుతూ ఏఐటీయూసీకి తాడేపల్లిగూడెంలో ఎంతో ఘనమైన పోరాట చరిత్ర ఉందన్నారు. 1943లో అమరజీవి ఎంవీఎన్ కపర్ధి పంచాయతీ కార్మికులతో తాడేపల్లిగూడెంలో తొలి కార్మికసంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. నాటినుండి గత ఎనభైమూడు సంవత్సరాలుగా కార్మిక హక్కులకోసం, కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం ఏఐటీయూసీ కృషిచేస్తూ వచ్చిందన్నారు. స్థానిక కార్మికోద్యమానికి నాలుగోతరం కార్యకర్తలు నాయకత్వం వహిస్తున్నారని వివరించారు. సీపీఐ తరపున మున్సిపల్ కౌన్సిలర్ గా ఎన్నికై విశేషకృషి చేసి, ఇటీవల కన్నుమూసిన పూడి సుబ్బారావు పేరిట సమావేశం ప్రాంగణాన్ని ఏర్పాటు చేశామన్నారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. కార్మిక వర్గంపై కేంద్రంలోని మోదీ సర్కారు ముప్పేట దాడి చేస్తోందని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 49 కార్మిక చట్టాలను కేంద్రం కాలరాస్తోందని... నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి కార్మికహక్కులపై దాడి చేస్తున్నదన్నారు. కార్మికసంఘాలతో సంప్రదింపులు జరపకుండా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లతో ఇప్పటికే కార్మికులు తమ హక్కులు కోల్పోయారని , నూతన కార్మిక విధానం కార్మికులను మరింతగా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేలా తయారు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ నవంబర్ 26న నిరసనలు నిర్వహిస్తామని తెలిపారు. నూతన కార్మిక విధానాన్ని, నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించాలని కోరుతూ పోరాడాలని ఏఐటీయూసీ నిర్ణయించిందన్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మిక వర్గంపై కక్షగట్టి పనిగంటలు ఎనిమిది నుంచి 12 గంటలకు మారుస్తూ నిర్ణయం తీసుకోవడం దారుణం అన్నారు. మహిళలు సైతం రాత్రిపూట పని చేయాలని నిర్ణయించడం కూడా సరికాదన్నారు. చాపకింద నీరులా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దశలవారీగా జరుగుతోందన్నారు. కార్మిక వర్గాలు, ప్రతిపక్షం పోరాటాలు చేస్తున్నప్పటికీ సెయిల్ లో విలీనం లేదా సొంత గనులు ఏర్పాటు చేయలేదన్నారు. మిట్టల్ కంపెనీకి అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కేంద్రం, రాష్ట్రం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా కార్మికులు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ... సాంకేతికత పెరిగిన నేపథ్యంలో , వృత్తులలో వచ్చిన మార్పులకు అనుగుణంగా కార్మికోద్యమం కూడా విస్తృతం కావాలని పిలుపు ఇచ్చారు. అసంఘటిత రంగంలో 90 శాతం కార్మికులు ఉన్నారని, నాలుగు కార్మిక కోడ్లు వారిని నిర్లక్ష్యం చేశాయన్నారు. కనీస వేతన బోర్డులు కనుమరుగవుతున్నాయ న్నారు. కార్మికులు కొత్త సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ పాలకవర్గాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక వర్గానికీ, శ్రామిక ప్రజానీకానికి ఏఐటీయూసీ బాసటగా నిలవాలన్నారు. ఏఐటీయూసీ ఉద్యమాన్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర కౌన్సిల్ చర్చించాలని సూచించారు. రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకట సుబ్బయ్య ఇటీవల కాలంలో ఏఐటీయూసీ నిర్వహించిన కార్యకలాపాలపై నివేదిక సమర్పించారు. రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు మాట్లాడుతూ సంస్థాగత యంత్రాంగాన్నీ, కేడర్లను పటిష్టం చేయడంపై దృష్టి సారించాలని కోరారు. సమావేశాల ప్రారంభంలో ఇటీవల కన్నుమూసిన కార్మిక , కమ్యూనిస్టు నేతలకు సంతాపం తెలిపే తీర్మానాన్ని రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి ప్రతిపాదించగా సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించింది. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్ విప్లవగీతాలు ఆలపించారు. రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చిన కార్మిక నాయకులను తాడేపల్లిగూడెం ఏరియా సమితి తరపున అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, కార్యదర్శి మందలపర్తి హరీశ్, ఏరియా సమితి నాయకులు కే లక్ష్మీనారాయణ, కళింగ లక్ష్మణరావు, తాడికొండ శ్రీనివాసరావు, పోలిరాతి ఆదినారాయణ సత్కరించారు.

తెలంగాణలో బీసీ బంద్‌కు సంఘీభావం

నేడు మచిలీపట్నంలో బీసీ సంఘాల సమావేశం: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణలో బీసీలు చేపట్టిన బంద్‌కు ఏపీలోని బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల తరపున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో బీసీలు చేపట్టిన బంద్‌కు ఏపీలోని బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల తరపున సంఘీభావం ప్రకటిస్తున్నామని తెలిపారు. ఆ బంద్‌కు సంఘీభావం ప్రకటిస్తూ ఈనెల 18వ తేదీన మచిలీపట్నంలో బీసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేపట్టడమే కాకుండా, బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందిందని, ఆ బిల్లులను గవర్నర్ ఇప్పటికీ ఆమోదించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. కొద్దిమంది హైకోర్టును ఆశ్రయించడంతో తెలంగాణలో మొత్తం ఎన్నికల ప్రక్రియ ఆగిపోయేలా ఉందని, ఈ చర్యలకు నిరసనగా తెలంగాణవ్యాప్తంగా బీసీలు బంద్‌కు పిలుపునిచ్చారన్నారు. తెలంగాణ తరహాలో జనగణనలో కులగణన చేపట్టాలని, బీసీల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని ఆంధ్రప్రదేశ్‌లోనూ డిమాండ్ చేస్తున్నామని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో ఆయా కులాల ఆర్థిక స్థితిగతులు, విద్య, ఉపాధి మార్గాలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి... ఆయా వర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మూడు నెలల ముందుగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతున్నారని, ఆ ఎన్నికలకు ముందుగానే జనగణలో కుల గణన చేపట్టి... బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భవిష్యత్తును మార్చేది సంస్కరణలే

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలు శుక్రవారం ముఖ్యమంత్రిని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 17 మంది విద్యార్థినీ విద్యార్థులైన విజేతలకు చంద్రబాబు సర్టిఫికెట్లు అందించారు. చిన్నారులతో కాసేపు ముఖ్యమంత్రి ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకున్నారా అని సీఎం అడిగారు. నిత్యావసరాల్లోని చాలా వస్తువులు సున్నా శాతం, 5 శాతం స్లాబ్ పరిధిలోకి వస్తున్నాయని, దీనివల్ల చాలా వరకు ధరలు తగ్గుతాయని విద్యార్థులు చెప్పారు. విత్తనం నాటిన కొంత కాలానికి చెట్టు ఫలాలు ఇస్తున్నట్టు... సంస్కరణలను ఇప్పుడు అమలు చేస్తే కొన్ని రోజుల తర్వాత ఆ ఫలితాలు ప్రజలకు అందుతాయని సీఎం వివరించారు. జీఎస్టీ వంటి సంస్కరణలను అర్థం చేసుకుని వాటిపై వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీల్లో పాల్గొనడం... వాటిల్లో విజేతలుగా నిలవడం అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డికి ఊరట

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : మద్యం కుంభకోణం కేసులో నిందితుడుగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో ఊరట లభించింది. పార్లమెంట్ ప్రతినిధి బృందంగా న్యూయార్క్ వెళ్లాల్సి ఉన్నందున అనుమతి ఇవ్వాలని కోరుతూ మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు.. .అనుమతి ఇస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే, ఈనెల 23 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు న్యూయార్క్ వెళ్లడానికి అనుమతి కోరుతూ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... న్యాయస్థానం షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. రూ.50 వేల విలువచేసే రెండు జామీన్లను కోర్టులో సమర్పించాలని, న్యూయార్క్‌లో ఎక్కడ బస చేస్తున్నారు అనే వివరాలను కోర్టుకు అందజేయాలని ఆదేశాల్లో పేర్కొంది. మరోవైపు ఏపీ మద్యం కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితులకు ఏసీబీ కోర్టు ఈ నెల 24 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్లు, సిట్ తరపు న్యాయవాదలు తమ వాదనలు వినిపించారు. ఈకేసుకు సంబంధించి సిట్ అధికారులు కీలక ఆధారాలు సేకరించారని, ఒకవేళ నిందితులకు బెయిల్ ఇస్తే... సాక్షుల్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని సిట్ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం... తీర్పును రిజర్వ్ చేస్తూ రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దిల్లీలోని ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ నిర్వహించిన రెండవ ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025-26 పోటీలు శుక్రవారం విజయవంతంగా ముగిశాయి. ఈ నెల 13 నుంచి 17 వరకు మంగళగిరి ఆరో బెటాలియన్ స్పెషల్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా డీజీపీ, క్లస్టర్ చైర్మన్ హరీశ్‌కుమార్ గుప్తా విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) -గుంటూరు, వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)- అమరావతిలో నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సీపీవోల నుంచి వచ్చిన 32 జట్లకు చెందిన 1,010 మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా విభాగాల్లో ఉత్తర్ ప్రదేశ్ 37 పతకాలతో మొదటి స్థానంలో నిలిచింది. బీఎస్ఎఫ్ 33 పతకాలతో రెండవ స్థానం, ఐటీబీపీ 20 పతకాలతో మూడవ స్థానం సాధించాయి. ఆంధ్రప్రదేశ్ 11 పతకాలతో ఆరో స్థానంలో నిలిచింది. యోగాలో బీఎస్ఎఫ్‌కు చెందిన సోనియా కుమారి మహిళల విభాగంలో అత్యధిక పతకాలు గెలుచుకోగా, పురుషుల విభాగంలో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రాజీవ్ కుమార్ రాణించారు. డీజీపీ గుప్తా మాట్లాడుతూ పోలీస్ క్రీడాకారుల క్రమశిక్షణ, పట్టుదల అందరికీ స్ఫూర్తినిచ్చాయన్నారు.

ఆర్ఎస్ఎస్‌లో లైంగిక వేధింపులపై దర్యాప్తు

ఎన్‌హెచ్ఆర్‌సీకి రాసిన లేఖలో సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ డిమాండ్

న్యూదిల్లీ: కేరళలో ఆర్ఎస్ఎస్ కార్యకర్త మరణం, ఆ సంస్థలో లైంగిక వేధింపుల ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ శుక్రవారం ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్మన్ వి.రామసుబ్రమణ్యంకు లేఖ రాశారు. ఆనందు అజి మరణానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూ... అజి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారని, అయితే ఇక్కడ 'తీవ్రమైన' మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని రాజ్యసభ ఎంపీ సంతోశ్ కుమార్ ఆ లేఖలో ఆరోపించారు. కమిషన్ పర్యవేక్షణలో 'తక్షణ, స్వతంత్ర, పారదర్శక విచారణ' కు ఆయన డిమాండ్ చేశారు. కొట్టాయం జిల్లాలోని తంపలక్కాడ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అజి అక్టోబరు 9న తంపనూర్‌లోని ఒక లాడ్జిలో చనిపోయాడు. ఒకరోజు తర్వాత అతని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక పోస్ట్ కనిపించింది. అందులో అతను తన మరణానికి ఆర్ఎస్ఎస్‌ను బాధ్యులుగా పేర్కొన్నాడు. అతని కుటుంబానికి దగ్గరగా ఉన్న వ్యక్తి చిన్నప్పటి నుంచి తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపించాడు. అజి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్త. ఆ సంస్థతో చాలా కాలంగా అనుబంధం ఉన్న కుటుంబానికి చెందినవాడు. 'ఆనందు అజీ మరణం విషాదకరం. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లోని అనేక మంది సభ్యులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ అజి తన చివరి సోషల్ మీడియా పోస్ట్‌లో చేసిన తీవ్రమైన విషయాలు, జాతీయ మానవ హక్కుల కమిషన్ తక్షణ జోక్యాన్ని కోరుతున్నాయి' అని సీపీఐ ఎంపీ పేర్కొన్నారు. 'నిర్దిష్ట ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను పేర్కొంటూ... ఆర్ఎస్ఎస్ శిబిరాల్లో తరచూ జరిగే దుర్వినియోగ ఘటనలను ప్రస్తావిస్తూ బాధితుడు అజి చేసిన బహిరంగ ప్రకటన కేరళ, వెలుపల దిగ్భ్రాంతిని కలిగించింది. అజి పోస్ట్‌లోని విషయాలు కేవలం ఒక వ్యక్తిగత విషాదాన్ని వెల్లడి చేయడమే కాకుండా, సంస్థలోని కొన్ని విభాగాలలో పని చేస్తున్న పెద్ద, వ్యవస్థీకృత, లోతుగా దోపిడీ సంస్కృతి ఉనికిని సూచిస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఎన్‌హెచ్ఆర్‌సీ ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని లేదా అజి మృతికి సంబంధించి తక్షణ పరిస్థితులపై, ఆర్ఎస్ఎస్‌పై ఆరోపించబడిన లైంగిక దోపిడీ, బలవంతానికి చెందిన విస్తృత వ్యవస్థ రెండింటిపై కాలానుగుణంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడానికి తగిన సంస్థను ఆదేశించాలని అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. మరణించిన వ్యక్తి తన పోస్ట్‌లో పేర్కొన్న వ్యక్తులందరినీ దర్యాప్తు పరిధిలోకి తీసుకురావాలని, సాక్షుల రక్షణ, గోప్యత, బాధితులకు మానసిక సహాయం అందించడానికి ప్రతి ప్రయత్నం చేయాలని సంతోశ్ కుమార్ కోరారు. 'విచారణ కేవలం నేరపూరిత నేరాన్ని నిర్ధారించడంపై మాత్రమే దృష్టి పెట్టకూడదు. సంస్థ, దాని అనుబంధ నిర్మాణాలలో నేరస్థుల బెదిరింపు, సంస్థాగత రక్షణ క్రమబద్ధమైన నమూనా ఉందా అని కూడా పరిశీలించండి' అని విజ్ఞప్తి చేశారు. ప్రజల పరిశీలనకు మించి తరచుగా పనిచేసే అటువంటి సంస్థల పనితీరు, అంతర్గత సంస్కృతిపై జాతీయ శ్రద్ధ అవసరమని తీవ్ర బాధ కలిగించే ఈ కేసు నొక్కి చెబుతుందన్నారు. 'ఎన్‌హెచ్ఆర్‌సీ ద్వారా నిర్ణయమైన, సున్నితమైన విచారణ భారతదేశం మానవ హక్కులు, న్యాయం పట్ల నిబద్ధతకు బలమైన ధ్రువీకరణగా ఉపయోగపడుతుంది. ప్రభావవంతమైన స్థానాల్లో ఉన్నవారు లైంగిక హింస, దోపిడీ చర్యలకు జవాబుదారీతనం నుంచి తప్పించుకోకుండా చూసుకోవాలి' అని ఆయన అన్నారు. ఈ విషయాన్ని కమిషన్ వెంటనే గ్రహించి ఆలస్యం లేకుండా స్వతంత్ర విచారణను ప్రారంభించాలని కోరారు.

గుజరాత్‌లో కొలువుదీరిన కొత్తమంత్రివర్గం

అహ్మదాబాద్: గుజరాత్‌లో కొత్తమంత్రివర్గం కొలువు దీరింది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మంత్రులంతా గురువారం రాజీనామా చేశారు. 26 మందితో కొత్త మంత్రుల పేర్లను ముఖ్యమంత్రి శుక్రవారం ప్రకటించారు. కొత్తమంత్రులతో గవర్నరు ఆచార్య దేవవ్రత ప్రమాణం చేయించారు. గుజరాత్ ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత హర్ష్ రమేష్‌భాయ్ సంఘవీ ప్రమాణస్వీకారం చేశారు. సంఘవితో పాటు బీజేపీ నేతలు స్వరూజ్‌జీ ఠాకూర్, ప్రవీణ కుమార్ మాలి, రుషీకేశ్ పటేల్, దర్శన్ వాఘేలా, కున్వర్‌జీ బవలియా, రివబ జడేజా, అర్జున్ మోద్వాడియా, పర్షోత్తమ్ సోలంకి, జితేంద్ర వాఘాని, ప్రఫుల్ పాన్‌షేరియా, కునుభాయ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన ఆరో వ్యక్తి సంఘవి. కాంగ్రెస్ నేత చిమన్‌భాయ్ పటేల్ తొలి ఉప ముఖ్యమంత్రిగా 1972 నుంచి 73 వరకూ పనిచేశారు. పటేల్‌తో పాటు కాంగ్రెస్ మరో నేత కాంతిలాల్ ఘూయ్ ఇదే సమయంలో ఉప ముఖ్యమంత్రిగా అప్పటి ముఖ్యమంత్రి ఘన్‌శ్యామ్ ఓజా మంత్రివర్గంలో పనిచేశారు. మూడో ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత కేశూభాయ్ పటేల్ 1990 మార్చి నుంచి అక్టోబర్ వరకూ అప్పటి సీఎం చిమన్‌భాయ్ పటేల్ నాయకత్వంలో పనిచేశారు. పటేల్ సైతం ముఖ్యమంత్రిగా 1995 మార్చి నుంచి అక్టోబర్ వరకూ, తిరిగి 1998 మార్చి నుంచి 2001 వరకూ పనిచేశారు. 1994 ఫిబ్రవరి నుంచి 1995 మార్చి వరకూ కాంగ్రెస్ నేత నరహరి అమిన్ ఉపముఖ్యమంత్రిగా అప్పటి ముఖ్యమంత్రి ఛబిల్‌దాస్ మెహతా సారథ్యంలో పనిచేశారు. ఆ తర్వాత నితిన్‌భాయ్ పటేల్ ఉప ముఖ్యమంత్రిగా విజయ్ రూపానీ ప్రభుత్వంలో 2016 ఆగస్టు నుంచి 2021 సెప్టెంబర్ వరకూ పనిచేశారు.

జడేజా సతీమణికి మంత్రి పదవి

టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజాకు మంత్రి పదవి దక్కింది. గుజరాత్‌లో 26 మందితో కూడిన కొంత మంత్రి వర్గాన్ని సీఎం భూపేంద్ర పటేల్ ప్రకటించారు. అందులో జడేజా సతీమణి రివాబా జడేజాకు తొలిసారి మంత్రి పదవి దక్కింది. 2019 మార్చిలో బీజేపీలో చేరిన రివాబా జడేజా... 2022 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో జామ్‌నగర్ నార్త్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రివాబా జడేజాకు వ్యతిరేకంగా రవీంద్ర జడేజా సోదరి నైనబా జడేజా, తండ్రి అనిరుద్ధ్ సిన్హ్ జడేజా ప్రచారం చేసినా ఆమె విజయం సాధించారు. రవీంద్ర జడేజా కుటుంబం ఎన్నో తరాలుగా కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారులుగా ఉన్నారు. అయినా వారి వ్యతిరేకతను తట్టుకుని రివాబా 15 వేల మెజార్టీతో గెలుపొందారు. రాజీనామా చేసిన మంత్రుల నుంచి ఆరుగురు మాత్రమే తమ పదవులను నిలబెట్టుకున్నారు.

కల్తీ మద్యమే!

- కాకినాడ ల్యాబ్ నివేదిక
- ములకలచెరువు నమూనాలపై పరీక్షలు
- కస్టడీకి 10 మంది నిందితులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ములకలచెరువు కల్తీ మద్యం వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఒక వైపు అరెస్టులు, కస్టడీలు... మరోవైపు కల్తీ మద్యం కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తాజాగా ల్యాబ్ నివేదికలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న జనార్దన్‌రావు తయారు చేసిన కల్తీ మద్యం నాణ్యత లేదని నివేదికలో స్పష్టమైంది. 45 నమూనాలపై పరీక్షలు చేసిన కాకినాడ ల్యాబ్ నివేదికను వెల్లడించింది. స్ట్రెంత్ ప్రమాణాలు పాటించకుండా మద్యం తయారు చేసినట్లు తేలింది. 25 గా ఉండాల్సిన అండర్ ప్రూఫ్ (యూపీ) 35 గా నమోదయింది. 75 గా ఉండాల్సిన ఓవర్ ప్రూఫ్ 65గా ల్యాబ్ రిపోర్టులో తేలింది. ప్రమాణాలకు విరుద్ధంగా మద్యం తయారు చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో కల్తీ మద్యం తయారీ కేంద్రం బయటపడటం కలకలం రేపింది. ఆ తర్వాత తీగలాగితే.... డొంక కదిలినట్లుగా దీని వెనుక ఉన్న నిందితులు ఒక్కొక్కరుగా బయటపడ్డారు. ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్ధన్‌రావు అరెస్ట్ అయ్యారు. ఈ వ్యవహారం కొనసాగు తుండగానే... ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో భారీ ఎత్తున నకిలీ మద్యం బాటిళ్లు దొరకడం చర్చనీయాంశమైంది. ములకలచెరువు కల్తీ మద్యం కేసు విచారణలో భాగంగానే... ఈ బాగోతం వెలుగుచూడటం ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అప్రమత్తమై కల్తీ మద్యం నివారణకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చింది. జీవీజీ అశోక్ కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసింది. దీనిపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. కల్తీ ఉందని తెలిసే ఈ యాప్ తెచ్చారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. సిట్‌పై తమకు నమ్మకం లేదని, సీబీఐతో విచారణ జరిపించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

కల్తీ కేసులో యూ ట్యూబర్ అరెస్ట్

నకిలీ మద్యం కేసులో అనేక విషయాలు వెలుగు చూస్తున్నాయి. నంద్యాలకు చెందిన యూ ట్యూబ్ విలేకరి అల్లాబకాష్ కీలక పాత్ర ఉన్నట్లు పోలీసులు తేల్చారు. ఎక్సైజ్ అధికారులు అల్లాబకాశ్‌ను అరెస్టు చేసి విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. 20 ఏళ్ల పాటు హైదరాబాద్‌లో చిన్న ఉద్యోగం చేసి ఏడాది క్రితం నంద్యాలకు వచ్చి యూట్యూబ్ ఛానల్‌ను సృష్టించుకుని విలేకరిగా చలామణి అవుతున్నాడు. హైదరాబాద్ లకిడీకపూల్‌లోని సాయి పెయింటింగ్ ప్రెస్‌లో నకిలీ లేబుళ్లను తయారు చేశాడు. లేబుళ్లను ఇచ్చినందుకు గాను ఫోన్‌పే ద్వారా అల్లాబకాశ్ ఖాతాలోకి నిందితులు డబ్బులు జమ చేశారు. మూడు రోజుల క్రితం ఎన్జీవో కాలనీలో అల్లాబకాశ్ ఇంట్లో ఎక్సైజ్ అధికారులు సోదాలు చేసి కంప్యూటర్లను సీజ్ చేశారు. అనంతరం అతనిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతనిని ఏ16గా గుర్తించారు. కోర్టు అల్లబకాశ్‌కు 27వ తేదీ వరకు రిమాండ్ విధించగా... నిందితుడిని జైలుకు తరలించారు.

కస్టడీకి 10 మంది నిందితులు

అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో 10 మంది నిందితులను ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. రెండు రోజులపాటు వారిని విచారించనున్నారు. నిందితులు సురేంద్ర నాయుడు, కట్టా రాజుతో పాటు 10 మందిని మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో ప్రశ్నిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం కేసుపైనా ఎక్సైజ్ పోలీసులు దృష్టిపెట్టారు. జనార్ధనరావు ఇచ్చిన సమాచారం ఆధారంగా విచారిస్తున్నారు. ఇప్పటికే జనార్ధనరావుకు సంబంధించిన మద్యం దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించి ఒక దుకాణాన్ని సీజ్ చేశారు. ఇబ్రహీంపట్నంలోని కొందరు రాజకీయ పార్టీల నేతలపై ఇళ్లపై పోలీసులు దాడులు చేసి వాళ్ల ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అటు జనార్ధనరావు ఇటీవల మీడియాకు వీడియో విడుదల చేస్తూ... జోగి రమేశ్ చెబితేనే కల్తీ మద్యం చేశానని సంచలన వ్యాఖ్యలు చేశారు. దానిపై జోగి రమేశ్ తనకు సంబంధం లేదని, దమ్ముంటే నిరూపించాలంటూ సీఎం చంద్రబాబుకు, లోకేశ్‌కు సవాల్ విసిరారు. ఆ తర్వాత జోగి రమేశ్ వాట్సాప్ ఛాటింగ్ విడుదలవడం చర్చనీయాంశమైంది. జోగి పాత్రపైనా ఎక్సైజ్ అధికారులు, సిట్ బృందం ఆరా తీస్తున్నట్లు సమాచారం.

వైమానిక దళానికి తిరుగులేని శక్తి

తేజస్-ఎంకే1ఏ రాకతో పెరిగిన సామర్థ్యం

రక్షణ రంగంలో కీలక అడుగు

న్యూదిల్లీ: రక్షణ రంగంలో భారత్ కీలక అడుగు వేసింది. స్వదేశీ యుద్ధ విమానం తేజస్-ఎంకే1ఎ శుక్రవారం నాసిక్‌లో తన మొదటి అధికారిక విమానయానాన్ని ప్రారంభించింది. తేజస్ ఎంకే1ఎ రాకతో భారత వైమానిక దళ సామర్థ్యం పెరిగి తిరుగులేని శక్తిగా అవతరించే స్థాయికి ఎదిగింది. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ విమానాన్ని హిందూస్థాన్ ఏరోనా టిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) తయారు చేసింది. ఇదే కార్యక్రమంలోనే ఎల్‌సీఏ (లైట్ కంబాట్ ఎయిం క్రాఫ్ట్) కోసం హెచ్ఏఎల్ మూడవ ఉత్పత్తి లైన్, హెచ్‌టీటీ-40 శిక్షణ విమానం కోసం దాని రెండవ ఉత్పత్తి లైన్ ప్రారంభించారు. ఈ పరిణామాలు భారతదేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో కీలక ముందు అడుగుగా నిపుణులు పేర్కొన్నారు.

తేజస్-ఎంకే1ఏ ప్రత్యేకతలివే...

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన యుద్ధ విమానం తేజస్. ఇది 4.5 తరం బహుళ పాత్ర పోషించే యుద్ధ విమానం. అంటే ఇది ఏకకాలంలో వాయు, భూమి, సముద్ర దాడుల మిషన్లను నిర్వహించగలదు.తేజస్-ఎంకే1 విమానం ఇప్పటికే వైమానిక దళం సేవలో ఉంది. తేజస్-ఎంకే1ఎ దీని ఆధునిక వెర్షన్. సరికొత్త సాంకేతికతలను కలిగిన ఈ కొత్త యుద్ధ విమానాల రాకతో భారత వైమానిక దళం మరింత శక్తివంతం అవుతుందని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా తేజస్ అనేక ట్రయల్ విమానాలను నిర్వహించింది. కానీ శుక్రవారం భారత వైమానిక దళంలోకి ప్రవేశించిన ఈ విమానం వాటితో పోల్చితే చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇది వైమానిక దళంలోకి ప్రవేశించడానికి ముందు తయారీ చివరి దశను సూచిస్తుంది. ఈ విమానం అభివృద్ధికి హెచ్ఏఎల్ ఎంతో కృషి చేసింది. ఇంజిన్ రాక ఆలస్యంతో ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి అధిక సమయం పట్టింది. కానీ జనరల్ ఎలక్ట్రిక్ ఇప్పుడు నాలుగు ఇంజిన్లను డెలివరీ చేయడంతో ఎంకే1ఎ యుద్ధ విమానం భారత వైమానిక దళంలో చేరింది. ఈ ఏడాది మొత్తం 12 యుద్ధ విమానాలు సైన్యానికి అందించాల్సి ఉండగా, ప్రస్తుతం పది విమానాలు సిద్ధంగా ఉన్నాయి. అలాగే స్వదేశీ అస్త్రా బీవీఆర్ (బియాండ్ విజువల్ రేంజ్) ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి, ఏఎస్ఆర్ఏఏఎం (అడ్వాన్స్‌డ్ షార్ట్ రేంజ్ ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి), లేజర్-గైడెడ్ బాంబుల ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేశారు. భారత వైమానిక దళానికి తేజస్ విమానాలు ఎంతో అవసరం. సెప్టెంబర్ 26న రెండు మిగ్-21 స్క్వాడ్రన్లు (మొత్తం 40 విమానాలు) రిటైర్ అయ్యాయి. దీంతో వైమానిక దళం ఫైటర్ స్క్వాడ్రన్ బలం ఇప్పుడు 30కి తగ్గింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్, చైనా నుంచి ఐదవ తరం ఫైటర్ జెట్లను కొనుగోలు చేస్తోంది. చైనా కూడా తన విమానాలన్నింటినీ ఐదవ తరం విమానాలకు మారుస్తోంది. ఈక్రమంలో భారతదేశం తన బలాన్ని పెంచుకోవాలని విశ్లేషకులు చెబుతున్నారు. తేజస్ ఈ లోటును భర్తీ చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2021లో 83 తేజస్ ఎంకే1ఎ లు ఆర్డర్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.